అనుదినం... జనస్వరం

# నవతెలంగాణ

బుధవారం 23-10-2019

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 5 | సంచిక : 296 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు | వెల : 6.50

SPEEDY GOLD LOAN
మీ బంగారు ఆభరణాలపై తక్షణమే రుణం
ప్రతి గ్రాముపై అత్యధిక ఋణం
నెలకు వడ్డీ కేవలం 95 పైసలు మాత్రమే
SHRIRAM City
MONEY WHEN YOU NEED IT MOST
040 42915112
SCUF GOLD to 54999
MISSED CALL 044-30123479



ఎట్టకేలకు.. 18వ రోజు

# దిగొచ్చిన సర్కార్

## ఆర్టీసీ జేఏసీతో చర్చలకు ఓకే..



(ఫైల్)

### ఆరుగురు ఈడీలతో కమిటీ

- కోర్టు ఆదేశాలపై సీఎం సుదీర్ఘ సమీక్ష
- విలీనం లేదు.. 21 అంశాలపైనే చర్చలు
- సర్కారు ముందస్తు షరతులు
- కేంద్రం తెచ్చిన ఎమ్‌వీ యాక్ట్ సవరణ బిల్లును అమలు చేస్తున్నాం
- ప్రయివేటుకే ఆర్టీసీ
- ప్లీజ్.. మా పొట్టలు కొట్టొద్దు..
- తాత్కాలిక సిబ్బందికి ఆర్టీసీ కార్మికుల వినతి
- కొనసాగిన ప్రభుత్వ నిర్బంధం
- పలుచోట్ల కార్మికుల అరెస్టులు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఎట్టకేలకు ప్రభుత్వం దిగివచ్చింది. ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరిపేందుకు సిద్ధమని ప్రకటించింది. దీనికోసం టీఎస్‌ఆర్టీసీలోని ఆరుగురు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల (ఈడీ)తో ఓ కమిటీని వేస్తున్నట్టు ప్రకటించింది. అయితే చర్చలకు ముందస్తుగా ...9లో

### కమిటీ ఇదే...

టీఎస్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) టి.వెంకటేశ్వరరావు అధ్యక్షుడిగా ఇతర ఈడీలు ఎ.పురుషోత్తం, సి. వినోద్ కుమార్, ఇ.యాదగిరి, వి.వెంకటేశ్వర్లు, ఆర్థిక సలహాదారు ఎన్.రమేష్‌లు సభ్యులుగా కమిటీని నియమించారు.



### సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

ఆర్టీసీ కార్మికుల సమ్మెపై సర్కారు స్పందించాలి : ఏచూరి

వివరాలు 10లో

# సమ్మె సక్సెస్...

## బ్యాంకుల్లో నిలిచిన కార్యకలాపాలు

### మోడీ విలీన విధానాలకు వ్యతిరేకంగా నిరసనలు

- డిమాండ్లు నెరవేర్చకపోతే మరింత ఉధృతం
- కృతజ్ఞతలు తెలిపిన బెఫీ




హైదరాబాద్‌లో..

**న్యూఢిల్లీ :** కేంద్రప్రభుత్వం చేపడుతున్న బ్యాంకుల విలీన ప్రక్రియను వ్యతిరేకిస్తూ మంగళవారం దేశ వ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగుల సమ్మె విజయవంతమైంది. ఈ సమ్మె కారణంగా పలు బ్యాంకుల్లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. బ్యాంకుల విలీనాన్ని వ్యతిరేకిస్తూ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బీఈఎఫ్ఐ), ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ)లు సంయుక్తంగా ఇచ్చిన పిలుపు మేరకు బ్యాంకు ఉద్యోగులు సమ్మె చేపట్టిన సంగతి తెలిసిందే.

దేశ వ్యాప్తంగా మంగళవారం చేపట్టిన సమ్మెను విజయ వంతం చేసినందుకు బ్యాంక్ ఉద్యోగులకు బీఈఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి శ్రీ దేబాశిష్ బసు చౌదరి అభినందనలు తెలిపారు. ఈ సమ్మెకు మద్దతు తెలిపిన ఆల్ ఇండియా రిజర్వ్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్, ఆల్ ఇండియా రీజనల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్, ఇతర అధికారుల సంఘాలకు, ఏఐబీఈఏ, ఏఐబీఓసీలకు కూడా కృతజ్ఞతలు తెలిపారు. సమ్మెకు మద్దతు ప్రకటించిన ప్రధాన కార్మిక సంఘాలైన సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్‌ఎంఎస్, ఏఐయూటీయూసీ, ఏఐసీసీటీయూ, యూటీ యూసీ, ఎల్‌పిఎఫ్, ఎస్‌ఈడబ్ల్యూఏ తదితర సంఘాలకు ధన్యవాదాలు తెలిపారు. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (డబ్ల్యూఎఫ్‌టీయూ) అందించిన సహకారం మరువలేనిదని, అనేక కేంద్రాలలో ఖాతాదారులు మాకు అందించిన మద్దతుతో ఈ ఆందోళనలో ధైర్యంగా పాల్గొన్నామని అన్నారు. ఈ సమ్మెలో మూడు లక్షల మందికిపైగా ఉద్యోగులు పాల్గొన్నారనీ, దీంతో బ్యాంక్ కార్యకలాపాలు స్తంభించిపోయాయని తెలిపారు. మొండి బకాయిలను తిరిగి రాబట్టకుండా నిరర్థక ఆస్తులుగా (ఎన్పీఏ) ప్రకటించడం, డిపాజిట్లపై వడ్డీ రేట్లు తగ్గించడం, నిర్ణీత కాలపరిమితి కలిగిన డిపాజిట్లపై విచక్షణా రహితంగా జరిమానాలు వసూలు చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. బ్యాంకుల్లో నియామకాల కోసం సమర్థవంతమైన చర్యలు చేపట్టాలనీ, రుణ ఎగవేతదారుల నుంచి తిరిగి రికవరీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు బ్యాంక్ గేట్ల ఎదుట పికెటింగ్ చేశారనీ, జాతీయ బ్యాంకులను విలీనం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా, పలు డిమాండ్లను తీర్చాలని నినాదాలు చేశారని తెలిపారు. ముఖ్యమైన కేంద్రాల్లో సమావేశాలు, ర్యాలీలు నిర్వహించారు. ఎటీఎంలు కూడా ఈ సమ్మెతో ప్రభావితమయ్యాయని అన్నారు.

కాగా, బ్యాంక్ ఖాతాదారులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామనీ, అయితే దేశ ఆర్థిక వృద్ధి, ఆర్థిక ప్రయోజనాలు మరింత ముఖ్యమని అన్నారు. ఈ సమ్మె బ్యాంకులను ప్రయివేటీకరించకుండా కాపాడటానికి, కార్పొరేట్ శక్తులు బ్యాంకుల నుంచి దోచుకున్న లక్షల కోట్ల రూపాయలను తిరిగి రాబట్టడం ప్రధాన డిమాండ్లుగా ఉన్నాయని అన్నారు. పొదుపుమొత్తాలపై వడ్డీ రేట్లు తగ్గించడం వల్ల సీనియర్ సిటిజన్లలో పెరుగుతోన్న ఆందోళనను, ...2లో




మాట్లాడుతున్న నంద్యాల నర్సింహారెడ్డి

## బ్యాంకుల విలీనం దేశ ప్రయోజనాలకు నష్టం

### హైదరాబాద్ కోఠి

### ఎస్‌బీఐ సమ్మె సభలో వామపక్ష నేతలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బ్యాంకుల విలీనం దేశ ఆర్థిక ప్రయోజనాలకు నష్టం చేకూర్చు తున్నదనీ, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ వ్యవస్థను కాపాడుకోవడం ఐక్య ఉద్యమాల ద్వారానే సాధ్యమని పలువురు వక్తలు అన్నారు. ప్రభుత్వరంగ బ్యాంకుల విలీనానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త పిలుపులో భాగంగా హైదరాబాద్‌లోని కోఠిలో గల ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయం వద్ద మంగళవారం నాడు ఏఐబీఈఏ, బీఈఎఫ్ఐ ఆధ్వర్యంలో ఒక్కరోజు సమ్మె చేపట్టారు. సమ్మెకు సీపీఐ(ఎం), సీపీఐ, ఏఐటీయూసీ, సీఐటీయూ నేతలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఏఐబీఈఏ నాయకులు శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నంద్యాల నర్సింహారెడ్డి మాట్లాడుతూ... మోడీ సర్కారు విధానాలతో అనేక ప్రభుత్వ రంగ సంస్థలు సంక్షోభంలోకి నెట్టివేయబడ్డాయన్నారు. కార్పొరేట్లకు పట్టం కట్టేందుకు బ్యాంకులను నిర్వీర్యం చేసే కుట్రకు మోడీ తెరలేపారని విమర్శించారు. దేశంలో ఆర్థిక మాంద్యం పెరుగుతున్నదనీ, నిత్యావసర సరుకుల ధరలతో సామాన్యులు అతలాకుతలం అవుతున్నారనీ ఆందోళన వ్యక్తం చేశారు. బ్యాంకుల నిరర్థక ఆస్తులు పెరిగేలా చూసి బ్యాంకులు దివాలా తీసేలా మోడీ చేసారనీ, ఇంట్లో ఈగలమోత...బయటనేమో పల్లకిమోత అన్న చందంగా ఆయన పాలన ఉన్నదని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రతి 12 వేల మందికి ఓ బ్యాంకు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వ రంగ బ్యాంకులు విస్తరిస్తున్న సందర్భంలో వాటిని నిర్వీర్యం చేసేందుకు మోడీ సర్కారు పూనుకోవడం దారుణమని విమర్శించారు. తెలంగాణకు తలమానికంగా ఉన్న స్టేట్ బ్యాంకు ఆఫ్ హైదరాబాద్‌ను, ఆంధ్రాబ్యాంకు, తదితర బ్యాంకులను వేరే బ్యాంకుల్లో విలీనం చేయడం సబబుకాదన్నారు. యావత్తు బ్యాంకు ఉద్యోగులు తీవ్ర ...2లో

# తిరుగుబాటు తప్పదు

### ఆర్టీసీ సమ్మె చారిత్రాత్మకం

- హక్కులు సాధించే వరకూ ఉద్యమం : తమ్మినేని
- ఆందోళన ఉధృతం చేస్తాం : సీపీఐ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు బాలమల్లేశ్, పద్మ, సూర్యం
- సమ్మెకు మద్దతుగా బస్సు యాత్రలు



వివరాలు 3లో మాట్లాడుతున్న తమ్మినేని

సంబరాల జీవితం సౌభాగ్యాల సౌరభం
KAPIL GROUP
39 YEARS Safeguarding Trust
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

## న్యాయం కోరుతూ ప్రగతి భవన్ ముట్టడి

### వందలాది మంది కానిస్టేబుల్ అభ్యర్థులు

- మార్గమధ్యంలోనే అరెస్ట్ చేసిన పోలీసులు
- గోషామహల్ స్టేడియంలో అభ్యర్థుల నిరాహార దీక్ష
- సీఎంకు వ్యతిరేకంగా నినాదాల హోరు

వివరాలు 9లో

# మున్సిపోల్స్‌కు గ్రీన్‌సిగ్నల్

### హైకోర్టు తీర్పు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయాయి. ఈమేరకు మంగళవారం హైకోర్టు తీర్పు వెలువరించింది. ఇది రాష్ట్ర ప్రభుత్వానికి ఊరట కానుంది. ఎన్నికలకు అవసరమైన ముందస్తు ప్రక్రియ తప్పుల తడకగా చేశారని పేర్కొంటూ దాఖలైన రెండు వేర్వేరు ప్రజాప్రయోజన వ్యాజ్యాలను (పిల్స్) హైకోర్టు కొట్టివేసింది. పిల్స్‌లో జోక్యం చేసుకునేందుకు ఏమీ లేదని తేల్చి చెబుతూ తీర్పు వెలువరించింది. రాజ్యాంగంలోని 243(జెడ్) ప్రకారం ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత కోర్టులు జోక్యం చేసుకునేందుకు వీల్లేదని, ఈ మేరకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు కూడా ఉన్నాయని, దీంతో పిల్స్‌లో జోక్యం చేసుకోవడం లేదని తీర్పులో పేర్కొంది. ఇప్పటికే ఎన్నికల ముందస్తు ప్రక్రియ మొదలైందని, ఈ దశలో జోక్యం చేసుకోలేమని తీర్పు చెప్పింది. ఈ మేరకు మంగళవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్ఎస్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలతో కూడిన డివిజన్ బెంచ్ కీలక తీర్పు చెప్పింది.

మున్సిపల్ యాక్ట్‌లోని సెక్షన్ 11 ప్రకారం శాసనసభ ఎన్నికల ఓటర్ల జాబితా మేరకు మున్సిపల్ ఎన్నికలను నిర్వహించవచ్చునని స్పష్టం చేసింది. ఆ జాబితా సిద్దంగా ఉన్నప్పుడు ఇప్పుడున్న సాంకేతికతను ఉపయోగించుకుని సత్వరమే రిజర్వేషన్లు వర్గీకరణ చేయడం కష్టమేమీ



కాదని స్పష్టం చేసింది. ఎస్టీ, ఎస్సీ, బీసీ, మహిళ రిజర్వేషన్ల వర్గీకరణలో తప్పులు జరిగినట్టుగా ఎక్కడా ఓటర్లు చెప్పలేదని తప్పుపట్టింది. 2019 జులై 3న ఇచ్చిన నోటిఫికేషన్ అమలు చేయలేదని, దానిని చాలెంజ్ చేయడం చెల్లదని తీర్పులో తేల్చింది. ఎన్నికల షెడ్యూల్ వెలువడేలోగా ఓటర్ల లిస్ట్ తయారు చేసుకోవచ్చునని, ఎలక్షన్ క్యాలెండర్‌ను స్టేట్ ఎలక్షన్ కమిషన్ ప్రకటించలేదు కాబట్టి ఆ నోటిఫికేషన్‌ను సవాల్ చేయడం చెల్లదు..తీర్పు చెప్పింది.

తీర్పు వెలువడిన వెంటనే ప్రభుత్వం తరపున అదనపు అడ్వకేట్ జనరల్ జె.రామచందర్‌రావు కల్పించుకుని.. సింగిల్ జడ్జి వద్ద కూడా మున్సిపల్ ఎన్నికలపై కేసులు ఉన్నాయని, పలు కేసుల్లో స్టేలు కూడా వెలువడ్డాయని, వాటి విషయంలో డివిజన్ బెంచ్ జోక్యం ...9లో




## ఇద్దరు పిల్లలు మించితే.. సర్కారీ నౌకరికి అనర్హులు

- అసోం సర్కారు సంచలన నిర్ణయం

వివరాలు 2లో

## చివరకు కలిశారు..

### అమిత్ షాతో ఏపీ సీఎం జగన్ భేటీ



వివరాలు 7లో..



# నేర భారతం..

### అచ్ఛేదిన్ కాదు.. బురేదిన్

- మహిళలు, దళితులు, ఆదివాసీలు, చిన్నారులపై పెరిగిన క్రైం
- స్త్రీలపై దారుణాల్లో యూపీ అగ్రస్థానం
- బహిర్గతం చేయని గోహంతకుల రిపోర్టు : ఎన్సీఆర్బీ

అందరికీ రక్షణ కల్పిస్తాం.. బేటీ బచావో.. బేటీ పడావోతో పాటు మహిళలకూ అండగా నిలుస్తాం. కఠిన చట్టాలు తెచ్చాం.. నేరస్తుల తాటతీస్తాం. ఇలాంటి వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన మోడీ సర్కార్ ఎంతవరకు హామీలు అమలుచేసింది..? బీజేపీ పాలనలో నేరాలు తగ్గాయా..? దేశం నేరరహితంగా మారిందా..? దేశంలో మహిళలు, దళితులు, ఆదివాసీలు, చిన్నారులపై దాడుల పరిస్థితేంటీ..? దాదాపు ఒకటిన్నర ఏండ్లకుపైగా తొక్కిపెట్టిన.. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ..2017) ఎట్టకేలకు నేరాల నివేదికను విడుదలచేసింది.



వివరాలు 9లో

కాలాన్ని వృధా చేయడం అంటే.. నిన్ను నువ్వు దోపిడీ చేసుకోవడం.
- ఐన్‌స్టీన్



సంపాదకీయం

# ఎవరికి నిబంధనలు

ఇంటర్నెట్, సామాజిక మాధ్యమం విస్తరించిన తీరు ప్రజాస్వామిక రాజ్యాంగ వ్యవస్థకు ముప్పుగా పరిణమించిందని కేంద్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. రాజ్యాంగ వ్యవస్థలను నాశనం చేస్తూ మరోవైపు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మోడీ సర్కార్.. సోషల్ మీడియా వేదికలపై విద్వేష ప్రకటనలు, బెదిరింపులు, తప్పుడు వార్తలు, అప్రతిష్టపాల్జేసే సందేశాలను అరికట్టేందుకు మార్గదర్శకాలు రూపొందించబోతున్నట్టు సుప్రీం కోర్టుకు తెలియజేయడం గమనార్హం. గతంలో తమపై వివిధ హైకోర్టుల్లో ఉన్న కేసుల్ని సుప్రీంకోర్టుకు బదిలీ అయ్యేలా ఆదేశాలివ్వాలని ఫేస్‌బుక్, వాట్సాప్ సంస్థలు వేసిన వ్యాజ్యంపై అత్యున్నత న్యాయస్థానం కోరిన మీదట కేంద్రం ఈ అఫిడవిట్ దాఖలు చేసింది. నిబంధనలను మూడు నెలల (జనవరి 20 వరకు)లోగా అందిస్తామని సుప్రీంకోర్టుకు తెలియజేసింది. తమ ప్రభుత్వాన్ని తప్పుబట్టారంటూ సోషల్ మీడియా వేదికలలో అభిప్రాయాలు పంచుకున్న వారిపై దూషణలకు, ప్రత్యక్ష దాడులకు దిగిన కాషాయనేతలను పల్లెత్తు మాట అనని ప్రధాని మోడీ..సుప్రీంకోర్టు ఆదేశాలను ఆధారంగా ఏ రకంగా మార్గదర్శకాలు తయారు చేస్తారన్నది ఊహించడం కష్టమేమీ కాదు.

**ప్రభుత్వం చేయబోయే మార్గదర్శకాలు వ్యక్తుల స్వేచ్ఛను హరించే విధంగా ప్రమాదం పొంచి ఉన్నది. వాస్తవానికి ఇప్పుడున్న చట్టాలను సరిగా వినియోగిస్తే ఆన్‌లైన్ దుండగుల్ని అదుపు చేయడం కష్టం కాదు.**

మూక దాడులకు, హత్యలకు దారితీస్తున్న తప్పుడు వార్తలను, సందేశాలను పంపిస్తున్న అసలు వ్యక్తులెవరో తెలుసుకోవాలన్నది సుప్రీంకోర్టు ఆలోచన. దీనిని ఆధారం చేసుకుని కేంద్రం సోషల్ మీడియా ఖాతాలను ఆధార్ కార్డుతో అనుసంధానం చేయించాలని కోరగా, దానికి సోషల్ మీడియా సంస్థలు అంగీకరించలేదు. తమ వినియోగదారుల పరస్పర సందేశాలకు, అభిప్రాయ వ్యక్తీకరణకు వేదికగా ఉపయోగ పడుతున్నందుకు గర్విస్తున్నామనీ వాటిని పెడుతున్న వ్యక్తులెవరో తెలుసుకోవడం, బయటపెట్టడం చేయబోమనీ సోషల్ మీడియా సంస్థలు గతంలోనే స్పష్టం ఉంది. ఈ విషయమై కేంద్రం ఆలోచన భిన్నంగా ఉన్నది. తమకు వ్యతిరేకంగా సందేశాలు పంపుతున్న వారిని గుర్తించి హింసించాలన్నది కాషాయ ప్రభుత్వ దుష్టపన్నాగం. సోషల్ మీడియా అదుపునకు ఉద్దేశించే నిబంధనలు దానిని నిజంగా దుర్వినియోగపరుస్తున్నవారిని నిరోధించడం వరకు మాత్రమే పరిమితమైతే మంచిదే. ఆ నిబంధనలు ప్రజాస్వామిక భావ ప్రకటన స్వేచ్ఛను హరించే రీతిలో ఉంటే సమాజానికి, అభ్యుదయ, ప్రగతిశీల వికాసానికి అత్యంత ప్రమాదకరం. ఈ పరిస్థితుల్లో మంచీ చెడూ ఒకే గాటన కట్టడం ఎంత మాత్రం సరికాదు.



సోషల్ మీడియాను అత్యధికంగా ఉపయోగించుకునే రాజకీయపార్టీల్లో బీజేపీ నెంబర్‌వన్. ప్రధాని మోడీ ట్విటర్ ఫాలోవర్స్ లక్షల్లోనే ఉన్నారు. అందులో కొంతమంది జర్నలిస్టులను, మహిళలను, ఇతర పార్టీ సభ్యులను, మైనార్టీలను, దళితులను, ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిని వేధింపులకు గురిచేస్తున్నవారూ ఉన్నారు. మూకదాడులకు ఉసిగొల్పేవారున్నారు. ఇటీవల తనను ఫాలో అవుతున్న వారితో మోడీ సమావేశం కాగా, అందులో ఇలాంటివారున్నారని తేలింది. వారు ఎవరన్నది మీడియాలోనూ వార్తలొచ్చాయి. మంత్రులతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ పదవుల్లో ఉన్న వారంతా ఉన్నారు. అయినా ఏనాడూ వారిని మోడీ మందలించిన దాఖలాలు లేవు. పైగా అదేదో ప్రభుత్వానికి అండగా నిలిచిన వీరసైనికులుగానూ, జాతీయత కలిగిన నేతలుగానూ గొప్పగా చెప్పుకోవడం బీజేపీకి పరిపాటైంది. మూకదాడులకు పాల్పడేవారిని గుర్తించి శిక్షించాలని సుప్రీంకోర్టు గతంలో ఆదేశించినా బీజేపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. లైంగికదాడులకు పాల్పడుతున్నా దిక్కులేదు. అలాంటి వారి నుంచి సోషల్ మీడియాలో విద్వేష పూరిత ప్రకటనలు, వేధింపులకు గురిచేసే సందేశాలను అరికడతారని ఆశించడం అత్యాశే. ఆర్టికల్స్ 370, 35(ఎ) రద్దు చేయడానికి ముందు జమ్మూకాశ్మీర్‌లో ఎలాంటి ఆంక్షలు విధించింది ఇప్పటికీ దేశం మరిచిపోలేదు. ఆంక్షలూ కొనసాగుతున్నాయి.

ఆర్టికల్ 370ని రద్దు చేసిన చర్యపై నోరు విప్పబోమంటూ హామీ పత్రాల మీద సంతకాలు చేస్తేనే విడుదల చేస్తామని జమ్మూకాశ్మీర్‌లో అరెస్టు చేసిన వేలాది మందికి షరతు విధించారంటే భారతావనిలో ప్రజాస్వామ్యం మనుగడ ప్రశ్నార్థకమే. మీడియాపై విరుచుకుపడినప్పుడల్లా జాతి శ్రేయస్సు కోసమే ఆ పని చేస్తున్నామనిప్రభుత్వాలు చెబుతుంటాయి. వాస్తవంలో అది జాతి అభివృద్ధిని, అభ్యుదయాన్ని బలి తీసుకుంటుందనడానికి ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సంఘటనలే ఉదాహరణలు. మీడియా నియంత్రణను పూర్తిగా ప్రభుత్వాలకు వదిలేయడం వల్ల మేలు కంటే కీడే ఎక్కువ. కేంద్రంలో మోడీ సర్కార్‌తో పాటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు మీడియాతో సోషల్ మీడియా పట్ల ఏ రకంగా వ్యవహరిస్తున్నాయన్నది చూస్తూనే ఉన్నాం. ప్రభుత్వం చేయబోయే మార్గదర్శకాలు వ్యక్తుల స్వేచ్ఛను హరించే విధంగా ప్రమాదం పొంచి ఉన్నది. వాస్తవానికి ఇప్పుడున్న చట్టాలను సరిగా వినియోగిస్తే ఆన్‌లైన్ దుండగుల్ని అదుపు చేయడం కష్టం కాదు. భారతీయ శిక్షాస్మృతిలోని పలు నిబంధనలు ఆన్‌లైన్‌లో మహిళలను వేధించేవారిని, అసభ్యకరమైన సందేశాలను, చిత్రాలను పంపేవారిని, ఆన్‌లైన్‌లో వెంటబడే వారిని శిక్షించడానికి వీలు కల్పిస్తున్నాయి. పాలకులకు చిత్తశుద్ధి ఉంటే ఇది కష్టం కాదు. ఇప్పుడు ఈ సాకుతో సోషల్ మీడియా మీద దాడికి ప్రయత్నించకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

# ఆర్టీసీ సమ్మె రాజకీయార్థిక కోణాలు



**ఎన్. వేణుగోపాల్**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికులు, సిబ్బంది న్యాయమైన కోరికలను నెరవేర్చాలని కోరుతూ పద్దెనిమిది రోజులుగా అప్రతిహతంగా సాగుతున్న సమ్మె గురించి మూడు వారాలుగా అనేక వివరణలూ, విశ్లేషణలూ, వాదనలూ ప్రతివాదనలూ వెలువడుతూనే ఉన్నాయి. పాలకవర్గాలూ, ప్రభుత్వమూ అసంఖ్యాకంగా అబద్ధాలను రవాణా చేయడానికి కూడా పెద్ద ఎత్తునే ప్రయత్నిస్తున్నాయి. కార్మికులూ ఆర్టీసీ పరిరక్షణ ఆకాంక్ష గల బుద్ధిజీవులూ ఆ అబద్ధాల గాలి తీస్తూనే ఉన్నారు. ప్రభుత్వ అబద్ధ ప్రగతి రథ చక్రాలు కదలడం లేదు. ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా, సామ దాన భేద దండోపాయాలు ప్రయోగించినా సమ్మె విస్తారమైన ప్రజల మద్దతు చూరగొంటూ సాగుతూనే ఉన్నది. పద్దెనిమిది సంవత్సరాల (1996–2014) మలిదశ ఉద్యమంలో తెలంగాణ ఆకాంక్ష న్యాయబద్ధత ఎట్లా ప్రతి ఒక్కరి మనసులోకి దిగిందో, అంకెల రూపంలో, నాయకుల విధానాల మీద విమర్శ రూపంలో పెదాల మీది నుంచి ఉరవడిగా హోరెత్తిందో, సరిగ్గా అట్లాగే ఇప్పుడు ఈ పద్దెనిమిది రోజుల ఉద్యమ క్రమంలో ఆర్టీసీ కార్మికుల ఆకాంక్షల న్యాయబద్ధత ఆలోచనాపరుల మనసులోకి దిగింది. వాదనల రూపంలో, సంఘీభావం రూపంలో వెల్లువెత్తుతున్నది. ఆ ఆకాంక్షల న్యాయబద్ధత గురించి మరొకసారి చెప్పనక్కరలేదు. ఆ ఆకాంక్షలను మారుతున్న తెలంగాణ రాజకీయార్థిక వ్యవస్థ నేపథ్యంలో ఎట్లా అర్థం చేసుకోవలసి ఉన్నదో మాత్రం తెలుసుకోవలసి ఉంది.

**ఇప్పటికే ఆర్టీసీ కార్మికుల సమ్మెను ఆమోదిస్తున్న సమర్థిస్తున్న ప్రజలు ఈ కుట్రలను అర్థం చేసుకోవలసి ఉంది. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ తెలంగాణ ప్రజలది. తెలంగాణ రాజకీయార్థిక వ్యవస్థకు అత్యవసరమైనది. అది తెలంగాణ ప్రజల నెత్తురుతో, చెమటతో నిర్మాణమైంది. అది ఆర్టీసీ కార్మికుల శ్రమతో విస్తరించింది. ఐదు సంవత్సరాల కోసం అధికారానికి వచ్చిన వ్యక్తులకు దాన్ని తమ తోడుదొంగలకు అప్పగించే అధికారం లేదు.**

ప్రస్తుత ఆర్టీసీ కార్మికుల సమ్మె తెలంగాణ రాజకీయార్థిక వ్యవస్థ పరిణామంలో ఒక కీలక ఘట్టం. ఈ సమ్మె కారణాలు, పరిణామాలు, పర్యవసానాలు తెలంగాణ రాజకీయార్థిక వ్యవస్థ మీద విస్తృతమైన ప్రభావం చూపుతాయి. కార్మికుల వైపు నుంచి, ప్రభుత్వం వైపు నుంచి, ప్రజల వైపు నుంచి, మొత్తంగా రాజకీయార్థిక వ్యవస్థ వైపు నుంచి ఈ సమ్మెను పరిశీలించడం ఇవాళ్టి అవసరం.

ఆర్టీసీ కార్మికులు, సిబ్బంది అందరికీ ప్రాతినిధ్యం వహించే పన్నెండు సంఘాలూ ఈ సమ్మెలో పాల్గొంటున్నాయంటేనే ఈ సమ్మె ఎంత విస్తృతమైన, బలమైన సంఘీభావంతో సాగుతున్నదో అర్థమవుతుంది. ఈ ఐక్యత ఎవరి ఒత్తిడి మూలంగానో, ఎవరి అభ్యర్థన మూలంగానో వచ్చినది కాదు. సమ్మెకు పునాది అయిన 26డిమాండ్లు కార్మికుల ఆకాంక్షలనూ, సిబ్బంది ఆకాంక్షలనూ, మొత్తంగా సంస్థ పరిరక్షణ ఆకాంక్షలనూ ప్రతిఫలిస్తున్నాయి గనుకనే కార్మికులూ సిబ్బందీ అందరూ సంపూర్ణంగా సమ్మెలో పాల్గొంటున్నారు. ఇంతకూ ఆ డిమాండ్లు ఏమిటి? అవేమన్నా గొంతెమ్మ కోర్కెలా, కార్మిక సంఘాలు ఇష్టారాజ్యంగా తయారుచేసిన కోర్కెలా? ఎంత మాత్రమూ కాదు. అవి ప్రధానంగా సంస్థ పరిరక్షణ డిమాండ్లు. ఉద్యోగ భద్రత డిమాండ్లు. సమాన పనికి సమాన వేతనం డిమాండ్లు. పని పరిస్థితుల మెరుగుదల డిమాండ్లు. పనిస్థలంలో అక్రమాలను తొలగించాలనే డిమాండ్లు. రాజకీయార్థిక పరిభాషలో చెప్పాలంటే ఇవన్నీ కూడా ఉత్పత్తి సాధనాలను మెరుగుపరచాలనే డిమాండ్లు, ఉత్పత్తి శక్తులను ఉన్నతీకరించాలనే డిమాండ్లు. ఉత్పత్తి సంబంధాలను మెరుగు పరచాలనే డిమాండ్లు. నిజంగా ఈ ప్రభుత్వానికి తెలంగాణ అభివృద్ధి ప్రయోజనాలే ముఖ్యమై ఉంటే ఈ డిమాండ్లన్నీ ఈ సమ్మె కూడా లేకుండా తక్షణమే అంగీకరించవలసిన డిమాండ్లే.

ఆర్టీసీ సంస్థ తెలంగాణ ప్రజలకు అత్యవసరమైన సేవలను అందిస్తున్న వ్యవస్థ. ఆ సేవలు మెరుగుపడాలంటే ఆ సంస్థ స్థితి మెరుగుపడాలి. అంటే దాని ఆర్థిక పరిస్థితి సందేహాతీతంగా ఆరోగ్యవంతంగా ఉండాలి. కాని తెలంగాణ ఏర్పడిన ఐదేండ్లలోనే సంస్థకు ప్రభుత్వం నుంచి రావలసిన రూ.2802కోట్లకు గాను, ప్రభుత్వం ఇస్తానని బడ్జెట్ వాగ్దానం చేసినది రూ.1360కోట్లు కాగా వాస్తవంగా ఇచ్చినది రూ.620కోట్లు. సంస్థకు ఈ ఐదేండ్లలో పెరిగిన మొత్తం అప్పులు రూ.1270కోట్లు కాగా, స్వయంగా ప్రభుత్వం సంస్థకు ఇవ్వవలసినవి, బాకీ పడినవి రూ.2182కోట్లు. అంటే సంస్థను ఉద్దేశపూర్వకంగా అప్పుల, నష్టాల ఊబిలోకి నెడుతున్నదెవరో తేలిపోతుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి సంస్థకు ఉండిన అప్పు (తెలంగాణ వాటాగా వచ్చిన అప్పు రూ.1964 కోట్ల)ను తీర్చివేసి, సంస్థను రుణభార రహితంగా, ఆరోగ్యకరంగా మార్చి ఉండవలసిన తెలంగాణ పాలకులు అదనంగా నిధులు కేటాయించడం అలా ఉంచి, ఇవ్వవలసిన బాకీలైనా ఇవ్వలేదు. ఆ అప్పులు తీర్చి ఉంటే ఆ అప్పుల మీద గత నాలుగేండ్లలో సంస్థ చెల్లించిన వడ్డీ రు. 629 కోట్లు మిగిలి ఉండేది. సంస్థ ఆరోగ్యం ఆ మేరకు మెరుగుపడి ఉండేది. అంతేకాదు, అదే సమయంలో ప్రజా రవాణా సంస్థగా ఆర్టీసీకి ఇవ్వవలసిన రాయితీలు, మినహాయింపులు కనీస స్థాయిలో కూడా ఇవ్వకుండా మోటర్ వెహికిల్ టాక్స్ రూపంలో రూ.1052 కోట్లు, ఇంధన పన్నులో రాష్ట్ర వాటాగా రూ.1234 కోట్లు రాష్ట్ర ప్రభుత్వమే సంస్థ నుంచి ఎదురు తీసుకున్నది. అంటే ఆర్టీసీ ఆర్థిక దుస్థితికి పూర్తి బాధ్యత వహించవలసినది ప్రభుత్వం మాత్రమే.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తే నిర్ణయాధికారం పూర్తిగా ప్రభుత్వం చేజిక్కుతుంది గనుక ఈ సమస్యల పరిష్కారానికి మార్గం సులభమవుతుందనీ, తద్వారా సంస్థ పరిరక్షణ సాధ్యమవుతుందనీ కార్మికులు భావించారు. ఈ విలీనం గురించి తెలంగాణ ఏర్పాటుకు ముందు తెలంగాణ రాష్ట్ర సమితి నాయకులు చేసిన వాగ్దానాలెన్నో ఉన్నాయి. ఎన్నో రాష్ట్రాలలో ప్రభుత్వాధీనంలో సాగుతున్న రవాణా సంస్థల ఉదాహరణలున్నాయి. ఇక పొరుగు రాష్ట్రమైన ఏపీలో కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయడం తెలంగాణ ఆర్టీసీ కార్మికులలో ఆ ఆకాంక్ష మరొకసారి రేకెత్తించింది.

ప్రభుత్వంలో విలీనం చేయడం వల్ల సంస్థ భవిష్యత్తుకు హామీ దొరకడం మాత్రమే గాక, తామంతా ప్రభుత్వోద్యోగులుగా మారవచ్చుననీ, అంటే ప్రభుత్వోద్యోగులతో సమాన వేతనం ఇవ్వాలని చిరకాలంగా చేస్తున్న డిమాండ్ నెరవేరుతుందనీ కార్మికులు ఆశించారు. సమానమైన సర్వీసు, తక్కువ పని, మెరుగైన పని పరిస్థితులు ఉన్న సమాన స్థాయి ప్రభుత్వోద్యోగులతో పోల్చి చూస్తే ఆర్టీసీ కార్మికుల జీతాలు పది, పదిహేను వేల రూపాయలు తక్కువగా ఉన్నాయి. సమానపనికి సమానవేతనం అనే సహజ న్యాయసూత్రానికి ఇది తీవ్రమైన ఉల్లంఘన. నిజానికి సమాన పని కూడా కాదు, ఆర్టీసీ కార్మికులు, ముఖ్యంగా డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్కులు, క్లీనర్లు ఎక్కువపని చేస్తున్నారు. దుర్భరమైన పని పరిస్థితులు అనుభవిస్తున్నారు. చీటికీ మాటికీ బెదిరింపులు, మందలింపులు, సస్పెన్షన్లు, మెమోలు వంటి వాటితో అధికారుల దౌర్జన్యం కింద, కార్మిక వ్యతిరేక వైఖరి కింద నలిగిపోతున్నారు. ఈ పరిస్థితులను మెరుగుపరచాలనేది కార్మికుల మరొక ప్రధానమైన డిమాండ్.




ఉద్యోగ నియామకాలు జరపాలనీ, కొత్త బస్సులు కొనాలనీ, గ్రామీణ సర్వీసులను విస్తరించాలనీ, ఇంధన పన్ను నుంచి మినహాయించాలనీ మరికొన్ని డిమాండ్లు. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ డిమాండ్లు మానవీయమైన డిమాండ్లు. తమను తాము మనుషులుగా భావించుకునే వారెవరైనా అడగవలసిన, సమర్థించవలసిన, అంగీకరించవలసిన డిమాండ్లు.

కానీ తెలంగాణాధీశులకు మాత్రం ఈ డిమాండ్లు అంగీకరించవలసినవని అనిపించడంలేదు. ఇక్కట్ల పాలవుతున్న కార్మికులు చెప్పినా, సంఘాలు చెప్పినా, పౌరసమాజం చెప్పినా, ప్రతిపక్ష పార్టీలు చెప్పినా, సొంతపార్టీ వారు గొంతెత్తలేక గొణిగినా, చివరికి హైకోర్టు చెప్పినా ఈ డిమాండ్లలోని న్యాయబద్ధత, ఆమోదయోగ్యత ఏలికకు అర్థం కావడం లేదు. సమ్మెకు వెళ్లిన కార్మికులందరూ సెల్ఫ్ డిస్మిస్ అయినట్టేనని, కొత్త సిబ్బందిని నియమిస్తానని, ఆ కొత్త సిబ్బంది చేత యూనియన్‌లో సభ్యులం కాబోమని హామీ పత్రం మీద సంతకం పెట్టించుకుంటానని, హైకోర్టు చెప్పినా పని చేసిన కాలానికి కూడా జీతం ఇవ్వబోనని, అనారోగ్య పీడితులైన కార్మికులకు ప్రభుత్వాస్పత్రుల సేవలు కూడా ఇవ్వబోనని, నిరంకుశ రాచరికం నాటి ప్రభువు కన్నా అన్యాయంగా, రాజ్యాంగవ్యతిరేకంగా, అప్రజాస్వామికంగా, దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నారు.

ఇందులో 'దిక్కారమున్ సైతునా' అనుకునే తెలంగాణాధీశుల వ్యక్తిగత దొరతనం పాత్ర కొంత ఉండవచ్చు గాని, అంతకన్న ఎక్కువ రాజకీయార్థిక కారణాలున్నాయి. మూడు ప్రధాన కారణాలను చెప్పుకోవాలంటే అవి ప్రభుత్వ రంగం మీద ఆయనలో కరడుగట్టిన వ్యతిరేకత, రవాణా రంగంలో ప్రవేశించడానికి ఉవ్విళ్లూరుతున్న ఆశ్రిత దళారీ పెట్టుబడిదారుల ప్రయోజనాల పరిరక్షణ, ఆర్టీసీకి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రియల్ ఎస్టేట్ మీద కన్ను.

ప్రపంచీకరణనూ ప్రయివేటీకరణనూ నమ్మి, ఆ విధానాలను ముందుకు తీసుకుపోవడంలో మొనగాడుగా ప్రపంచ బ్యాంకు ప్రశంసలందుకున్న నాయకుడి శిష్యుడిగా, సహచరుడిగా రాజకీయ జీవితంలో అత్యధిక భాగం గడిపిన తెలంగాణాధీశులకు ప్రభుత్వరంగం మీద బలమైన వ్యతిరేకత ఉంది. కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా, ప్రభుత్వ రంగాన్ని, సామాజిక శ్రేయో అవసరాల కోసం ప్రభుత్వరంగం ఉండవలసిన అవసరాన్ని ఆయన తూలనాడేవారని ఉద్యమసమయంలోనే ఆంతరంగికులు చెప్పేవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణలో మూసివేసిన డజనుకు పైగా ప్రభుత్వరంగ సంస్థలను పునరుద్ధరిస్తామని వాగ్దానాలు కురిపించినప్పటికీ, వాటిలో ఒక్కటి కూడా పునరుద్ధరించకపోవడం, గడిచిన ఐదేండ్లలో ఒక్కటంటే ఒక్కటైనా ప్రభుత్వరంగ సంస్థను తెరవకపోవడం ఏలిక ఆలోచనలకు అద్దం పడుతున్నాయి. సింగరేణి గనులను, ఆర్టీసీని ప్రయివేటీకరించమని, కానీ ఎక్కువ మంది కార్మికులు, సమరశీల కార్మికవర్గ చైతన్యం ఉన్న ఈ సంస్థల ప్రయివేటీకరణ జాగ్రత్తగా జరపాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ప్రపంచ బ్యాంకు ఆదేశం ఇచ్చింది. అలా 1998 నాటి ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ రిస్ట్రక్చరింగ్ ప్రాజెక్ట్ లో భాగమైన ఆర్టీసీ ప్రయివేటీకరణ పన్నాగం ఇప్పుడు అమలు చేయడానికి తెలంగాణాధీశులు కంకణం కట్టుకున్నట్టున్నారు. ఆ కార్యక్రమంలో ముందడుగు వేసి, క్రమక్రమంగా ఆర్టీసీని కబళించి తమ సొంత వాహనాలను ప్రవేశపెట్టడానికి ఆయనకివాళ కనీసం ముగ్గురు ఆశ్రిత పెట్టుబడిదారుల సహకారం ఉంది. ఒకరికొకరి సహకారం, ఒకరి వల్ల ఒకరికి లాభం ప్రాతిపదికగా నడుస్తున్న రాష్ట్రంలో ఒక చరిత్రాత్మక సేవా సంస్థను బలిపశువును చేయబోతున్నారు. బలి పశువును వధించడానికి నష్టాలు వస్తున్నాయనే అబద్ధపు ప్రచార సమర్థన ఎలాగూ ఉంది.

ఈ కార్యక్రమం కోసం వేచిచూస్తున్న రాబందులన్నిటికీ అదనపు లాభంగా రియల్ ఎస్టేట్ ప్రయోజనాలున్నాయి. అసలు 2014 నుంచి ఈ ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ ప్రభుత్వంగా నడుస్తున్నది. ఇతర కార్యక్రమాలు ఏమి చేసినా చేయకపోయినా భూముల ధరలు కృత్రిమంగా పెంచి, లక్షలాది ఎకరాల భూమిని వ్యవసాయేతర వినియోగంలోకి, ప్రధానంగా రియల్ ఎస్టేట్‌లోకి మళ్లించి, పేద, మధ్యతరగతి వర్గాలకు భూమి దక్కని స్థితిని సాధించే వర్గాల అధికారం నడుస్తున్నది. ప్రజలవద్దకు పాలన పేరుతో ప్రారంభించిన జిల్లాల పునర్విభజన అంతిమంగా రియల్ ఎస్టేట్ పథకంగా మిగిలిపోయింది. ఇప్పుడిక రాష్ట్ర వ్యాప్తంగా 97డిపోల కింద, దాదాపు 400 బస్ స్టాండ్‌ల కింద, కార్యాలయాల కింద, డజనుకు పైగా వర్క్ షాపుల, కార్ఖానాల కింద వందలాది ఎకరాల భూమి ఉంది. (అది కనీసం 1500ఎకరాలు కావచ్చుననీ, కనిష్ట సగటు లెక్క వేసినా దాని విలువ వేల కోట్ల రూపాయలు ఉంటుందనీ ఒక అంచనా). దానిలో అత్యధిక భాగం నగరాల, పట్టణాల నడిబొడ్డున ఉంది. దాన్నంతా లీజుల పేరుతోనో, అమ్మకాల పేరుతోనో ఆశ్రితులకు కారు చౌకగా కట్టబెట్టడం ఏలిక లక్ష్యం.

ఇప్పటికే ఆర్టీసీ కార్మికుల సమ్మెను ఆమోదిస్తున్న సమర్థిస్తున్న ప్రజలు ఈ కుట్రలను అర్థం చేసుకోవలసి ఉంది. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ తెలంగాణ ప్రజలది. తెలంగాణ రాజకీయార్థిక వ్యవస్థకు అత్యవసరమైనది. అది తెలంగాణ ప్రజల నెత్తురుతో, చెమటతో నిర్మాణమైంది. అది ఆర్టీసీ కార్మికుల శ్రమతో విస్తరించింది. ఐదు సంవత్సరాల కోసం అధికారానికి వచ్చిన వ్యక్తులకు దాన్ని తమ తోడుదొంగలకు అప్పగించే అధికారం లేదు.

ఇవాళ్టి కార్మికుల సమ్మె తెలంగాణ ప్రజా ప్రయోజన పరిరక్షణ ప్రయత్నం. ఆ సమ్మెకు సంపూర్ణ సంఘీభావం ప్రకటించడం, ఆర్టీసీని కాపాడడం, అభివ ద్ధి చేయడం, దొంగలపాలు కాకుండా చూడడం ఇవాళ ప్రతి ఒక్క తెలంగాణ బిడ్డ కర్తవ్యం.

సెల్: 9848577028

# అయోధ్య వివాదానికి సహేతుక పరిష్కారం లభించేనా?



**తెలకపల్లి రవి**

అయోధ్య వివాదంపై సుప్రీం కోర్టులో వాదనలు ముగించి నెల రోజులలో తుది తీర్పు వస్తుందన్న కథనాలు దేశమంతా ఊపిరి బిగబట్టి చూసేలా చేస్తున్నాయి. నూటనలభై ఏండ్ల వివాదం, స్వాతంత్రా నంతరం డెబ్బయిఏండ్ల పై బడిన వివాదాలు 40రోజులలో వాదోపవాదాలు పూర్తి చేయాలనీ, నవంబరు 17న ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ పదవీ విరమణలోగా తీర్పు ఇచ్చేయాలని శిలాశాసనం జారీ చేసి మరీ హడావుడి పెట్టడం కొంత విచిత్రంగానే కనిపించింది. అంత సులభంగా కాలవ్యవధితో పరిష్కారం చెప్పగలిగిన కేసే అయితే ఇంత కాలం ఎందుకు ఆగిందనే ప్రశ్న వుండిపోయింది. వాదనలకు ముందు సమాంతరంగా మధ్యవర్తిత్వ ప్రయత్నాల కోసం ఒక త్రిసభ్య కమిటీని వేసి దానికీ కాల వ్యవధి పెట్టడం మరింత విపరీతంగా మారింది. ఇన్నేళ్లలో ఎన్నో మధ్యవర్తిత్వాలు విఫలమైనాయి. చివరకు బాబరీ మసీదు విధ్వంసం వరకూ నడిచింది. దానికి ముందూ తర్వాత చాలామంది పరిష్కారాలు కనుగొన్నామని చెప్పడం చేతులెత్తేయడం ప్రహసనంగా మారింది. ఇప్పటి కమిటీ కూడా విచారణ మధ్యలో చేతులెత్తేస్తూ నివేదిక సమర్పించింది. తర్వాత మళ్లీ మధ్యలో పున:ప్రవేశం చేసింది. కోర్టు అప్పుడూ అవకాశమిచ్చింది. వాదనలు ముగిసిపోతున్న వేళ తమకు ఒక పరిష్కార ప్రతిపాదన వచ్చిందంటూ సమర్పించడం కొసమెరుపు. యూపీ సున్నీ వక్ఫ్ బోర్డు అంగీకరించినట్టు చెబుతున్న ఆ పరిష్కారంలో ఏముందో స్పష్టంగా తెలియదు. కొన్ని సూచనలు వచ్చాయి. అయితే మరోవైపున ఇతర పిటిషనర్ల లాయర్లు అయిదు మంది తాము ఎలాటి మధ్యవర్తిత్వానికి ఒప్పుకోలేదంటూ ముందుకొచ్చారు. తీర్పు తమకు అనుకూలంగా వస్తుందని హిందూ సంస్థల ప్రతినిధులే గాక ఆరెస్సెస్ నేత సురేష్, ప్రధాని మోడీ సహా ఆవాభావం వెలిబుచ్చారు. ఒకవేళ తీర్పు వ్యతిరేకంగా వచ్చినా షాబాను తీర్పులో రాజీవ్‌గాంధీ చేసినట్టు మోడీ ప్రభుత్వం ఆర్డినెన్సు తీసుకొస్తుందని కూడా బీజేపీ ఆరెస్సెస్ వాదులు అంటున్నారు. ఏ తీర్పు వచ్చినా అందరూ కట్టుబడాలని మరోవైపున కొందరు ముస్లిం నేతలు ప్రకటించారు. (మసీదు కూల్చిన) డిసెంబర్ ఆరవ తేదీనే రామమందిర నిర్మాణం ప్రారంభించడం తథ్యమని యూపీ ముఖ్యమంత్రి యోగి కూడా చెబుతున్నారు.

చరిత్రలో ఏదో జరిగిందని ఆరోపిస్తూ దానికి ప్రతీకారం తీర్చుకోవాలనే రీతిలో బయలు దేరితే దానికి ముగింపు అంటూ వుండదు. బాబరు నిజంగా అక్కడ మందిరం పడగొట్టి కట్టారనడానికి ఎలాటి ఆధారాలు లభించలేదు. ఆధారాలుగా చూపుతున్నవి సరైనవీ కాదు. అసలు లేదు. అక్కడి హనుమాన్‌ఘరీ అనే దానిపై తప్ప 19వ శతాబ్దం వరకూ దీనిపై వివాదమే లేదు. 1870లో మొదటి సారిగా బ్రిటిష్ అధికారి పి కార్నెనీ ఫైజాబాద్ తహసీల్ చారిత్రిక సమాచారం అంటూ మొగలులు అయోధ్యలో మూడు దేవాలయాలు పడగొట్టినట్టు రాశాడు. 1905లో ఫైజాబాద్ గెజిటీర్‌లో హెచ్‌ఆర్ నెవెల్లీ ఆ రాతలనే యథాతథంగా దించేవారు. 1923లో మిసెస్‌బెవరిడ్జ్ బాబర్‌నామాను ఇంగ్లీషులో అనువాదమని ప్రకటించి అందులో మొదటిసారి ఆయన రామాలయాన్ని కూలగొట్టినట్టు రాశారు. బాబరునామా మూల ప్రతిలో గాని ఆయన గురించిన ఇతర చారిత్రిక ఆధారాల ప్రకారం గాని ఈ వాదనలు నిజమయ్యే అవకాశం కనిపించదు. 1955లో ముస్లింలు హనుమాన్ ఘరీపై వివాదం

**❝ విపరీతమైన సంచలనాలకూ వివాదాలకు గురైన సుప్రీం కోర్టు ఆగమేఘాల మీద అయోధ్య కేసులు చేపట్టడం ఆసక్తి కలిగించింది. మొత్తంపైన రాముడు అక్కడ పుట్టాడనేది విశ్వాసం మాత్రమేనని చబుత్రాలో పూజను అనుమతించడం పరిస్థితుల బట్టి జరిగింది మాత్రమేనని తేలింది. ❞**

పెంచడంతో దానికి ప్రతిగా బాబరీ మసీదు వివాదం తీసుకొచ్చినట్టు చెబుతున్నారు. 1858లో అక్కడ ఆవరణలో సీతారాములు విగ్రహాలను ప్రతిష్టించి రామజన్మభూమిగా ప్రకటించారు. దానిపై 1860 నుంచి 1884 వరకూ పలుసార్లు కోర్టులో వాదనలు నడిచినా ప్రయోజనం లేకపోయింది. అప్పుడు కూడా




రామ్ చబుత్రాగా అడిగింది ఇప్పుడు వాదించుకుంటున్న మసీదు స్థలం కాదు.1949డిసెంబరు 22 రాత్రి కొందరు మసీదులోకి ప్రవేశించి మధ్య గోపురంలో బాలరాముడు(రామ్‌లల్లా) విగ్రహం ప్రతిష్టించారు. ఈ వివరాలన్నీ నాటి అయోధ్య ఎస్ఐ రామ్‌దూబే ఎఫ్ఐఆర్ రాసి జిల్లా మెజిస్ట్రేటు కెకె నయ్యర్‌కు పంపారు. ముఖ్యమంత్రి గోవింద వల్లభ్ పంత్‌కూ నివేదించారు. దానిపై ప్రధాని నెహ్రూ, హోం మంత్రి పటేల్ కూడా ఆందోళనతో స్పందించారు. తక్షణచర్యలు తీసుకోవాల్సిందిగా పటేల్ పంత్‌కు లేఖ రాశారు. చివరకు 1949 డిసెంబరు 29న ఆ ఆవరణకు తాళాలు వేశారు.

సంఘ పరివార్ మతతత్వ రాజకీయాలు పెరుగుతున్న దశలో 1986 జనవరి 25న ఆ తాళాలు తెరవాల్సిందిగా పిటిషన్ వేశారు. ఆ సమయంలోనే షాబానో కేసులో రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఆర్డినెన్సు వివాదంగా మారింది. దానికి విరుగుడుగా హిందూ మతవాదులను మెత్తబరచాలని ఆయన చూస్తున్నారు. ఆ సమయంలో పిటిషన్‌పై విచారణ 40 నిముషాలలో ముగించి తాళాలు తీస్తే నష్టం లేదని జిల్లా జడ్జి ఎంకె పాండే తీర్పు నిచ్చారు. సాయింత్రానికే తాళాలు తెరిచేశారు. ఆ విధంగా బీజేపీ ఎజెండాలో పాలంపూర్ తీర్మానంలో రామమందిరం ప్రధాన రాజకీయ ఆయుధమై కూచుంది. మరోవంక వీహెచ్‌పీ తదితర రకరకాల సంస్థల పేర్లతో వ్యాజ్యాలు నడిపిస్తూ వచ్చారు. రామమందిర నిర్మాణానికి శిలాన్యాస్‌ను అనుమతిస్తూ 1989 సెప్టెంబరులో వీహెచ్‌పీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. నవంబరు 9న 586 ప్లాటు అనే భాగంలో శిలాన్యాస్ అనుమతించబడింది.

అక్కడి నుంచి సమస్య రూపమే మారిపోయింది. బీజేపీ రెండు స్థానాల నుంచి 89స్థానాలకు ఎదిగింది. 1990లో ఎల్‌కె అద్వానీ రథయాత్ర కరసేవ వంటివన్నీ అందులో భాగాలే. దానికోసం విపి సింగ్ ప్రభుత్వం కూల్చివేయబడింది. 1991లో బీజేపీ బలం 117కు చేరింది. 1992 డిసెంబరు ఆరున పివి నరసింహారావు ఉదాసీనతతో మసీదు విధ్వంసాన్నే సాగనిచ్చారు. అనంతర కాలంలో పార్లమెంటు ప్రార్థనా స్థలాల చట్టం చేసింది. వివాదాస్పద బాబరీ మసీదు/ రామజన్మభూమి తప్ప తక్కిన ఏ చోటనైనా స్వాతంత్ర్యం వచ్చిన నాటి పరిస్థితికి భంగం కలిగించరాదని ఆ చట్టం నిర్దేశిస్తోంది. మేము విధ్వంసానికి నిర్మాణంతో సమాధానం చెబుతామంటూ పివి ఏవో మాట్లాడారు గాని ఏమీ జరగలేదు. కాకపోతే ఆ చట్టుపక్కల స్థలం స్వాధీనం చేసుకుని ట్రస్టు వంటిది ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోవచ్చిన బీజేపీ ప్రభుత్వాలు కూడా పెద్ద ఎత్తున భూ సేకరణ చేసి అదంతా ఒక సముదాయంగా మార్చాయి. మరోవంక అయోధ్యలో క్షేత్రస్థాయిన చూస్తే మతశక్తుల మాటున వివిధ మాఫియాలు చెలరేగిపోయాయి. అఖారాలు మహంత్‌లు సిక్కు సంత్‌లు రకరకాల శక్తులు పనిచేస్తున్నాయి. రాజకీయంగా ఆరెస్సెస్ విహెచ్‌పి బజరంగ దళ్ వంటివి వుండనే వున్నాయి. వివాద స్థల పరిసరాలలో నిరంతరం ఏవో పనులు పూజలు హడావుడి నడుస్తూనే వుంది. 2010సెప్టెంబరులో అలహాబాద్ హైకోర్టు వివాదస్థలాన్ని మూడు ముక్కలు చేస్తూ రెండు హిందూ సంస్థలకు ఒకటి సున్నీబోర్డుకు కేటాయించిన తర్వాత ఈ హడావుడి ఇంకా పెరిగింది. ఆ తీర్పును ఎవరూ ఒప్పుకోకపోవడంతో సుప్రీం కోర్టుకు చేరింది. మోడీ ప్రభుత్వం వచ్చాక వీటికి మరీ కొమ్ములు వచ్చిన పరిస్థితి. భావి భారతదేశంలో మత రాజకీయాలకు అయోధ్య రాజధానిగా వుండటమే గాక భూ లావాదేవీలకు కూడా లాభదాయకంగా మారిపోతుందని ఈ శక్తులు చెబుతుంటాయి. వివాదంగా వున్న ప్లాటు తప్ప తక్కిన స్థలం రామమందిర ట్రస్టుకు అప్పగించేలా ఒక దశలో మోడీ సర్కారు పావులు కదిపింది కూడా. యథాతథ స్థితి కొనసాగాలని కోర్టులు చెప్పాకే ఆగింది. ఈ సమయంలో విపరీతమైన సంచలనాలకూ వివాదాలకు గురైన సుప్రీం కోర్టు ఆగమేఘాల మీద అయోధ్య కేసులు చేపట్టడం ఆసక్తి కలిగించింది. మొత్తంపైన రాముడు అక్కడ పుట్టాడనేది విశ్వాసం మాత్రమేనని చబుత్రాలో పూజను అనుమతించడం పరిస్థితుల బట్టి జరిగింది మాత్రమేనని తేలింది. మరోవైపున ఇన్నేళ్లుగా పూజలకు వక్ఫ్ బోర్డు అవకాశమిచ్చిన వాస్తవం కూడా ప్రస్తావనకు వచ్చింది. ముస్లిం పక్షాల తరపున సీనియర్ న్యాయవాదిగా వున్న రాజీవ్ ధావన్ పలుసార్లు తమను ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. ప్రశ్నలన్నీ మాకే వేస్తున్నారని కూడా అన్నారు. చివరలో ఆయన హిందూ మహాసభ లాయర్ ఇచ్చిన ఒక ఉత్తుత్తి మ్యాప్‌ను న్యాయమూర్తి అనుమతి కోరి మరీ చింపేయడం క్లైమాక్స్‌గా మారింది. ఇక ఇప్పుడు తీర్పు కోర్టు చేతుల్లో వుంది. ■

మెయిల్ @ నవతెలంగాణ

## ప్రభుత్వం పట్టు వీడాలి

రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె రోజు రోజుకూ ఉధృతం అవుతోంది. హైకోర్టులో రెండుసార్లు చర్చ జరిగి ప్రభుత్వానికి కార్మికులకు సూచనలు చేసినా ప్రభుత్వం పట్టువీడటం లేదు. పర్యవసానం ఇవాళ సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు తిరగబడే పరిస్థితి తెచ్చుకోవద్దని హైకోర్టు హెచ్చరికలు చేసినా ప్రభుత్వంలో కదలిక లేదు. గతంలో ఏ ప్రభుత్వాలు కూడా ఇంత బెట్టు చేయలేదు. ఉద్యమపార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఉద్యమాలను గౌరవించాలి. సమస్యను పరిష్కరించాలి. కానీ, అసలు ఉద్యమాలే చేయవద్దు అనే రీతిలో పరిపాలించడం ప్రజాస్వామిక ప్రభుత్వం లక్షణం కాదు. ప్రభుత్వం మొదటే కార్మిక సంఘాలతో చర్చించడానికి ఒక అడుగు ముందుకు వేస్తే పరిస్థితి ఇంతదాకా వచ్చేది కాదు. చివరికి ఎటువంటి ఆర్థిక భారం పడని ఆర్టీసీ సంస్థకు ఎండీని నియమించకపోవడం ప్రభుత్వ చిత్తశుద్ధిని తెలియజేస్తోంది. ఆర్టీసీలో కొత్త ఉద్యోగాల సంగతి దేవుడెరుగు, చివరికి ప్రభుత్వరంగ సంస్థలకు చైర్మన్‌ల నియామకాల్లో కూడా ప్రభుత్వ అలసత్వాన్ని హైకోర్టు ప్రశ్నించడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్టగా చెప్పుకోవచ్చు. విధిలేని పరిస్థితుల్లో ఆర్టీసీ కార్మిక సంఘాలు సమ్మె కొనసాగించడం అనివార్యంగా మారింది. కార్మికుల చివరి అస్త్రం సమ్మె ప్రయోగించక తప్పని పరిస్థితి ఈ రోజు ప్రభుత్వమే కల్పించింది. కార్మికులను ప్రతిపక్షాలు, రాజకీయ పార్టీలు రెచ్చగొడుతున్నాయన్న ప్రభుత్వ వాదనలో పసలేదు. సహజంగా ఎవరూ ఆందోళనలు చేసినా సమ్మె చేసినా ప్రతిపక్షాలు మద్దతు పలకడం ఇవాళ రాష్ట్రంలో కొత్తగా జరగడం లేదు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తే నాటి ప్రతిపక్షంగా నేటి అధికారపార్టీ టీఆర్ఎస్ నేతలు మద్దతు తెలపలేదా? కాబట్టి ప్రభుత్వం రాజకీయ కోణంలో కాకుండా మానవతా దృక్పథంతో ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి. ఆర్టీసీ కార్మికుల డిమాండ్లలో చాలా వరకు సంస్థ పరిరక్షణకు ఉద్దేశించినవే ఉన్నాయి. ప్రధాన డిమాండ్ అయిన ప్రభుత్వంలో విలీనం అంశాన్ని సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తామనో లేదా అమలు చేస్తామనో చెప్పి మిగతా డిమాండ్లపై చర్చలు జరపాలి. ఇవేమీ చేయకుండా చర్చలు లేవనడం సమంజసం కాదు. అన్ని డిమాండ్లు ఏ ప్రభుత్వాలూ పరిష్కరించవు. కాబట్టి ప్రభుత్వం వెంటనే మెట్టుదిగి కార్మికులను చర్చలకు పిలవాలి. ఇటు కార్మికులు కూడా డిమాండ్ల విషయంలో పట్టు విడుపులు వీడాలి. బస్సు రథచక్రాలు రాష్ట్ర ప్రగతి చక్రాలు అని చెప్పిన ప్రభుత్వం నేడు ఆ చక్రాలను ఎందుకు విచ్ఛిన్నం చేస్తున్నది? ఆలోచించాలి. సెల్ఫ్‌డిస్మిస్ అనే పదానికి చట్టబద్ధత లేదని తెలిసి కూడా ప్రభుత్వం కార్మికులను తొలగించామని చెప్పుకుంటూ కొత్త నియామకాలు చేయడం నియంతృత్వం అవుతుంది. కాబట్టి ప్రభుత్వం, కార్మికులు ఇద్దరూ కూడా ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఒక అడుగు ముందుకు వేసి చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి. కార్మికులు మేం చర్చలకు సిద్ధం అని ప్రకటించిన తరువాత కూడా ప్రభుత్వం మొండివైఖరికి స్వస్తి చెప్పకపోవడం తగదు. ఇప్పటికైనా పట్టువీడి కార్మిక సంఘాలతో చర్చలు జరిపి ప్రజా ప్రయోజనాలు కాపాడాలి.

–పెండెం రాజు, సెల్: 9498381929

# అమ్మభాష అందరికీ చేరువ చేసేలా..

**'అమ్మ' అన్నకమ్మని పిలుపు ఆంగ్లభాష ఆకర్షణలో పడి 'మమ్మీ'గా మారిపోయింది. తెలుగు మాట్లాడే వారి సంఖ్య నానాటికీ తగ్గిపోతూ.. అమ్మ భాషకు ఆదరణ కరువైంది. ఇతర రాష్ట్రాలు ప్రాథమిక విద్య మాతృభాషలోనే సాగాలంటూ ఉత్తర్వులిస్తుంటే, మన రాష్ట్రంలో మాత్రం భాషాభివృద్ధి కోసం ఉత్తుత్తిగా చర్యలు తీసుకుంటున్నారు. భాషను ప్రభుత్వాలు మరిచినా, ప్రజలు మాత్రం భాషాభిమానంతో అమ్మ భాషను బతికించుకుంటున్నారు. 'అచ్చంగా తెలుగు' అంటూ రేపటి తరానికి తేనెలొలుకు తెలుగులోని మాధుర్యాన్ని అందించే ప్రయత్నం చేస్తున్నారు భావరాజు పద్మిని. గత ఏడేండ్లుగా భాషకోసం కృషి చేస్తున్నారు. సాహిత్యం, సంగీతం, సేవ ఊపిరిగా భావించే ఆమె పరిచయం..**



పల్లెటూరి వాతావరణంలో కల్మషం లేని మనుషుల మధ్య, అచ్చ తెలుగు మాటలు వింటూ పెరిగాను. నాన్న కృష్ణ ప్రసాద్, స్టేట్ బ్యాంక్ ఉద్యోగి కావడంతో గుంటూరు జిల్లాలోని చిన్నచిన్న పల్లెటూర్లలో ఉండేవాళ్ళం. ప్రాథమిక విద్య తెలుగు మీడియంలో కొనసాగింది. ప్రభుత్వ పాఠశాలల్లోనే పాఠాలు బాగా చెప్పేవారు. స్కూలులో ఏదైనా వేడుక జరిగితే ఆ సందర్భంగా పాటలు, కథలు రాయించేవారు. తెలుగుభాషపై మక్కువ పెరగడానికి ఇవన్నీ కూడా కారణం కావచ్చు. ఇక ఇంట్లో అమ్మ పద్మావతి అనేక రకాల కథలు చెప్పేవారు. పురాణకథలు, నీతి కథలు ఆమె చెప్పుతుంటే వింటూ అలా నిద్రలోకి జారుకునేదాన్ని. అమ్మ ముగ్గులు బాగా వేసేవారు, కుట్లు, అల్లికలు ఎంతో నైపుణ్యంగా చేసేవారు. అమ్మ వీణ వాయించేవారు. ఆమె వెంట తిరుగుతూ అన్నీ నేర్చుకునేదాన్ని. చిన్నప్పుడు అమ్మ చెప్పిన కథలు విన్న తర్వాత మరిన్నికథల కోసం కాస్త పెద్దయ్యాక పుస్తకాలు ఎక్కువగా చదివేదాన్ని. సాహిత్యంపై అభిరుచి ఏర్పడడానికి అమ్మ కథలు, టీచర్ల ప్రోత్సాహం కారణం అయ్యింది. ఒక విధంగా చెప్పాలంటే అమ్మే నా రోల్ మోడల్.

### బాపుగారి హాస్యం...

చిన్నతనం నుంచి కథలపై పెరిగిన ఇష్టం సాహిత్యం చదివేలా చేసింది. స్కూలు లైబ్రరీలో ఉండే పుస్తకాలన్నీ చదివేసి ఇంకా కొత్త పుస్తకాల కోసం ఎదురుచూసేదాన్ని. హాస్యంతో సాగే కథనాలు ఇష్టపడేదాన్ని. ముళ్ళపూడి వెంకటరమణ, మృణాళిని గార్ల రచనలు ఆసక్తిగా చదివేదాన్ని. కథ రాయడం మాత్రం డిగ్రీలోనే రాశాను. ఇంటర్ కాగానే మేం హైదరాబాద్ వచ్చేశాం. అప్పట్లో గ్యాస్ సిలిండర్ బుక్ చేసిన తర్వాత రావడానికి ఎక్కువ రోజులు పట్టేది. ఒకరి ఇంటి నుంచి మరొకరి ఇంటికి సిలిండర్ తిరిగేది. ఇదే ఇతివృత్తంగా తీసుకుని 'చక్రభ్రమణం' పేరుతో సరదా కథ రాశాను. చదివిన వాళ్ళంతా బాగుందని మెచ్చుకున్నారు. పల్లెటూరు నుంచి రావడంతో మాకు నగరం పెద్ద పద్మవ్యూహంగా కనిపించేది. కనీసం పూలు కూడా దొరికేవి కాదు. ఇదే ఇతివృత్తంగా తీసుకుని ఆ తర్వాత నేను రాసిన మరో కథ 'మహానగరంలో మందారపువ్వు'. కథలు రాయడమే తప్ప వాటిని పత్రికలకు పంపించాలి, దాచుకోవాలి అన్న ఆలోచన ఉండేది కాదు. 2012 నుంచి నా కథలు ఎక్కువగా శిరాకదంబం, మాలిక, సంచిక వంటి ఆన్‌లైన్ మ్యాగజైన్లో వచ్చాయి. భూమిక, క్షత్రియ ప్రభ, ఆంధ్రభూమి పత్రికలలో, ప్రముఖాంధ్ర అంతర్జాతీయ మ్యాగజైన్లో వచ్చాయి.



### బాధ్యతల కారణంగా..

చిన్నతనం నుంచే సంగీతం, చిత్రలేఖనం, నాట్యం, సాహిత్యంలో ప్రవేశం ఉంది. చదువులోనూ టాపర్ గా ఉండేదాన్ని. డిగ్రీ తర్వాత ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ చదివాను. బయో ఇన్ఫర్మటిక్స్ కోర్సు పూర్తి చేశాను. కొన్ని రోజులు లెక్చరర్ గా పనిచేశాను. పెండ్లి తర్వాత కుటుంబ బాధ్యతలు పెరగడంతో ఉద్యోగం చేయడం వీలు కాలేదు. ఇద్దరుపాపలు పుట్టిన తర్వాత ఇంకా బాధ్యతలు పెరిగాయి. ఇక ఉద్యోగం చేయాలన్న ఆలోచన మానుకున్నాను.

### అచ్చంగా తెలుగు..

ఉద్యోగం చేయడం వీలుకాకపోతే ఇక ఏం చేయలేనా? ఇంటికే పరిమితం కావాలా? అన్న సందిగ్ధం నాలో కలిగింది. ఏదైనా చేయాలన్న తపన ఉన్నా.. ఏం చేయాలో తెలిసేది కాదు. 2011లో జీమెయిల్ లో తెలుగు టైపింగ్ వచ్చింది. అందరికీ తెలుగులోనే మెయిల్స్ పంపించేదాన్ని. అది చదివిన కొందరు 'మీ తెలుగు చాలా బాగుంది. తెలుగు భాష కోసం ఏమైనా చేయవచ్చు కదా' అంటూ సూచించారు. దాంతో అందుబాటులో ఉన్న టెక్నాలజీని ఉపయోగించి 2012లో ఫేస్‌బుక్ గ్రూప్ ఏర్పాటుచేశాను. అలా 'అచ్చంగా తెలుగు' ప్రారంభమైంది. మొదట్లో ఈ గ్రూప్‌లో ఎక్కువగా మా బంధువులు, స్నేహితులే ఉండేవారు. క్రమంగా సభ్యులు పెరిగారు. రోజూ ఒకేలా రాస్తే ఎవరూ చదవరు. అందుకే రోటిన్ గా కనిపించే కొన్ని సంఘటనలకు హాస్యం జోడించి రాసేదాన్ని. అలా తొలిదశలో నా రచనలు హాస్యవ్యాసాలుగా చాలామందికి చేరువయ్యాయి. ప్రస్తుతం మా ఫేస్‌బుక్ పేజి లో 26వేల మంది, ఫేస్ బుక్ గ్రూప్ లో 60వేల మంది ఉన్నారు. ఐదేండ్ల నుంచీ మా ఆన్‌లైన్ పత్రిక, ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందికి సాహిత్యాన్ని చేరువచేస్తుంది. ఇప్పుడిప్పుడే యూట్యూబ్ ఛానల్ కూడా అన్నిరకాల అంశాలతో అందుబాటులోకి వస్తోంది.

### పూలతోటగా పెంచుతూ..

నా ప్రయాణం ఒంటరిగా మొదలైనా, ఇప్పుడు ఎంతో మంది నాకు సహాయంగా ఉన్నారు. మా సంస్థ తెలంగాణాలో రిజిస్టర్ అయింది. సంస్థ తరఫున జరిగే పలు కార్యక్రమాల్లో, గ్రూప్ నడపడంలో, పెయ్యేటి రంగారావు, అయ్యగారి నాగేంద్రకుమార్, పరమేశ్వరుని కృప, విజయ గొల్లపూడి, ఆలూరి కృష్ణప్రసాద్, కట్టుపల్లి ప్రసాద్ తదితరులు, మరెందరో సహృదయులు అహర్నిశలూ తోడ్పడుతున్నారు. కట్టుపల్లి ప్రసాద్ గారు ఈ గ్రూప్ ద్వారా ఛందస్సు పాఠాలు చెప్పి 200 మందికి పద్యాలు రాయడం నేర్పించారు. ఆర్టిస్ట్ నాగేంద్రబాబు గారు గత ఐదేళ్లుగా మా పత్రిక కోసం ఎంతో అందంగా బొమ్మలు వేస్తున్నారు.

### సమాజంపట్ల బాధ్యత...

విశాఖ తుఫాన్ వచ్చినప్పుడు రామకృష్ణ మిషన్ కు మేము నిధులు పోగు చేసి, లక్ష రూపాయలు ఇచ్చాం. చదువుకు డబ్బు లేని వారిని, అనుకోకుండా ఆరోగ్య సమస్యలు వచ్చిన వారిని మా సంస్థ తరఫున ఆదుకున్నాం. ఫ్రీలాన్సర్‌గా రేడియోలో వాయిస్ ఓవర్ ఇచ్చాను. ఏడాదిగా డిడి యాదగిరి లో 'సాహితీ సౌరభాలు' అనే కార్యక్రమానికి యాంకరింగ్ చేస్తున్నాను. ఆడియో వీడియో ఎడిటింగ్, షూటింగ్ వంటి నేర్చుకున్నాను. మైండ్ మీడియా అనే ఆన్‌లైన్ రేడియో లో ప్రోగ్రాం డైరెక్టర్ గా పని చేశాను. ఈ



ప్రస్థానంలో అనేకమంది సాహిత్యదిగ్గజాలను కలుసుకునే వీలు కలిగింది. నా రచనలు చదివి ప్రముఖ సినీ రచయితలు సిరివెన్నెల, రామజోగయ్య శాస్త్రి, భువనచంద్ర తదితరులు 'చాలా బాగా రాస్తున్నావు' అంటూ అభినందించారు. ఇది నాకు లభించిన ఉత్తమ ప్రశంసలుగా భావిస్తాను.

### రేపటి తరం కోసం..

తెలుగులో మాట్లాడేవారి సంఖ్య తగ్గుతుంది. కేవలం తెలుగు నేర్చుకుంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేని కారణంగా రేపటి తరం తెలుగు భాషకు దూరం అవుతుంది. ఈ ప్రమాదాన్ని నివారించడానికి సమ్మర్ క్లాస్లు నిర్వహించాలన్న ఆలోచన ఉంది. మాతృభాషను అందిస్తే సంస్కృతిని అందించడం సులభం అవుతుంది. అందుకే అచ్చంగా తెలుగు ద్వారా నెట్ లో తెలుగు రాసే వారి సంఖ్యను, తెలుగు మాట్లాడేవారి సంఖ్యను పెంచే ప్రయత్నం చేస్తున్నాం.

వి.యశోద



శక్తివంతమైన మహిళ అంటే స్వరం ఉన్న మహిళే. తన కోసం, తన చుట్టూ ఉన్నవాళ్ల కోసం గళమెత్తే మహిళ. ఆమె ప్రపంచ గమనాన్నే మలుపు తిప్పగలుగుతుంది.
- మిలిందా గేట్స్



## ఏ ఆహారం తీసుకోవాలి?

హెల్తీఫుడ్ అంటే ఏది?.. రోజూ ఎలాంటి ఆహారం తీసుకోవాలి. వారంలో ఎన్ని రోజులు మాంసాహారం తీసుకోవచ్చు అనే అనుమానం అందరిలోనూ ఉంటుంది. మీకూ ఈ అనుమానముంటే.. ఇది చదవండి..

- తాజా కూరగాయల్లోనూ, పండ్లలోనూ యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి వారంలో ఐదు రోజులు పండ్లు, కూరగాయలు తీసుకోండి.
- ముఖ్యంగా పండ్లలో మెదడును రక్షించే యాంటీ యాక్సిండెంట్లు పుష్కలంగా ఉంటాయి.
- కాలీఫ్లవర్‌లో ఎక్కువ శక్తి ఉంటుంది. కాబట్టి వీటిని ఎక్కువగా తీసుకోవాలి. యాపిల్స్, గ్రేప్స్, ఆనియన్స్, టీ, డార్క్ చాకెలెట్‌లో కూడా యాంటీఅక్సిడెంట్లు ఉంటాయి. వారంలో ఐదు రోజులు వీటిని తీసుకుంటే యాంటీ యాక్సిడెంట్లకు కొదవే ఉండదు.
- అలాగే ఆలివ్‌ఆయిల్, నట్స్, సన్‌ఫ్లవర్ సీడ్స్, అవకాడోలో యాంటీ అక్సిడెంట్‌గా పనిచేసే ఇ-విటమిన్ పుష్కలంగా ఉంటుంది. ఇది అల్జీమర్స్ వ్యాధికి బాగా పనిచేస్తుంది. తరచుగా వీటిని తీసుకునేవారిలో అల్జీమర్ వ్యాధి బారిన పడే అవకాశం 67 శాతం తగ్గిపోతుంది. కాబట్టి వీటిని వారంలో ఒకరోజైనా మీ మెనూలో ఉండేలా చూసుకోవాలి.
- వారానికి రెండు సార్లు చేపలు తీసుకుంటే రక్తంలో ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్ డీహెచ్ఏ లెవల్స్ అత్యధిక స్థాయిలో ఉంటాయి. దీంతో మెదడులోని కణాలు సమర్థంగా పనిచేస్తాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.

## ఆకాశాన్ని అందుకున్న అడవిబిడ్డ...

**ఆకాశంలో ఎగిరే విమానాలంటే తనకెంతో ముచ్చట. చిన్నప్పుడు ఆడుకుంటూ వాటిని చూసి మురిసిపోయేది. పెద్దయ్యాక తానూ పక్షిలాగ ఎగరాలనుకున్నది. ఆ కోరిక ఒక్కసారి విమానం ఎక్కితే తీరిపోతుందా.. మరీ రోజూ విమానాలు ఎక్కాలంటే.. పైలెట్ కావడం ఒక్కటే మార్గమని తెలుసుకున్నది. పైలెట్ అవ్వడమే తన జీవిత లక్ష్యంగా పెట్టుకున్నది అనుప్రియ లక్రా.**




తొలి ఆదివాసీ మహిళా పైలట్‌గా అనుప్రియ లక్రా చరిత్ర సృష్టించింది. ఒడిశాలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన మల్కాన్‌గిరి జిల్లా తన స్వస్థలం. చిన్నప్పుడు దట్టమైన అడవుల నుంచి విమానాలు వెళ్లడం చూసి ఎంతో ముచ్చపడేది. దేశంలో ఒక మూలన విసిరేసినట్లు ఉండే గ్రామం నుంచి వచ్చిన ఈ యువతి కమర్షియల్ విమానం నడిపే స్థాయికి ఎదిగింది. 23 ఏండ్ల అనుప్రియ లక్రా అనుకున్న లక్ష్యన్ని సాధించి ప్రముఖుల ప్రశంసలు అందుకుంది.

2012లో ఇంజినీరింగ్ విద్యను మధ్యలోనే వదిలేసి, పైలెట్ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించింది. ఆ తర్వాత భువనేశ్వర్‌లో పైలెట్ శిక్షణ తీసుకున్నది. ఏడేండ్ల తర్వాత ఓ ప్రైవేటు విమానయాన సంస్థలో కో-పైలట్‌గా ఉద్యోగం సాధించింది. ప్రస్తుతం కమర్షియల్ విమానం నడిపే అవకాశం లభించింది.

అనుప్రియ తండ్రి మరినియాస్ లక్రా... ఒడిశా పోలీస్ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. 'అనుప్రియ గురించి తెలిసి చాలా ఆనందపడ్డాను. నిబద్ధత, పట్టుదలతో ఆమె అరుదైన విజయం సాధించారు. అంతేకాదు.. ఎంతోమంది ఆదివాసీలకు, మహిళలకు స్ఫూర్తిగా నిలిచారు' అంటూ ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ ప్రత్యేకంగా అభినందించారు.

## ఆరోగ్యాన్నిచ్చే

బోలెడంత ఆటవిడుపుతోబాటు చక్కని ఆరోగ్యాన్ని అందించే ఏకైక వాహనం సైకిల్. అన్ని తరగతుల వారు కొనగలిగిన వాహనమే గాక కాలుష్యపు సమస్యలూ ఉండవు. ఆరోగ్యంతో బాటు తగినంత ఫిట్నెస్ అందించే సైక్లింగ్ తాలూకు కొన్ని అంశాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.



- కండరాల బలోపేతానికి సైక్లింగ్‌ను మించిన వ్యాయామం మరొకటి లేదు. భుజాలు, గుండె కండరాలకు సైక్లింగ్ చేసే మేలు అంతాఇంతా కాదు.
- తుంటి, మోకాళ్ళు, పిక్కల కదలికలను మెరుగు పరచటమే గాక వాటికి మేలైన ఆకారాన్నిచ్చే వ్యాయామమే సైక్లింగ్.
- రన్నింగ్, జాగింగ్ కంటే సైక్లింగ్ సులభమైన వ్యాయామం. వారానికి కనీసం రెండు, మూడు గంటలపాటు సైకిల్ తొక్కితే అవసరమైన కార్డియో వ్యాయాయం అందినట్లే.
- స్టామినా పెంచుకోవాలనుకునే వారు, బరువు తగ్గించుకోవాలనుకునే వారు రోజూ కాసేపు సైకిల్ తొక్కాలి. ఒక గంట పాటు సైకిల్ తొక్కటం వల్ల సుమారు 300 కేలరీలు ఖర్చవుతాయి. రోజూ అరగంట పాటు సైకిల్ తొక్కే వారు ఏడాదిలో 5 కేజీల బరువు తగ్గుతారు.
- ఆయా అవయవాల మధ్య చక్కని సమన్వయానికి సైక్లింగ్ ఎంతో దోహద పడుతుంది.
- సైక్లింగ్ ఏకాగ్రతను చేకూర్చటమే గాక నాడుల పని తీరును మెరుగు పరుస్తుంది.
- రోజూ సాయంత్రం కాసేపు సైకిల్ తోక్కేవారిలో మానసికమైన సమస్యలూ రావు.

## పిల్లలతో పిల్లలై...

ఈ కాలంలో తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగాలకు వెళ్లక తప్పని పరిస్థితి. దీంతో పిల్లలతో ఎక్కువ సమయం గడపలేని పరిస్థితి. దీనివల్ల పిల్లలకు, తల్లిదండ్రులకూ మధ్య దూరం పెరిగిపోతుంది. అందుకే అటు ఉద్యోగం చేసుకుంటూనే బంధం బలపరుచుకోవాలంటే..

- పిల్లలు తల్లిదండ్రులతో ఆడేందుకు ఎంతో ఆసక్తి చూపిస్తారు. అందుకే మీరూ పిల్లల్లా మారిపోయి వాళ్లతో ఆడండి. అలాగే ఎటువంటి ఆలోచనలైనా సరే వారు చెప్పేది పూర్తిగా వినండి. అది సరైనవి కావని అనిపించినా వెంటనే చెప్పేయకండి. పూర్తిగా చెప్పాక ఏది ఎలా చేస్తే మంచిదో చెప్పే ప్రయత్నం చేయండి. ఇలా చేయడం వల్ల వాళ్లు బాధపడరు. సరైన నిర్ణయాలు తీసుకునే శక్తి వాళ్ల సొంతమవుతుంది.
- పిల్లలతో ఎంత ఎక్కువ సమయం గడిపితే అంత గాఢమైన బంధం ఏర్పడుతుంది. మీ సాన్నిహిత్యం వారికి ఎంతో ఊరటనిస్తుంది. మీ పిల్లలకు సంబంధించిన రోజూవారీ కార్యక్రమాల్లో పాల్గొనే సమయం మీకు ఉండకపోవచ్చు. కానీ ముఖ్యమైన వాటికి మీరు తప్పక వెళ్లండి. ప్రాజెక్టుల తయారీ, పాఠశాలలో జరిగే ప్రత్యేక కార్యక్రమాల సమయాల్లో వారితో ఉండేలా చూసుకోండి.
- వారాంతాల్లో మీ మొత్తం సమయాన్ని పిల్లలకు కేటాయించండి. దీంతో ఉద్యోగ బాధ్యతలతో వాళ్లను పట్టించుకోవట్లేదన్న భావన వాళ్లలో కలగదు.



## వెదురుతో అలంకరిస్తే...





ప్రస్తుతం వెదురుతో తీర్చిదిద్దిన ఫర్నిచర్ మార్కెట్‌లో విస్తృతంగా లభిస్తోంది. వెదురుతో ఇండ్లు కూడా కట్టేస్తున్నారు. కాస్త సృజనాత్మకత జోడిస్తే ఎక్కువ ఖర్చు లేకుండా వెదురుతో మీ ఇంట్లో ఒదిగిపోయే అందమైన అలంకరణ వస్తువులు మీరే తయారు చేసుకోవచ్చు.

**కలర్‌ఫుల్‌గా:** అన్ని రకాల వెదురు బొంగులు మార్కెట్‌లో అందుబాటులో ఉంటున్నాయి. కాస్త బలమైన వాటిని తీసుకుని.. ఓ క్రమమైన సైజులో కట్ చేయండి. వాటికి అందమైన రంగులు వేసి, మెరిసిపోయే రిబ్బన్లు చుట్టేయండి. కలర్‌ఫుల్‌గా కనిపించే ఆ బాంబూ పోల్స్‌ను హాల్‌లో గోడపై అమర్చి చూడండి.. మీ హాల్ అందం రెట్టింపు అవుతుంది.

**సపోర్టివ్ డెకరేషన్:** ఆర్టిఫిషియల్ సొబగులు ఎన్ని ఉన్నా.. నేచురల్ అందం ముందు అవి ఇట్టే తేలిపోతాయి. బాంబో పోల్స్‌తో ఎన్నో అద్భుతాలు చేయవచ్చు. హాల్‌లో, బాల్కనీలో నాలుగైదు బాంబో పోల్స్‌ను పిల్లర్స్‌లా అమర్చేయండి. మీ ఇంటికి ట్రెడిషనల్ లుక్ వచ్చేస్తుంది. బాంబూలో తీపి ఉండటం వల్ల చెదలు పడతాయి. వార్నిస్ బాగా అప్లయ్ చేసి.. చెదలు పట్టకుండా జాగ్రత్తలు తీసుకుంటే వెదురుకు తిరుగే ఉండదు.

చిన్న చిన్న బాంబో ముక్కలను అలంకరణ వస్తువులుగా వాడేయొచ్చు. వెదురుతో పేపర్ వెయిట్స్, పెన్ స్టాండ్లు, ఫోటో ఫ్రేమ్స్, వాల్ హ్యాంగింగ్స్.. వంటివి మనమే తయారు చేసుకోవచ్చు. మరెందుకు ఆలస్యం. వెదురుతో అదిరిపోయేలా డెకరేట్ చేసేయండి. మీ సృజనాత్మకతను జోడించి బాంబూతో మీ ఇంటికి సరికొత్త అందాలను తెచ్చేయండి.







నవతెలంగాణ

## సమ్మెకు మద్దతుగానే నిరసనలు

- పీఆర్టీయూటీఎస్ అధ్యక్షులు శ్రీపాల్‌రెడ్డి



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ఆర్టీసీ సమ్మెకు మద్దతుగానే నిరసన కార్యక్రమాలు జిల్లాల్లో జరిగాయని పీఆర్టీయూటీఎస్ అధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి చెప్పారు. 'పీఆర్టీయూ... కీలుబొమ్మే'అనే శీర్షికన మంగళవారం నవతెలంగాణలో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. పాఠశాలలు పున:ప్రారంభమైన రోజు సోమవారం ఆర్టీసీ సమ్మెకు మద్దతుగా పీఆర్టీయూ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనల్లో పాల్గొన్నారని తెలియజేశారు. ఆర్టీసీ సమ్మెకు మద్దతు ప్రకటించినందుకు వరంగల్‌లో ఆర్టీసీ జేఏసీ నేతలు పీఆర్టీయూకు కృతజ్ఞతలు తెలిపారని గుర్తు చేశారు.

## పరకాల ఎమ్మెల్యేకు సీఎం అభినందన

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

జాతీయ స్థాయిలో ఉత్తమ ఎమ్మెల్యేగా ఎంపికైన పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం అభినందించారు. వివిధ రాష్ట్రాల్లోని నియోజకవర్గాల్లో అభివద్ధి పనులను పరిశీలించిన ఢిల్లీలోని చాణక్య ఫౌండేషన్ పరకాలను ఉత్తమ నియోజకవర్గంగా ఎంపిక చేసింది. గతనెల 26న ఢిల్లీలో కేంద్రమంత్రి రామేశ్వర్ తేలి, పద్మ విభూషణ్ మురళీ మనోహర్ జోషి చేతుల మీదుగా ఎమ్మెల్యే ధర్మారెడ్డి ఈ అవార్డును అందుకున్నారు.

## హైకోర్టు తీర్పును స్వాగతించిన సీపీఐ

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

మున్సిపల్ ఎన్నికలకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడాన్ని సీపీఐ రాష్ట్ర సమితి స్వాగతించింది. ఈ మేరకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అనివార్యంగా మున్సిపల్ వార్డుల విభజనలో అనేక అవకతవకలు జరిగాయని ఫిర్యాదు ఇచ్చిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ జాప్యమైందని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘానికి కావాల్సిన పూర్తి సమాచారాన్ని, వనరులను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాలని కోరారు. ఈ ఎన్నికల్లో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

## బ్యాంకుల విలీనాన్ని ఆపాలి : సురవరం

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

బ్యాంకుల విలీనాన్ని వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ - తెలంగాణ బ్యాంకు ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఏపీటీబీఈఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం బ్యాంకు ఉద్యోగుల సమ్మె విజయవంతంగా జరిగిందని ఏపీటీబీఈఎఫ్ గౌరవాధ్యక్షులు సురవరం సుధాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సమ్మె నిర్వహించిన బ్యాంకు ఉద్యోగులను ఆయన అభినందించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రజాభిప్రాయం ప్రకారం బ్యాంకుల విలీనాన్ని ఆపాలని, ఉన్న బ్యాంకులను అలాగే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

## పంచలోహ విగ్రహాల విక్రయ ముఠా అరెస్ట్

- 11 మందిపై కేసు నమోదు



**నవతెలంగాణ-మంగపేట**

పంచలోహ విగ్రహాలు అమ్ముతున్న 11మందిని అరెస్టు చేసినట్టు ములుగు జిల్లా ఏటూరునాగారం ఏఎస్పీ శరత్‌చంద్ర తెలిపారు. మంగపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. తెల్లవారుజామున తిమ్మంపేట క్రాస్ వద్ద ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వరరావు సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీలు చేపట్టారు. మణుగూరు వైపు నుంచి మంగపేట వస్తున్న కారులోని వారు పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా వెంబడించి పట్టుకున్నారు. అందులో ఉన్న 11 మంది పొంతనలేని సమాధానాలు చెప్పడంతో కారులో తనిఖీ చేశారు. సుమారు 4.690 కిలోల కనకదుర్గ పురాతన పంచలోహ విగ్రహం, 3.470 కిలోల బుద్ధ పంచలోహ విగ్రహం, 200 రాగి నాణేలు, 47 తెలుపు, 13 పసుపుపచ్చ, 14 ఆకుపచ్చ రాళ్లను స్వాధీనం చేసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల పరిసర ప్రాంతాల్లో పురాతన పంచలోహ విగ్రహాలు, రంగు రాళ్లు దొరుకుతాయనే సమాచారం మేరకు మంగళవారం తెల్లవారుజామున రెండు గంటలకు వెంకటాపురంలో అందరూ కలుసుకున్నారు. అక్కడ నుంచి చర్లలోని ఓ అజ్ఞాత వ్యక్తి దగ్గర నుంచి పైన పేర్కొన్న వస్తువులకు సుమారు రూ.9.75 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అడ్వాన్స్‌గా మూడు లక్షలు ఇచ్చారు. తిరిగి వస్తున్న క్రమంలో పోలీసులకు పట్టుబడ్డారు. మేడారానికి చెందిన గుండపు లక్ష్మణ్, పోరిక నరేష్, ఏడూళ్లబయ్యారానికి చెందిన వెన్న ప్రవీణ్, పందిరిపల్లి ఆనంద్, పినపాక మండలం తోగ్గూడెంకు చెందిన బగుతు చిరంజీవి, వాజేడుకు చెందిన సవలం సుధాకర్, వెంకటాపురం మండలం సూరవీడుకు చెందిన ఎడ్ల సంపత్‌కుమార్, వెంకటాపురం మండలం కె.కొండాపురానికి చెందిన పిన్నపల్లి కృష్ణ, మణుగూరుకు చెందిన కీసర దేవేందర్, నగునూరి వెంకటేశ్వర్లు, సాంబాయగూడెంకు చెందిన కొరిపెల్లి వెంకన్నను రిమాండ్‌కు పంపినట్లు ఏఎస్పీ తెలిపారు.

## నీటితొట్టిలో పడి ఇద్దరు చిన్నారులు మృతి

**నవతెలంగాణ-హత్నూర్, జూలూరుపాడు**



ఆడుకుంటూ వెళ్లి నీటితొట్టిలో పడి ఇద్దరు చిన్నారులు మృతిచెందారు. సంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మంగళవారం ఈ ఘటనలు జరిగాయి. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం ముచ్చర్ల గ్రామంలో యాదగిరి, అరుణల కూతురు లక్ష్మి (మూడేండ్లు) మధ్యాహ్నం సమయంలో ఆడుకుంటూ పోయి బాత్రూంలో ఉన్న నీటితొట్టిలో పడింది. కొద్దిసేపటి తర్వాత తల్లి కూతుర్ని వెతికింది. బాత్రూంలో నీటిలోపడి కన్పించడంతో వెంటనే బయటికి తీసింది. చికిత్స నిమిత్తం నర్సాపూర్‌లోని హాస్పిటల్‌కు తీసుకెళుతుండగా పరిస్థితి విషమించి చిన్నారి మార్గమధ్యంలో మృతిచెందింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం సాయిరాంతండాకు చెందిన జాటోతు రమేష్, నాగమణిల కుమారుడు లోక్షిత్ (18 నెలలు) ఆడుకుంటూ వెళ్లి ఇంట్లో ఉన్న నీటితొట్టిలో పడ్డాడు. కొద్దిసేపటి తర్వాత తల్లిదండ్రులు వెతకడంతో అప్పటికే విగతజీవిగా మారాడు.

## అప్పుల బాధతో ఇద్దరు రైతులు ఆత్మహత్య

**నవతెలంగాణ-కోనరావుపేట, గూడురు**

అప్పుల బాధ భరించలేక వ్యవసాయ బావిలో దూకి ఒకరు, పురుగుల మందు తాగి మరో రైతు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనలు రాజన్నసిరిసిల్ల, మహబూబాబాద్ జిల్లాలో మంగళవారం జరిగాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో ఎరవెల్లి సామెల్ తన ఎకరంన్నర భూమిలో పత్తి పంట వేశాడు. వరుసగా కురిసిన వర్షాలతో పొలంలో నీరు నిలిచి ఎర్రబొమ్మిడి తెగులు వచ్చి పంట మొత్తం నల్లబడింది. పంట చేతికచ్చేలా లేకపోవడం, పెట్టుబడి కోసం చేసిన సుమారు రూ.3లక్షల అప్పు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం రాత్రి పొలం వద్దకు వెళ్లొస్తానని చెప్పి బయల్దేరిన అతను.. మంగళవారం ఉదయం పొలం వద్ద బావిలో సామిల్ (40) మృతదేహమై కనిపించాడు. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పైకి తీశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నరేశ్ కుమార్ తెలిపారు. మృతుడికి భార్య లలిత, కుమారుడు ఉన్నారు.

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గాజులగట్టు గ్రామం మర్ల బీరయ్య (38)కు నాలుగెకరాల భూమి ఉంది. కొన్నేండ్లుగా పంటలు పండక తెచ్చిన అప్పులు తీర్చలేక ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి ఇద్దరు కుమారులున్నారు.

# కృష్ణమ్మ పరుగులు

**ప్రస్తుత నీటి సంవత్సరంలో ఆరవసారి భారీ వరదలు**

- శ్రీశైలం ప్రాజెక్టులో పెరుగుతున్న ఇన్‌ఫ్లో
- నిండు కుండల్లా ప్రాజెక్టులు



**నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి**

కృష్ణా పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలతో బేసిన్‌లోని ప్రాజెక్టులకు భారీగా ప్రవాహాలు నమోదవుతునన్నాయి. ప్రస్తుత నీటి సంవత్సరంలో ఆరవ సారి వరద నీరు వచ్చి చేరుతున్నది. ఇప్పటికే ప్రధాన ప్రాజెక్టులన్నీ నిండు కుండల్లా మారాయి. గత మూడు నెలలుగా వచ్చిన వరదలతో 600 టీఎంసీల నీరు సముద్రం పాలైందని అధికార వర్గాల ద్వారా తెలిసింది. కర్నాటక పరిధిలోని ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి రెండున్నర లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుండగా తుంగభద్రకు కూడా భారీ వరద రావటంతో శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో గణనీయంగా పెరిగింది. మంగళవారం శ్రీశైలం ప్రాజెక్టుకు 3,36,315 క్యూసెక్కుల వరద రాగా రెండు వైపులా విద్యుదుత్పత్తి కొనసాగుతున్నది. ఈ ప్రాజెక్టు నుంచి సాగర్‌కు 71,377 క్యూసెక్కులు విడుదల చేశారు. నాగార్జునసాగర్‌లో కూడా ఇన్‌ఫ్లో పెరుగుతున్నది. మంగళవారం ఈ ప్రాజెక్టులో ఇన్‌ఫ్లో 71.377 క్యూసెక్కులు కాగా ఇప్పటికే ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరటంతో వచ్చిన నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నారు. సాగర్‌లో నీటి మట్టం బుధవారం నాటికి మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. జూరాల ప్రాజెక్టు నుంచి 2,54,910 క్యూసెక్కులు విడుదల చేశారు. సాగర్ ఎడమ కుడి కాల్వలకు నీరు విడుదల చేస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టు నుంచి ఖరీఫ్ పంటకు నీరందిస్తున్నారు. యాసంగి పంటకు కూడా పూర్తి స్థాయిలో నీరివ్వటానికి సన్నాహాలు చేస్తున్నారు.

**ఎస్సారెస్పీలో కొనసాగుతున్న వరద...**

మూడేండ్ల తర్వాత శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు నిండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టులో వరద ప్రవాహం కొనసాగుతున్నది. ఈ ప్రాజెక్టులో మంగళవారం ఇన్‌ఫ్లో 45,000 క్యూసెక్కులు కాగా ఇప్పటికే రిజర్వాయర్ పూర్తి స్థాయి సామర్థ్యానికి చేరుకోవటంతో ఇదే మొత్తంలో నీటిని కిందకి విడుదల చేస్తున్నారు. ఎస్సారెస్పీ మొదటి దశ కింద 9 లక్షల ఎకరాలు, రెండవదశ కింద 7 లక్షల ఎకరాలు ఉండగా ఖరీఫ్‌లో నీరు విడుదల చేయలేదు. యాసంగి పంటకు నీరిస్తామని అధికారులు చెప్తున్నప్పటికీ రెండవ దశకు ఇస్తారో లేదో ఇప్పటికీ స్పష్టత రాలేదు. మేడిగడ్డ, ఎల్లంపల్లి ప్రాజెక్టుల్లో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ మిడ్‌మానేర్‌కు నీరు పంపింగ్ చేయటం లేదు. 25.27 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన మిడ్‌మానేర్‌లో కేవలం 2.85 టీఎంసీల నీరు మాత్రమే ఉన్నది. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ప్రస్తుత సీజన్‌లో కూడా ఆయకట్టుకు నీరిచ్చే అవకాశం కనిపించటం లేదు.

**ప్రధాన రిజర్వాయర్లలో మంగళవారం పరిస్థితి**

| రిజర్వాయర్ | నీటి నిల్వ సామర్థ్యం (టీఎంసీల్లో) | ప్రస్తుత నీటి నీటి నిల్వ (టీఎంసీల్లో) | ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) |
|---|---|---|---|---|
| ఆల్మట్టి | 129.72 | 125.83 | 1,85,000 | 2,50,000 |
| నారాయణపూర్ | 37.64 | 33.08 | 2,30,000 | 2,57,844 |
| జూరాల | 9.66 | 9.62 | 2,30,000 | 2,54,910 |
| శ్రీశైలం | 215.81 | 210.03 | 3,36,315 | 82,369 |
| తుంగభద్ర | 100.86 | 100.39 | 1,48,100 | 1,55,503 |
| నాగార్జునసాగర్ | 312.05 | 311.75 | 71,377 | 71,377 |
| పులిచింతల | 45.77 | 44.18 | 40,267 | 44,548 |
| గోదావరి బేసిన్ | | | | |
| ఎస్సారెస్పీ | 90.31 | 90.31 | 45,500 | 45,500 |
| మిడ్‌మానేర్ | 25.27 | 2.85 | 1,798 | 72 |
| లోయర్ మానేర్ | 24.07 | 18.63 | 4,774 | 4,774 |
| ఎల్లంపల్లి | 20.18 | 19.76 | 79,428 | 82,050 |

## రైతులకు రుణాలు ఇవ్వరా? : సాగర్



**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

రైతు రుణమాఫీ కోసం బడ్జెట్‌లో ప్రకటించిన రూ 6వేల కోట్లను ప్రభుత్వం బ్యాంకులకు ఇవ్వకపోవడంతో రైతులకు బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి టి సాగర్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం రుణ లక్ష్యంగా భారీగా పెట్టుకున్నా...ఇప్పటికీ 28 లక్షల మందికి మించి పంట రుణాలు ఇవ్వలేదని తెలిపారు. 27 లక్షల మంది రైతులు రుణం కోసం బ్యాంకు గడప తొక్కని వారే ఉన్నారని పేర్కొన్నారు. మంగళవారం ఎస్‌వీకేలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి జంగారెడ్డి అధ్యక్షతన రైతు సంఘం రాష్ట్ర కమిటీ సమావేశమైంది. ఇప్పటికీ రైతులు ప్రయివేట్ రుణాలపై ఆధారపడి సాగు చేసుకుంటున్నారని చెప్పారు. పంటరుణం ఇవ్వకపోవడం వల్ల ఈసారి పంట బీమాకు ప్రీమియం వసూలు చేయలేదన్నారు. రుణం పొందని వారు స్వచ్ఛందంగా బీమా చెల్లించే పరిస్థితి లేదన్నారు. ప్రధానమంత్రి ఫసల్‌బీమా వచ్చిన తర్వాత రాష్ట్రంలో 18 లక్షల మందికి మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీమా ప్రీమియం చెల్లించాయని పేర్కొన్నారు. ప్రభుత్వ నిధుల కొరతను సాకు చూపించి, రైతు బంధు పథకానికి ఎగనామం చేసే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. అంతకు ముందే 9 లక్షలమందికి పాసు పుస్తకాలు లేకుండా గత మూడు వాయిదాలను రైతులు పొందలేదని చెప్పారు. గతేడాది రబీ పంటకు మార్కెట్లలో కేంద్రం నిర్ణయించిన ఎంఎస్‌పీ ధర అమలు కాలేదన్నారు. ఈ సమావేశంలో ఏఐకేఎస్ జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు అరిబండి ప్రసాదరావు, వి సంజీవరెడ్డి, మూడ్ శోభన్, బొంతు రాంబాబు, నాగిరెడ్డి, మధుసూధన్‌రెడ్డి, మాదిలేని లక్ష్మి, బండి పద్మ, తదితరులు పాల్గొన్నారు.

## 391 బడుల్లో సైన్స్‌ల్యాబ్‌లు

**రూ.35.19 కోట్లతో నిర్మాణం**

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలోని సర్కారు బడుల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించింది. అందులో భాగంగా 391 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సైన్స్ ల్యాబొరేటరీలు ఏర్పాటు కానున్నాయి. సమగ్ర శిక్షలో భాగంగా కేంద్ర ప్రభుత్వం సైన్స్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా 391 ఉన్నత పాఠశాలల్లో ల్యాబ్‌ల నిర్మాణానికి రూ.35.19 కోట్లతో నిర్మాణం జరగనుంది. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ సమగ్ర శిక్ష ప్రాజెక్టు అప్రూవల్ బోర్డు మే 21న జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకుంది. సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి ఒక్కో పాఠశాలకు రూ.9 లక్షల చొప్పున మంజూరు చేసింది. ఈ ల్యాబ్‌ల నిర్మాణంతో విద్యాప్రమాణాలు మెరుగవుతాయని పాఠశాల విద్యాశాఖ కమిషనర్, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ టి విజయ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు సైన్స్ ల్యాబ్‌ల ద్వారా ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్, పై చదువులకు వెళ్లే విద్యార్థులకు దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులు థియరీతోపాటు ప్రాక్టికల్‌గా సైన్స్ విషయాలను తెలుసుకునేందుకు అవకాశం దొరుకుతుందని సూచించారు. 30 జిల్లాల్లోని 391 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లను నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్‌ఈడబ్ల్యుఐడీసీ) డైరెక్టర్ సైన్స్ ల్యాబ్‌ల నిర్మాణ ప్రక్రియ చేపడతారని సూచించారు. ప్రతినెలా ఐదో తేదీన ల్యాబ్ నిర్మాణానికి సంబంధించిన ప్రగతిపై సమీక్ష ఉంటుందని తెలిపారు.

**జేపాల్ సంస్థతో విద్యాశాఖ ఒప్పందం**

ప్రొఫెసర్ కార్తీక్ మురళీధరన్ నేతృత్వంలోని జేపాల్ సంస్థతో పాఠశాల విద్యాశాఖ మంగళవారం ఒప్పందం కుదుర్చుకుంది. విద్యాశాఖ కార్యదర్శి బి జనార్దన్‌రెడ్డి జిల్లాస్థాయి అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ టి విజయ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు. మూడో తరగతిలోపు విద్యార్థులు పఠన, గణిత నైపుణ్యాలు సాధించేదిశగా ఒప్పందం కుదుర్చుకున్నామని విజయ్‌కుమార్ తెలిపారు. ఇది తప్పులు వెతకడానికి ఉద్దేశించింది కాదని, విద్యావిధానాన్ని సమూలంగా పరీక్షించి అభ్యసన ఫలితాల సాధనలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరిస్తుందని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో ఈ సంస్థకు సహకరించాలని కోరారు.

# సీఎస్‌నే కానీ.. అంతా సీఎంఓనే

- సీఎం తీరుపై సీఎస్ మనస్థాపం ?
- ఆయన లేకుండానే సమ్మెపై సమీక్షలు
- రిటైర్మెంట్ వారికే ప్రాధాన్యం

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

"రాష్ట్రానికి ఒక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శినే.. కానీ కీలక నిర్ణయాలన్నీ సీఎంఓ పరిధిలోనే జరుగుతున్నాయి. రిటైరైన అధికారుల సలహాలు, సూచనలే ప్రభుత్వానికి అవసరం. కనీసం సమీక్షా, సమావేశాలకు కూడా ఆహ్వానం ఉండదు. కొద్ది నెలలు ఇలాగే కాలం గడపాల్సిందే" అని సీఎం తీరుపై రాష్ట్ర ప్రభు త్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి తన సన్నిహితుల వద్ద ప్రస్తావించినట్టు తెలి సింది. ప్రభుత్వంలో ముఖ్యమంత్రి తర్వాత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిదే కీలక పాత్ర ఉంటుంది. కానీ సీఎం కేసీఆర్ గత కొద్ది నెలలుగా సీఎస్‌తో అంటిముట్టన్నట్టు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం తీసుకునే కీలక నిర్ణయాలపై కూడా మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌శర్మ, ఇతర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులతోనే సీఎం చర్చించి నిర్ణయం తీసుకుంటున్నారు. తాజాగా ఆర్టీసీ కార్మికుల సమ్మెపై కూడా రాజీవ్‌శర్మ, సునీల్‌శర్మ, అనురాగ్‌శర్మతోనే చర్చిస్తున్నారనీ, సీఎస్‌ను మాత్రం చర్చలకు ఆహ్వానించలేదు. గత 18 రోజులుగా ఆర్టీసీ సమ్మె జరుగుతున్నా సీఎం ఏఒక్క రోజుకూడా సీఎస్‌తో పెద్దగా చర్చించిన దాఖలాలు లేవని సీఎంఓ వర్గాలే చెబుతున్నాయి. సమ్మెపై కోర్టు వేస్తున్న మొట్టికాయలపై కూడా రాజీవ్‌శర్మ, అనురాగ్‌శర్మతోనే చర్చిస్తున్నారనీ, సీఎస్‌ను పట్టించుకోవడం లేదని కొందరు సీఎంఓ కార్యాలయంలోని అధికారులు తెలిపారు.

**అన్నీ తప్పుడు సలహాలే..**

సీఎం కేసీఆర్‌కు కొందరు అధికారులు తప్పుడు సలహాలు ఇస్తున్నారనీ, వాటినే నమ్ముకుని సీఎం మొండిగా వ్యవహరిస్తున్నారని కొందరు ఐఏఎస్ అధి కారులు వ్యాఖ్యానిస్తున్నారు.ఆర్టీసీ సమ్మెపై అసలే ఆగ్రహంగా ఉన్న కేసీఆర్‌కు.. అధికారులు తప్పుడు నివేదికలు ఇస్తున్నట్టు సమాచారం. దీంతోనే సీఎం కేసీఆర్ మరింత మొండిగా పోతున్నారనే చర్చలు చోటు చేసుకుంటున్నాయి. సీఎం కేసీఆర్ తీసుకునే నిర్ణ యాలు తప్పని తెలిసినా తమకెందుకులే అన్ని మిన్నకుంటున్నామని ఇతర సీనియర్ అధికారులు చెప్పారు.

సీఎం చుట్టూ ఉంటూ కొందరు భజనపరులు చేరి ఆయనకు తప్పుడు నివేదికలు అందజేస్తున్నారని వ్యాఖ్యానించారు. వారి వల్లనే తాము ఇబ్బందులు పడాల్సివస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి సంబంధించి ప్రభుత్వ పథకాల అమలు తీరు, ఇతర ముఖ్యమైన ఆదేశాలను ఎప్పటికప్పుడు జారీ చేసి అప్రమత్తం చేసేందుకు సీఎంఓలోని ఒక ఐఏఎస్ అధికారే కీలకపాత్ర పోషిస్తున్నట్టు తెలిసింది. జిల్లా కలెక్టర్లతో ఎప్పటికప్పుడు ఫోన్లు, వ్యాట్సప్‌ల ద్వారా సమాచాన్ని తీసుకుని సీఎంకు చేరవేస్తున్నట్టు సమాచారం. రాష్ట్రంలో ఆర్టీసీ సమ్మెపై కూడా ఎప్పటికప్పుడు సమాచారం తీసుకుని దిశా నిర్దేశం చేస్తున్నారు. ఆర్టీసీ సమ్మెపై జిల్లా అధికారులు తప్పుడు నివేదికలు ఇస్తున్నారనీ, ఈ కారణంతోనే ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ నాయకులతో సీఎం చర్చలు జరపడం లేదనే విమర్శలు సైతం వస్తున్నాయి. సీఎంతో తమకెందుకులే బాధ అన్న రీతిలో జిల్లా అధికారులు కూడా ఆర్టీసీ సమ్మె ప్రభావం పెద్దగా లేదంటూ పాజిటీవ్ రిపోర్ట్ ఇస్తున్నట్టు సమాచారం.

# సోషల్‌మీడియాపై ఆంక్షలు

- జనవరి 15 నాటికి కేంద్రం మార్గదర్శకాలు

**న్యూఢిల్లీ:** సోషల్ మీడియా వేదికగా విపరీతంగా వ్యాప్తి చెందుతున్న అసాంఘిక, అశ్లీలత, దేశద్రోహం, నకిలీ వార్తలను నియంత్రించడానికి కేంద్రం నూతన మార్గదర్శకాలను రూపొందించనున్నది. వచ్చే ఏడాది జనవరి 15 నాటికి మార్గదర్శకాల రూపకల్పన పూర్తవుతుందనీ, వెంటనే వాటిని అమలు పరుస్తామని మంగళవారం సుప్రీంకోర్టుకు కేంద్రం నివేదించింది. ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా ఉగ్రవాదాన్ని రేకెత్తించే, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే చర్యలు, విద్వేషపూరిత, నకిలీ వార్తల వ్యాప్తిని అరికట్టడాలని కేంద్రానికి సుప్రీంకోర్టు సూచించింది. ప్రస్తుతం ఈ కేసును జస్టిస్ దీపక్ గుప్తా, అనిరుద్ధ బోస్‌లతో కూడిన ధర్మాసనం విచారిస్తున్నది. సోషల్ మీడియాను నియంత్రించడానికి ఏ చర్యలు తీసుకున్నారో వివరించాలని ఈ ధర్మాసనం గత నెల 24న కేంద్రానికి నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నోటీసులపై కేంద్ర ఎలక్ట్రానిక్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ అదనపు కార్యదర్శి పంకజ్ కుమార్ ధర్మాసనానికి అఫిడవిట్ అందజేశారు. వచ్చే జనవరి 15 లోగా సవరించిన మార్గదర్శకాలను రూపొందించి, అమల్లోకి తీసుకవస్తామని తెలిపారు.

భారత సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ..ఫేస్‌బుక్, వాట్సాప్ తదితర సోషల్ మీడియా వేదికల ద్వారా ఇష్టానుసారంగా విద్వేషపూరిత, మత విద్వేషాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు వ్యాప్తిచెందుతున్నాయని తెలిపారు. వ్యక్తిగత గోప్యత, దేశ సార్వభౌమత్వానికి భంగం వాటిల్లే ప్రమాదముందని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని వీడియో క్లిప్పింగులను ఇష్టానుసారంగా పోస్ట్ చేయడం వల్ల సామాజిక పరమైన సమస్యలు తలెత్తున్నాయని తెలిపారు. ఇలాంటి చర్యలే ప్రజాస్వామ్య మనుగడ ను ప్రమాదంలోకి నెట్టి వేస్తాయని హెచ్చరించారు.

అలాగే ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సోషల్ మీడియా అకౌంట్లకు ఆధార్ లింక్ చేయాలని వివిధ హైకోర్టులలో దాఖలైన పిటిషన్‌లను విచారణకు వీలుగా తర్వలోనే సుప్రీంకోర్టుకు బదిలీ చేయనున్నారు.

## సైట్ డైరెక్టర్‌గా కృష్ణారావు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

విద్యాశాఖ సంచాలకులుగా ఉన్న ఎ కృష్ణారావును స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్, టెక్నాలజీ (సైట్) డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి బి జనార్ధన్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సైట్ డైరెక్టర్‌గా పనిచేసిన సిహెచ్ రమణకుమార్‌ను పాఠశాల విద్యాశాఖ అదనపు సంచాలకులుగా బదిలీ చేశామని తెలిపారు.

## విద్యుత్ ఆర్టిజన్స్‌కు సవరించిన వేతనాలు

- ఉత్తర్వులు ఇచ్చిన సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకరరావు
- ఫలించిన 'టీటఫ్' పోరాటం

**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

తెలంగాణ ఎలక్ట్రిసిటీ ట్రేడ్ యూనియన్స్ ఫ్రంట్(టీటఫ్) పోరాటం ఫలించింది. విద్యుత్‌సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులకు వేతనాలు సవరించి, పే స్కేల్స్ ఫిక్స్ చేస్తూ టీఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకరరావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న వేతనాలకు 25శాతం అదనంగా ఫిట్‌మెంట్ ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఆర్టిజన్ కార్మికులకు 'ఆర్టిజన్ సర్వీస్ రూల్స్ అండ్ రెగ్యులేషన్స్' వర్తిస్తాయని, కార్మికశాఖ ఇకపై అదే విధంగా గుర్తించాలని తెలిపారు. డీఏ, హెచ్‌ఆర్ఏ, సీపీఏ, మెడికల్ అలవెన్స్, కార్పొరేట్ అలవెన్స్, కన్వేయన్స్ అలవెన్స్‌లన్నీ వర్తిస్తాయని వివరించారు. ఇటీవల విద్యుత్‌శాఖలోని 21 కార్మికసంఘాలతో కూడిన తెలంగాణ ఎలక్ట్రిసిటీ ట్రేడ్ యూనియన్స్ ఫ్రంట్(టీటఫ్) సమ్మెలోకి వెళ్తామని యాజమాన్యాన్ని హెచ్చరించిన విషయం తెలిసిందే. ఆర్టిజన్ కార్మికులకు ఏపీఎస్ఈబీ రూల్స్‌ను వర్తింపచేయాలని కూడా డిమాండ్ చేశారు. వివిధ రూపాల్లో అందోళనల అనంతరం యాజమాన్యంతో పలుదఫాలుగా జరిగిన చర్చలు విజయవంతమయ్యాయి. కార్మికుల డిమాండ్లను ఆమోదిస్తూ మంగళవారం సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకరరావు ప్రకటన చేశారు. ఆ మేరకు సవరించిన పేస్కేల్స్ ఉత్తర్వులు జారీ చేశారు. అక్టోబర్ 1వ తేదీ నుంచి సవరించిన వేతనాలు ఇస్తున్నట్టు చెప్పారు. సవరించిన వేతనాల ప్రకారం...ఆర్టిజన్ గ్రేడ్-1 కార్మికులకు మొత్తం వేతనం రూ.29,743, గ్రేడ్-2 కార్మికులకు రూ.25,042, గ్రేడ్-3 కార్మికులకు రూ.21,719, గ్రేడ్-4 కార్మికులకు రూ.19,548 గా నిర్ణయించారు.

## అద్దెబస్సులపై మధ్యంతర ఉత్తర్వులకు హైకోర్టు నిరాకరణ

- డివిజన్ బెంచ్‌కు బదిలీ

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

ఆర్టీసీ భారీ సంఖ్యలో అద్దె బస్సులు తీసుకునేందుకు ఆహ్వానించిన టెండర్ ఖరారు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. ఆర్టీసీ సమ్మెపై ప్రధాన న్యాయమూర్తి వద్ద ప్రజాహిత వ్యాజ్యాలు విచారణకు ఉన్నందున ఈ రిట్‌ను కూడా ఆయన నేతత్వంలోని డివిజన్ బెంచ్‌కు నివేదించాలని సింగిల్ జడ్జి హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించారు. పిల్స్‌పై 28న విచారణ జరగనుంది. వీటితోపాటే రిట్‌ను కూడా డివిజన్ బెంచ్ విచారించే అవకాశం ఉంటుంది. వివరాల్లోకి వెళితే.. టీఎస్ ఆర్టీసీ కార్మిక్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రమేష్‌కుమార్ దాఖలు చేసిన రిట్‌ను మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి విచారించారు. తొలుత పిటిషనర్ తరపు సీనియర్ లాయర్ టి.సూర్య కిరణ్‌రెడ్డి వాదిస్తూ.. ఒక పక్క ఆర్టీసీ ఉద్యోగులు సమ్మెలో ఉండగా భారీ స్థాయిలో 1035 ప్రయివేటు బస్సుల్ని అద్దెకు తీసుకునేందుకు ఆర్టీసీ యాజమాన్యం నోటిఫికేషన్ ఇవ్వడం చెల్లదన్నారు. సమ్మె పరిష్కారమైతే అన్ని ప్రైవేటు బస్సుల్ని ఏం చేస్తారో తెలియదని, ఆర్టీసీని నిర్వీర్యం చేసే క్రమంలోనే అంత భారీ సంఖ్యలో ప్రయివేటు బస్సుల్ని ఏడాదిపాటు అద్దెకు తీసుకునేందుకు టెండర్ ఆహ్వానించిందన్నారు. ఆర్టీసీకి మేనేజింగ్ కమిటీ (బోర్డు) లేదని, శాశ్వత ప్రాతిపదికపై ఆర్టీసీకి ఎండీ కూడా లేరని, చాలాకాలంగా ఇన్‌చార్జి ఎండీనే ఉన్నారని చెప్పారు. సమ్మె నేపథ్యంలో తాత్కాలిక ప్రాతిపదికపై బస్సుల్ని తీసుకుంటే అభ్యంతరం లేదని, ఏడాది కాలానికి టెండర్ ఆహ్వానించడంపైనే అభ్యంతరమని తెలిపారు. గతంలో తొలగింపునకు గురైన వారిని అనర్హులుగా ప్రకటించడం చెల్లదన్నారు. ఒకసారి అనర్హుడైన వ్యక్తి మరో ఉద్యోగం చేయకూడదని లేదన్నారు. తక్షణమే హైకోర్టు జోక్యం చేసుకుని టెండర్ ఖరారు కాకుండా స్టే ఉత్తర్వులు జారీ చేయాలని సూర్యకిరణ్‌రెడ్డి కోరారు. అనంతరం ప్రభుత్వం తరపున అదనపు ఏజీ జె.రామచందర్‌రావు వాదిస్తూ.. అసలు ఈ పిటిషనే చెల్లదని, దీనిని ప్రాథమిక దశలోనే కొట్టేయాలని కోరారు. టెండర్ ఆహ్వానించాలన్న నిర్ణయం ఆర్టీసీ బోర్డుది కాదని, ఆర్టీసీ యాక్ట్‌లోని సెక్షన్ 34 ప్రకారం ప్రభుత్వానికి ఉన్న అధికారాలతో అద్దె బస్సులకు టెండర్లను ఆహ్వానించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. పిటిషనర్ ఏమీ టెండర్‌లో పాల్గొనలేదని, కనీసం దరఖాస్తు కూడా చేసుకోలేదని, ఎందుకు రిట్ వేశారో అర్థం కావడం లేదన్నారు. ఆర్టీసీ సమ్మె చట్ట విరుద్ధమని, ప్రయాణీకుల కోసమే బస్సుల్ని వీలైనన్ని ఎక్కువ నడిపేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికపై చర్యలు తీసుకుంటోందని వివరించారు. బస్సుల సంఖ్య పెంచాలని, ప్రయాణీకులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని సాక్షాత్తు ప్రధాన న్యాయమూర్తి ఆదేశాలిచ్చారని, ఈ నేపథ్యంలో రిట్‌ను కొట్టేయాలని కోరారు. బస్సుల్ని నడుపుతుంటే అడ్డుకుంటున్నారని, అద్దె బస్సుల్ని తీసుకుంటుంటే కేసులు వేస్తున్నారని, ప్రయాణీకులకు సౌకర్యాలు లేకపోతే మళ్లీ వాళ్లే కల్పించుకుని ప్రయాణీకుల ఇక్కట్లు ప్రభుత్వానికి పట్టడం లేదని ద్వంద్వ విధానాల్ని అవలంభిస్తున్నారని ఆరోపించారు. టెండర్లను నిన్ననే తెరవడం జరిగిందని, ఇప్పుడు హైకోర్టుకు వచ్చి కేసు వేసి ఉపయోగం లేదన్నారు. ఆర్టీసీకి సొంతంగా 10,460 బస్సులుంటే వాటిని నడపలేని పరిస్థితులు ఉన్నాయని, ఇప్పుడు ప్రయివేటు బస్సుల్ని తీసుకుంటేనే ప్రయాణీకులకు సమస్యలు లేకుండా రవాణా వ్యవస్థ ఉంటుందని అదనపు ఏజీ చెప్పారు. ఈ కేసును ప్రధాన న్యాయమూర్తి నేతత్వంలోని డివిజన్ బెంచ్‌కు నివేదించాలని న్యాయమూర్తి హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశాలు జారీ చేశారు. వెంటనే పిటిషనర్ తరపు సీనియర్ లాయర్ కల్పించుకుని, దీర్ఘకాలిక ప్రాతిపదికపై టెండర్ కాకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని, తాత్కాలిక ప్రాతిపదికపై అభ్యంతరం లేదని, ఈ మేరకు మధ్యంతర స్టే ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ విషయాన్ని కూడా డివిజన్ బెంచ్ ఎదుట తేల్చుకోవాలని న్యాయమూర్తి చెప్పారు.

## తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్

- అసోసియేట్ ప్రెసిడెంట్‌గా భరత్ సత్యనారాయణ

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్‌గా భరత్ సత్యనారాయణను నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్ సంపత్‌కుమారస్వామి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మెడికల్ అండ్ హెల్త్ శాఖలో హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్‌గా సంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్నారని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని సత్యనారాయణ ప్రకటించారు.

## అయోడిన్ హీనతను అవగాహనతో అధిగమించొచ్చు

- మీడియాతో ఎన్సీడీసీ అడ్వైజర్ రమేష్ వెల్లడి

**నవ తెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో**



అయోడిన్ హీనతను అవగాహనతోనే అధిగమించొచ్చని నేషనల్ సెంటర్ ఫర్ డిసీస్ కంట్రోల్ సలహాదారులు రమేష్ తెలిపారు. అయోడిన్ లోపం ఎన్నో రుగ్మతలకు కారణమవుతుందని వెల్లడించారు. మంగళవారం ఢిల్లీలో ప్రపంచ అయోడిన్ హీనత నివారణ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఎన్సీడీసీ సలహాదారులు రమేష్ మీడియాతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అంశాన్ని సామాజిక ఉద్యమం మాదిరి ప్రజా ల్లోకి తీసుకెళ్ళాలని అన్నారు. మానవ శరీర నిర్మాణం నిర్వహణకు అయోడిన్ కీలక పాత్ర పోషిస్తున్నదని చెప్పారు. సాధారణంగా అయోడైజ్‌డ్ ఉప్పు, సముద్ర చేపలు తినడం ద్వారా ఈ లోపాన్ని అధిగమించవచ్చని చెప్పారు. ఈ సమావేశంలో డాక్టర్లు తరుణ్ సేక్రీ, ప్రదీప్ సక్సేనా పాల్గొన్నారు.

## విమానంలో మహిళకు గుండెపోటు.. మృతి

- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానం అత్యవసర ల్యాండింగ్

**నవతెలంగాణ - శంషాబాద్**

విమానంలో ప్రయాణిస్తున్న ఉక్రెయిన్ దేశానికి చెందిన మహిళకు గుండెపోటు వచ్చింది. దీంతో మెడికల్ ఎమర్జెన్సీలో భాగంగా శంషాబాద్‌లోని ఆర్జీఐ ఎయిర్‌పోర్టులో మంగళవారం అత్యవసరంగా విమానాన్ని ల్యాండ్ చేశారు. కానీ, ఆమెను ఆస్పత్రికి తరలించేలోపే మృతిచెందింది. ఇందుకు సంబంధించి ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఉక్రెయిన్ దేశానికి చెందిన కొంకిన గాల్యిన(65) అనారోగ్యంతో బాధపడుతుండేది. ఆమె దోహా నుంచి బ్యాంకాక్‌కు క్యూఆర్ 830 విమానం ఎక్కింది. విమానంలో ఆమెకు గుండెపోటు రావడంతో అధికారులు విమానాన్ని శంషాబాద్‌లో ఎయిర్‌పోర్టులో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. ఆమెను ఆస్పత్రికి తరలించలోపే పరిస్థితి విషమించి మృతిచెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

# నవచిత్రం


అల్లు అర్జున్

## రాములో.. రాములా..

ఇటీవల 'సామజవరగమన..' పాటతో శ్రోతలను విశేషంగా ఆకట్టుకున్న అల్లు అర్జున్, ఇప్పుడు 'రాములో.. రాములా..' అంటూ ప్రేక్షకులతో స్టెప్పులేయిస్తున్నారు. త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'అల.. వైకుంఠపురములో'. బన్నీ సరసన పూజా హెగ్డే కథానాయికగా నటిస్తుంది. గీతా ఆర్ట్స్, హారికా అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకాలపై అల్లు అరవింద్, ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. థమన్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'సామజవరగమన' పాట ఇటీవల విడుదలై మంచి ఆదరణ పొందింది. యూట్యూబ్‌లో ట్రెండ్ అయ్యింది. తాజాగా కాసర్ల శ్యామ్ రాసిన 'రాములో.. రాములా..నన్ను ఆగం చేసిందిరో.. రాములో రాములా నా ప్రాణం తీసిందిరో' అంటూ సాగే పాట టీజర్‌ని మంగళవారం విడుదల చేశారు. ఈ నెల 26న పూర్తి పాటని విడుదల చేయబోతున్నారు. ఓ పార్టీలో బన్నీ, పూజా హెగ్డే, సుశాంత్, మురళీ శర్మతోపాటు డాన్స్ టీమ్ వేసే స్టెప్పులు ఆకట్టుకుంటున్నాయి. కుటుంబ నేపథ్య కథాంశంతో యాక్షన్ ప్రధానంగా సాగే ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదల కానుంది. టబు, సుశాంత్, నివేదా పేతురాజ్, నవదీప్ ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## శతదినోత్సవం జరుపుకోవాలి


అలీ, రఘుబాబు, శ్రీనివాసరెడ్డి, వై.వి.సుబ్బారెడ్డి, శ్రీనివాస్ కానూరు, రఘు కుంచె

సత్యదేజ్, ఇషారెబ్బా జంటగా శ్రీనివాస్‌రెడ్డి దర్శకత్వంలో 'రాగల 24 గంటల్లో' చిత్రం రూపొందింది. శ్రీ నవహాస్ క్రియేషన్స్, శ్రీ కార్తికేయ సెల్యూలాయిడ్స్ పతాకాలపై శ్రీనివాస్ కానూరు ఈ చిత్రాన్ని నిర్మించారు. విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రంలోని 'నారాయణతే నమో నమో' లిరికల్ వీడియో సాంగ్‌ని అతిథిగా విచ్చేసిన టీటీడీ బోర్డ్ చైర్మెన్ వై.వి.సుబ్బారెడ్డి సోమవారం విడుదల చేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'శ్రీనివాసరెడ్డి ఇరవై ఏండ్ల నుంచి స్నేహితుడు. వెంకటేశ్వర స్వామి కీర్తనతో ఉన్న పాటని నాతో ఎందుకు రిలీజ్ చేయించారో పాట చూశాక అర్థమయ్యింది. విజువల్‌గా పాటని చాలా చక్కగా చిత్రీకరించారు. మంచి హిట్ అవుతుంది. దానికి మించి రెండింతలు సినిమా కూడా పెద్ద హిట్ కావాలి. వంద రోజులు ఆడాలి. అలీ, రఘుబాబు, పృథ్వీ వంటి వారందరి సూచనలతో ఆంధ్రప్రదేశ్‌లో సినిమా ఇండస్ట్రీని అభివృద్ధి చేయడానికి అన్ని విధాలుగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సుముఖంగా ఉన్నారు' అని అన్నారు.
'నాకు పితృ సమానులైనా సుబ్బారెడ్డిగారు మా చిత్రంలోని పాటను విడుదల చేయడం చాలా హ్యాపీగా ఉంది. ఎప్పటికీ ఆయన ఆశీస్సులు దీవెనలు మాకు ఉంటాయని ఆశిస్తున్నా. ఎస్వీబీసీ బోర్డ్ డైరెక్టర్‌గా నాకు పదవీ బాధ్యతలు అప్పగించారు. వారు నా మీద పెట్టిన నమ్మకానికి నిజాయితీగా పనిచేసి మంచి పేరు వచ్చేలా చేస్తానని హామీ ఇస్తున్నా' అని చిత్ర దర్శకుడు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.
మాటల రచయిత, నటుడు కృష్ణభగవాన్ చెబుతూ, 'ఈ సినిమాకి అన్నీ కలిసొస్తున్నాయి అవుట్‌పుట్ బాగా వచ్చింది. మేము ఊహించిన దానికంటే పెద్ద విజయం సాధిస్తుందని నమ్ముతున్నాం. డైరెక్టర్ శ్రీనివాసరెడ్డికి పెద్ద బ్రేక్ ఇచ్చే సినిమా' అని తెలిపారు.' రామానాయుడు, దిల్ రాజు స్ఫూర్తితో నిర్మాతగా మారాను. శ్రీనివాసరెడ్డి లాంటి మంచి మిత్రుడుతో ఈ సినిమా నిర్మించడం చాలా హ్యాపీగా ఉంది. త్వరలో సినిమాని విడుదల చేస్తాం' అని నిర్మాత శ్రీనివాస్ కానూరు తెలిపారు.


ప్రభాస్

## అప్పుడు రెబల్ స్టార్ ఇప్పుడు గ్లోబల్ స్టార్

ఇటీవల కాలంలో తెలుగు సినిమా ప్రపంచ వ్యాప్తంగా సత్తా చాటడంలో కీలక భూమిక పోషించిన కథానాయకుడు ప్రభాస్. అభిమానులు యంగ్ రెబల్ స్టార్‌గా ముద్దుగా పిలుచుకునే ప్రభాస్ 'ఈశ్వర్' చిత్రంతో సినీ తెరంగేట్రం చేసి 'వర్షం', 'ఛత్రపతి', 'బిల్లా', 'మిస్టర్ పర్‌ఫెక్ట్', 'డార్లింగ్', 'మిర్చి', 'బాహుబలి' వంటి తదితర చిత్రాలతో గ్లోబల్ స్టార్‌గా పాపులర్ అయ్యారు. అన్నింటికి మించి అటు ప్రేక్షకులకు, ఇటు అభిమానులకు డార్లింగ్ అయ్యారని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. లేటెస్ట్‌గా రిలీజైన స్టయిలీష్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'సాహో'తో క్రేజ్ పరంగా, కలెక్షన్ల పరంగా మరోసారి సత్తా చాటిన ప్రభాస్ పుట్టిన రోజు నేడు (బుధవారం).
పెదనాన్న కృష్ణంరాజు గోపీకృష్ణ బ్యానర్‌లో ప్రభాస్ ఓ సినిమా చేస్తున్న విషయం విదితమే. 'జిల్' ఫేమ్ రాధాకృష్ణ దర్శకత్వంలో కృష్ణంరాజు సమర్పణలో గోపీకృష్ణ మూవీస్, యూవీ క్రియేషన్స్ పతాకాలపై రూపొందుతున్న చిత్రంలో పూజా హెగ్డే కథానాయికగా నటిస్తుంది. ప్రభాస్ బర్త్‌డేని పురస్కరించుకుని ఈ చిత్ర విశేషాలను చిత్ర బృందం తెలియజేసింది.
"బాహుబలి', 'సాహో' తర్వాత ప్రభాస్ అంతర్జాతీయ ఖ్యాతి పొందాడు. ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు రావడంతో ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. 'బిల్లా' తర్వాత ప్రభాస్ హీరోగా గోపీకృష్ణ మూవీస్ బ్యానర్‌లో తెరకెక్కుతున్న సినిమా కావడంతో దీనిపై అంచనాలు భారీగా ఉన్నాయి. ప్రభాస్ క్రేజ్, ఇంటర్నేషనల్ మార్కెట్‌ని దృష్టిలో పెట్టుకుని భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్‌తో గ్రాండియర్‌గా నిర్మిస్తున్నారు. టెక్నీకల్‌గా హైస్టాండర్డ్స్‌తో ఉంటుంది. బాలీవుడ్ స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ అమిత్ త్రివేది సంగీతం అందిస్తున్నారు. స్టయిలీష్ సినిమాటోగ్రాఫర్ మనోజ్ పరమహంస, ప్రొడక్షన్ డిజైనింగ్‌లో నూతన ఒరబడి సృష్టించిన రవీందర్, తనదైన షార్ప్ ఎడిటింగ్‌తో ఎన్నో అద్భుతమైన హిట్స్‌లో భాగమైన శ్రీకర్ ప్రసాద్ వంటి తదితర సీనియర్ టెక్నీషియన్స్ ఈ చిత్రానికి వర్క్ చేస్తుండడం విశేషం. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో నిర్మించబోయే ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పించే విధంగా ఉంటుంది. హైదరాబాద్‌లో మరో భారీ షెడ్యూల్ ప్లాన్ చేశారు. దీనికోసం భారీ సెట్ వేస్తున్నారు. ఈ సెట్లో జరిగే షెడ్యూల్‌లో ప్రభాస్‌తోపాటు ముఖ్య తారాగణం పాల్గొంటారు. మరోవైపు ఇటీవలే లండన్ ఆల్బర్ట్ హాల్‌లో 'బాహుబలి: ది బిగినింగ్' చిత్రాన్ని హిందీలో ప్రదర్శించిన విషయం తెలిసిందే. 148 ఏళ్ల ఆల్బర్ట్ హాల్ చరిత్రలో ఇంగ్లీష్ భాషలో కాకుండా ఇతర భాషలో ఓ సినిమా ప్రదర్శితం కావడం ఇదే తొలిసారి. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో పాల్గొన్న ప్రభాస్‌కి అక్కడి ఆయన అభిమానులు ఘనస్వాగతం పలకడం విశేషం' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

## ఇలాంటి అవకాశం ఒక్కసారే వస్తుంది


కార్తీ

'నాకు ప్రేక్షకులందరూ ఒక్కటే. కథ వినేటప్పుడు ఇది తమిళ ప్రేక్షకులకు నచ్చుతుందా లేక తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుందా అనేది చూడను. కేవలం కథలోని కంటెంట్, ఎమోషన్స్‌కి మాత్రమే ప్రయారిటీ ఇస్తాను' అని అంటున్నారు హీరో కార్తీ. లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో ఆయన హీరోగా రూపొందిన చిత్రం 'ఖైదీ'. శ్రీసత్యసాయి ఆర్ట్స్ అధినేత కె.కె.రాధామోహన్ దీపావళి కానుకగా ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈనెల 25న రిలీజ్ అవుతున్న సందర్భంగా హీరో కార్తీ మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

### నాలుగు గంటల్లో జరిగే కథ

లోకేష్ కనకరాజ్‌కి షార్ట్ ఫిలిమ్స్ చేసిన అనుభవం ఉంది. అలాగే ఫస్ట్ మూవీ 'నగరం'తోనే చాలా పెద్ద హిట్ అందుకున్నారు. ఈ కథ చెప్పేటప్పుడే ఇదొక కొత్త ఐడియా, డెఫినెట్‌గా మీకు నచ్చుతుందని చెప్పారు. సినిమా మొత్తం మాస్ ఉంటుంది. యాక్షన్ కూడా ఎక్కువే. ఒక రాత్రిలో జరిగే నాలుగు గంటల సినిమా. ఆ నాలుగు గంటల్లోనే సస్పెన్స్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉంటాయి. దీన్ని ఒక భారీ బడ్జెట్ సినిమాగా తీస్తే తప్పకుండా సక్సెస్ అవుతుందనిపించి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాను.

### నచ్చిన పాయింట్ అదే

ఈ సినిమాలో నాకు బాగా నచ్చిన పాయింట్ నా క్యారెక్టరైజేషన్. పది సంవత్సరాల జైలు జీవితం ముగించుకుని బైటికి వచ్చే ఒక ఖైదీ పాత్ర. తనకి తన కూతురు ఎలా ఉంటుందో కూడా తెలీదు. జైలు నుంచి విడుదలైన తర్వాత ఎదురైన అవాంతరాలు ఏమిటి?, ఆ అవాంతరాలని దాటుకొని తన కూతురిని చూడగలిగాడా, లేదా అనేది కథ. పది సంవత్సరాలు కూతురిని చూడలేదు అంటే నటించడానికి నాకు మంచి స్కోప్ ఉంటుందని పించింది. అలాగే నాకూ కూతురు ఉండడం వల్ల నాన్నగా నటించడం చాలా ఈజీ అయింది. గతంలో 'విక్రమార్కుడు' చిత్రాన్ని తమిళంలో రీమేక్ చేసేటప్పుడు నాకొక కూతురు ఉంటే ఇలా ఉంటుందని ఊహించుకుని నటించాను. అయితే ఇప్పుడు అలాంటి సమస్య లేదు (నవ్వుతూ).

### కథే డిమాండ్ చేసింది

కథ డిమాండ్ మేరకే 'ఖైదీ' టైటిల్ పెట్టాల్సి వచ్చింది. చిరంజీవిగారు 'ఖైదీ' టైటిల్స్‌తో నటించిన చిత్రాలన్ని ఘన విజయం సాధించాయి. వాటి ప్రభావం ముఖ్యంగా 'ఖైదీ' సినిమా తాలూకా ఎఫెక్ట్ మా సినిమాపై పాజిటివ్‌నెస్‌ని పెంచింది. అందరూ దీన్ని ఓ ప్రత్యేకంగా చూస్తున్నారు. ఈ సినిమాలోని డైలాగ్స్ అందరినీ థ్రిల్ చేస్తాయి. ట్రైలర్‌లో చూపించింది చాలా తక్కువ. ప్రతి సీన్ ఫ్రెష్‌గా ఉంటుంది. న్యూ ఏజ్ యాక్షన్ ఫిల్మ్‌లా ఉంటుంది. అయితే నా క్యారెక్టర్ మాత్రం మాస్‌గా ఉండటమే దీని ప్రత్యేకత. ఇదొక యూనిక్ కాంబినేషన్. అతను ఎవరు?, అతని గతం ఏంటి అనేది ఇందులో చాలా ఆసక్తికరంగా ఉంటుంది.

### ఇదొక కొత్త ఆలోచన

ఇలాంటి మాస్ యాక్షన్ మూవీ చేస్తున్నపుడు మ్యూజిక్ అనేది చాలా ఇంపార్టెంట్. అందులోను ఒక ఇంగ్లీష్ సాంగ్ పెట్టడమనేది న్యూ థాట్. హాలీవుడ్ మూవీని తలపించేలా శ్యామ్ సి.ఎస్. మ్యూజిక్ ఇచ్చారు. మాములుగా ఇలాంటి సినిమా రెండు గంటలే ఉంటుంది. కానీ కాన్ఫిడెంట్‌గా రెండు గంటల 20 నిమిషాలు పెడుతున్నామంటే అందర్నీ థ్రిల్ చేసే కంటెంట్ ఇందులో ఉందని వేరే చెప్పక్కర్లేదు.

### ఆ తర్వాతే ధైర్యం వచ్చింది

'ఖాకి' సినిమా విజయం ఇలాంటి సినిమాలు చేయడానికి ధైర్యం ఇచ్చింది అలాగే తెలుగులో కూడా కొత్త కొత్త కథలతో థ్రిల్లర్ సినిమాలు వస్తున్నాయి. అందులోను డిజిటల్ మీడియా ప్రతి ఒక్కరికీ చాలా దగ్గరైంది. 'ఖైదీ' లాంటి సినిమా చేసే అవకాశం ఒక్కసారే వస్తుంది. నేను అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసేటప్పుడు కూడా ఇలాంటి సినిమాలు చేయాలనుకున్నాను. సాంగ్స్, రొమాన్స్ లేకుండా కేవలం యాక్షన్ అండ్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉండే డిఫరెంట్ మూవీ ఇది. ఈ సినిమాలో నేను ఖైదీగా నటించాలి. అందుకే రియల్ ఖైదీలను కలిశాం. డైరెక్టర్ వారిని కలిసినప్పుడు చాలా కొత్త కొత్త విషయాలు చెప్పారు. చాలా కాలం జైల్లో ఉన్న ఖైదీలు బయటకు వచ్చి కలర్‌ఫుల్ డ్రస్సులను చూస్తే చాలా హ్యాపీగా ఉంటుందని తెలిసింది.

### స్ట్రాంగ్ ఎమోషన్ ఉంటే చాలు

కథ ఎంపికని కేవలం తెలుగు ప్రేక్షకుల్ని మాత్రమే దృష్టిలో పెట్టుకుని అంగీకరించను. అలాగని తమిళ ప్రేక్షకుల్ని కూడా దృష్టిలో పెట్టుకోను. ఎందుకంటే ప్రేక్షకులు ఎక్కడైనా ప్రేక్షకులే. కథలో ఎమోషన్స్ స్ట్రాంగ్‌గా ఉండేలా చూసుకుంటా. ఎందుకంటే అందర్నీ కనెక్ట్ చేసేవి ఎమోషనల్ ఎలిమెంట్సే. ప్రస్తుతం జీతూ జోసెఫ్‌తో ఒక ఫ్యామిలీ థ్రిల్లర్ చేస్తున్నాను. దానిలో మా వదిన జ్యోతిక నటిస్తున్నారు. చాలా మంచి కథ. అందరినీ కచ్చితంగా మెప్పించే కథ. ఇకపై కూడా వినూత్న కథలతో ప్రేక్షకుల్ని మెప్పించేందుకు ప్రయత్నిస్తాను.

## హల్ చల్ చేస్తారట

రుద్రాక్ష్, ధన్య బాలకష్ణ జంటగా శ్రీ రాఘవేంద్ర ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్ పై తెరకెక్కుతున్న చిత్రం 'హల్ చల్'. శ్రీపతి కర్రి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఇటీవల సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. నవంబర్‌లో సినిమాను విడుదల చేయడానికి నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. 'సెన్సార్ సభ్యుల నుంచి క్లీన్ యు సర్టిఫికెట్ అందుకుంది. రాజ్ తోట సినిమాటోగ్రఫీ, భరత్ మధుసూదనన్ సంగీతంతోపాటు నటీనటుల నటన చిత్రానికి హైలైట్‌గా నిలుస్తుంది. హల్‌చల్ చేసేలా ఈ చిత్ర కథ ఉంటుంది. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించే చిత్రమిది' అని చిత్ర బృందం తెలిపింది.


రుద్రాక్ష్, ధన్య బాలకృష్ణ


ఓంకార్, అశ్విన్, ఛోటా.కె.నాయుడు, అలీ, అవికా గోర్

## రెస్పాన్స్ అదుర్స్

'రాజుగారి గది 3' విడుదలై విశేష ప్రేక్షకాదరణ పొందిన సందర్భంగా చిత్ర యూనిట్ సోమవారం విలేకరులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఓంకార్ మాట్లాడుతూ,' నా తమ్ముడు అశ్విన్‌ను యాక్సెప్ట్ చేసిన ఆడియన్స్‌కి ధన్యవాదాలు. ప్రేక్షకుల సపోర్ట్ ఉంటే ఎవ్వరైనా ఎక్కడికైనా వెళ్తారు. వైజాగ్ మెలోడీ థియేటర్‌లో పెద్ద హీరో షోస్‌కు మాత్రమే ఫుల్స్ అవుతుంటాయి. కానీ మా చిత్రానికి ఫుల్స్ అవ్వడం ఆనందంగా ఉంది. రానున్న రోజుల్లో పిల్లలు, ఫ్యామిలీ ఆడియన్స్ ఇంకా బాగా ఆదరిస్తారని భావిస్తున్నాను' అని అన్నారు. "రాజుగారి గది 3' ను బాగా రిసీవ్ చేసుకున్న ఆడియన్స్‌కు థాంక్స్. ఈ సినిమాకి అందరూ కష్టపడి పని చెయ్యడంతోనే ఈ సినిమా విజయం సాధించింది. సినిమాని ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు. వారి సపోర్ట్ ఉంటే ఈ చిత్రం మరింత విజయం సాధిస్తుంది' అని అలీ చెప్పారు.
ఛోటా.కె.నాయుడు మాట్లాడుతూ,'ఈ సినిమాను వినోదం కోసం తీశాం. ఇందులో అది పుష్కలంగా ఉంది. ఇప్పటికే ఇది 4 కోట్ల గ్రాస్ చేసింది. అశ్విన్ ప్రాణం పెట్టి చేశాడు. మంచి సినిమాను అందరూ ఆదరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది' అని చెప్పారు. 'సినిమా చెయ్యాలనే ఆసక్తే నన్ను ఇండస్ట్రీలోకి వచ్చేలా చేసింది. ఈ సినిమాతో నాకొక మార్కెట్ ఓపెన్ అయ్యిందని చెబుతున్నందుకు సంతోషం. సినిమా చూసిన ప్రతి ఒక్కరూ బాగుందని చెబుతున్నారు. బుక్ మై షో రేటింగ్స్‌కి చూసి బాధ పడ్డాను. అందరి రేటింగ్స్‌ను పరిగణలోకి తీసుకుని వాళ్ళు రేటింగ్స్ ఇస్తే బాగుండేది. వాళ్ళు కేవలం నెగిటివ్ రేటింగ్స్ తీసుకుని పెడుతున్నారు. థియేటర్స్ విజిట్ చేసినప్పుడు రెస్పాన్స్ అద్భుతంగా ఉంది' అని కథానాయకుడు అశ్విన్ అన్నారు. హీరోయిన్ అవికా గోర్ మాట్లాడుతూ,'థియేటర్‌లో ఆడియన్స్ రెస్పాన్స్ సూపర్బ్‌గా ఉంది. నన్ను తెలుగులో ఇంత బాగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ఇందులో నేను పోషించిన పాత్రకు మంచి గుర్తింపు లభించింది' అని చెప్పారు.


పూజా హెగ్డే

## కేవలం నాన్న కోసమే..

'చిత్ర పరిశ్రమలో గాడ్ ఫాదర్‌గానీ, ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ గానీ లేకపోతే కథానాయికగా మనకి మొదటి సినిమా చాలా ముఖ్యం. అదే మన కెరీర్‌ని నిర్ణయిస్తుంది' అని అంటోంది పూజా హెగ్డే. అతి తక్కువ కాలంలోనే స్టార్ స్టేటస్ పొందిన పూజా 'మొహెంజోదారో' సినిమాతో బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. ఆమె నటించిన రెండో బాలీవుడ్ చిత్రం 'హౌస్‌ఫుల్ 4' దీపావళి కానుకగా విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పూజా మాట్లాడుతూ, "మొహెంజోదారో' తర్వాత హిందీలో నాకు ఆఫర్స్ చాలా వచ్చాయి. కానీ నేను అంగీకరించలేదు. సౌత్‌లో నా కెరీర్ చాలా బాగా ఉంది. దీంతో బాలీవుడ్‌లో నాకు నచ్చిన సినిమాల్ని మాత్రమే చేయాలని డిసైడ్ అయ్యాను. మనం ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా వస్తే తొలి చిత్రం మన కెరీర్‌కి చాలా ముఖ్యం. అంతేకాదు, తొలి ఆడిషన్ కూడా అంతే ఇంపార్టెంట్. చాలా జాగ్రత్తగా ఉండాలి. మొదటి సినిమా సరిగా ఆడకపోతే రెండో చిత్రం మరింత కీలక పాత్ర పోషిస్తుంది. అలా భిన్న కారణాలతో హిందీలో రెండో సినిమాగా 'హౌస్‌ఫుల్ 4' చేశాను. అయితే ఆ కారణాలలో ఒకటి మా నాన్న. ఆయన లాయర్. వినోదభరిత చిత్రాలను బాగా ఇష్టపడతారు. ఈ చిత్రంలో అది పుష్కలంగా ఉంటుంది' అని తెలిపింది. ప్రస్తుతం బన్నీ సరసన 'అలా వైకుంఠపురములో', ప్రభాస్‌కి జోడీగా మరో చిత్రంలో నటిస్తోంది.

## కోనాపురంలో జరిగిన కథేంటి?


'కోనాపురంలో జరిగిన కథ' చిత్ర పోస్టర్ ఆవిష్కరణ దృశ్యం

అనిల్ మొగిలి, సునీత హీరో హీరోయిన్లుగా, కె.బి.కృష్ణ దర్శకత్వంలో అనూష సినిమా పతాకంపై బట్టు అంజిరెడ్డి, మచ్చ వెంకట్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'కోనాపురంలో జరిగిన కథ'. ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్ లాంచ్ ఇటీవల జరిగింది. అతిథిగా విచ్చేసిన ఎంపీ జోగినిపల్లి సంతోష్ కుమార్ చిత్ర పోస్టర్, ట్రైలర్‌ని ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఈ చిత్ర హీరో అనిల్ మొగిలి, నిర్మాతలు అంజిరెడ్డి, వెంకట్‌రెడ్డి ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజక వర్గం గజ్వేల్ నుంచి వచ్చారు. సీఎం నియోజక వర్గం నుంచి వస్తున్న తొలి హీరో, నిర్మాతలే కాదు, తొలి సినిమా కావడం విశేషం. సామాజిక దృక్పథంతో, సామాజిక బాధ్యతతో కూడిన చిత్రమిది. కాబట్టి తెలుగు రాష్ట్ర ప్రజలందరూ ఆదరించి పెద్ద హిట్ చేయాలని కోరుతున్నా. హీరో, నిర్మాతలు, దర్శకుడికి నా అభినందనలు' అని అన్నారు.
'వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన దర్శకుడు కె.బి.కృష్ణ సినిమాని చాలా బాగా తెరకెక్కించారు. అవుట్‌పుట్ బాగా వచ్చింది. నవంబర్ 1న సినిమాని గ్రాండ్‌గా విడుదలకు ప్లాన్ చేస్తున్నాం' అని నిర్మాతలు చెప్పారు.

## మెప్పించే రొమాంటిక్ ఎంటర్‌టైనర్


'ఒరేయ్ బుజ్జిగా..' చిత్ర షూటింగ్ స్పాట్‌లో జరిగిన దర్శకుడు కొండా విజయ్‌కుమార్ బర్త్‌డే వేడుక దృశ్యం

రాజ్ తరుణ్, మాళవిక నాయర్ జంటగా కొండా విజయ్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఒరేయ్ బుజ్జిగా'. లక్ష్మీ రాధామోహన్ సమర్పణలో శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కె.కె.రాధామోహన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్ర షూటింగ్‌లో సోమవారం చిత్ర దర్శకుడు కొండా విజయ్ కుమార్ బర్త్‌డే వేడుక జరిగింది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత కె.కె.రాధామోహన్ మాట్లాడుతూ, 'సెట్‌లో మా దర్శకుడి బర్త్‌డేని సెలబ్రేట్ చేయడం ఆనందంగా ఉంది. ఒక డిఫరెంట్ స్టోరీతో, రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. శరవేగంగా చిత్రీకరణ జరుగుతుంది. దర్శకుడు ఈ సినిమాని చాలా బాగా తెరకెక్కిస్తున్నారు. ఇది మా బ్యానర్‌లో కచ్చితంగా మంచి హిట్ చిత్రంగా నిలుస్తుంది' అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్‌తరుణ్, మాళవిక నాయర్, వాణీవిశ్వనాథ్, సత్యం రాజేష్, మధునందన్, సినిమాటోగ్రఫీ ఆండ్రూతో ఇతర చిత్ర బృందం పాల్గొంది. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, ఎడిటింగ్: ప్రవీణ్ పూడి, ఆర్ట్: టి.రాజ్‌కుమార్.

# బడులు తెరిచే .. బస్సులు ఆగే!



- ఒకే రోజు వైదొలిగిన రెండువేల మంది తాత్కాలిక డ్రైవర్లు
- సెలవుల ముందుకంటే తక్కువగా రోడ్డెక్కుతున్న బస్సులు.
- డ్రైవర్లను పంపాలని విద్యాసంస్థలపై ప్రభుత్వం ఒత్తిడి

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

పాఠశాలలు పున:ప్రారంభమైనా బస్సులను ప్రజలకు అందుబాటులో తేవడంలో ఆర్టీసీ యాజమాన్యం విఫలమైంది. డ్రైవర్లు లేక బస్సులు రోడ్డెక్కించడంలో అధికారులు హైరానా పడుతున్నారు. మొన్నటి వరకు అద్దెబస్సులు, స్కూల్‌బస్సుల డ్రైవర్లతో ప్రభుత్వం నెట్టుకొచ్చింది. సోమవారం నుంచి బడులు మొదలవడంతో దాదాపు 2వేల మంది స్కూల్ బస్సుల డ్రైవర్లు ఒకే రోజు వైదొలిగారు. కాగా డ్రైవర్ల కోసం జిల్లాల్లో ఆర్టీఏ అధికారులు జల్లెడ పడుతున్నారు. కొన్ని బస్ డిపోలలో అయితే రోజుకు రూ. 2వేలు ఇస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ డ్రైవర్లు దొరకడం లేదు. దీంతో ప్రయాణికుల రద్దీకి అనుగునంగా బస్సులను నడపడంలో డిపో మేనేజర్లు నానా తంటాలు పడుతున్నారు. గత మూడు రోజులుగా బస్టాండ్లల్లో ప్రయాణీలు గంటల తరబడి ఎదురు చూస్తున్నా బస్సులు దొరకడం లేదు. ఆదే అదనుగా ప్రైయివేటు ట్రావెల్స్ అందినంత దోచుకుంటున్నారు.

ఆర్టీసీకి 10,460 సొంత బస్సులు, 2856 అద్దె బస్సులున్నాయి. వీటి నిర్వహణకు 18564 మంది డ్రైవర్లు, 20313 మంది కండక్టర్లు పని చేస్తున్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని గత 18 రోజులుగా ఆర్టీసీ కార్మికులు సమ్మె బాట పట్టారు. దసరాకు ముందు సమ్మె చేపట్టడంతో హడావుడిగా ప్రభుత్వం వేసిన అధికారుల కమిటీ కార్మికులతో చర్చించినప్పటికీ పరిష్కారం కాలేదు. ఒక వైపు దసరా పండుగ, మరోవైపు విద్యాసంస్థల సెలవులతో రాష్ట్రంలో ప్రయాణికులు బస్సుల్లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, అదిలాబాద్, ఖమ్మం, నల్లగొండ తదితర ప్రాంతాలలో ప్రజలు రాత్రుళ్లు జాగారం చేశారు. వెంటనే తేరుకున్న సర్కార్ రాష్ట్రంలోని ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలను నయానో బయానో ఒప్పించి దాదాపు రెండు వేల మందికి పైగా స్కూల్ బస్సు డ్రైవర్లను రంగంలోకి దించింది. దింతో అద్దె బస్సులకుతోడు ఆర్టీసీ బస్సులు రొడ్డెక్కడంతో ప్రభుత్వం కొంతమేరకు ఊపిరి పీల్చుకుంది. అయితే పాఠశాలలకు దసరా సెలవులు ఈనెల 13న ముగియాల్సి ఉన్నప్పటికీ ఆర్టీసీ బస్సులు రోడ్డెక్కడం కష్టమవుతుందని భావించి ఏకంగా సెలవులను 19వరకు పొడిగించారు. ఈ లోపూ బస్సుల నిర్వహణను గాడీలో పెట్టాలని భావించినప్పటికీ నిపుణులైన డ్రైవర్లను వెదికి పట్టుకోవడం సాధ్యం కాలేదు. దాంతో ప్రభుత్వం దసరా సెలవులను మరో వారం రోజుల పాటు పెంచాలని ఒక దశలో ఆలోచించినప్పటికి విద్యార్థుల చదువులను పణంగా పెడుతున్నారని వివిధ వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తడంతో విరమించుకుంది. ఈ నేపథ్యంలో విద్యాసంస్థలు ఈనెల 21 నుంచి యదావిధిగా పారంభమవడంతో ఆర్టీసీలో తాత్కాలికంగా పనిచేస్తున్న 2వేల మంది స్కూల్ బస్సుల డ్రైవర్లు ఒకే రోజు మానేయడంతో ప్రయాణికుల రద్దీకి తగ్గట్టుగా బస్సులను నడిపించడం అధికారులకు సాధ్యం కావడం లేదు. విద్యాసంస్థల ప్రారంభంతో సమ్మె ప్రారంభానికి ముందు వారం రోజుల పాటు ప్రయాణికులు ఎదుర్కొన్న కష్టాలు తిరిగి మొదలయ్యాయి. దానికి తోడు అద్దె బస్సులు సైతం అనుకున్న మేరకు తిరగడం లేదు. గత నాలుగు నెలలుగా తమకు చెల్లించాల్సిన పూర్తి స్థాయి బకాయిలు చెల్లిస్తేనే బస్సులను తిప్పుతామని కొంతమంది అద్దె బస్సుల యజమానులు మొండికేస్తున్నారు. ప్రభుత్వం నుంచి వస్తున్న ఒత్తిడి మేరకు ఇన్ని వేల బస్సులు నడిపాం, అన్ని వేల బస్సులు నడిపామని చెబుతున్నామే తప్ప అవసరానికి తగ్గట్టుగా నడపటంలేదని స్వయంగా అధికారులే ప్రయివేటు సంబాషణల్లో ఒప్పుకుంటున్నారు. దీంతో గత మూడు రోజులుగా బస్సుల్లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**విద్యాసంస్థలపై ఒత్తిడి**

డ్రైవర్ల కొరతతో ప్రయాణికుల అవసరానికి తగ్గట్టుగా బస్సులను రోడ్డెక్కించలేక అధికారులు హైరానా పడుతున్నారు. సమ్మె విరమించే వరకు విద్యాసంస్థలు తమ దగ్గర పనిచేస్తున్న స్కూల్ బస్సుల డ్రైవర్లలో సగం మందిని పంపించాలని ఆర్టీఏ, రెవెన్యూ, విద్యాశాఖ అధికారుల ద్వారా తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్టు యాజమాన్యాలు చెబుతున్నారు. ఒక వైపు ప్రభుత్వ ఒత్తిడి మరో వైపు తమ విద్యార్థులను గమ్యస్థానాలకు చేర్చాల్సి ఉండడంతో విద్యాసంస్థల యాజమాన్యాలు ఆందోళన చెందుతున్నాయి.

## ఆర్టీసీ ఇన్‌చార్జి ఎమ్‌డీపై చర్యలు తీసుకోవాలి

- ఆర్టీసీ కార్మికుల కోసం 24 నుంచి మూడ్రోజుల పాటు సంఘీభావ నిధి సేకరణ : సీఐటీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, ఎం.సాయిబాబు

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

ఆర్టీసీ ఉద్యోగులకు సెప్టెంబర్ నెల వేతనాలు ఇవ్వటానికి తమ సంస్థ దగ్గర డబ్బుల్లేవనీ, కేవలం రూ.7.49 కోట్లు మాత్రమే ఉన్నాయని తప్పుడు నివేదిక ఇచ్చిన ఆర్టీసీ ఇన్‌చార్జి ఎమ్‌డీపై హైకోర్టు కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, ఎం.సాయిబాబు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 24, 25, 26 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల నుంచి ఆర్టీసీ కార్మికుల కోసం సంఘీభావ నిధి సేకరణ చేయాలని పిలుపునిచ్చారు. పనిచేసిన సెప్టెంబర్ నెల వేతనాలు చెల్లించకపోవటం పేమెంట్ ఆఫ్ వేజెస్ యాక్ట్ - 1936 ప్రకారం నేరమనీ, తిరిగి ఆ నేరాన్ని కప్పిపుచ్చుకోవటానికి హైకోర్టుకు అవాస్తవాలతో ప్రభుత్వం తరపున నివేదిక ఇవ్వటం మరో నేరమని తెలిపారు. ఆర్టీసీ పరిరక్షణ కోసం జరుగుతున్న ఈ సమ్మెలో ప్రజలంతా ప్రత్యక్షంగా పాల్గొని రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. సాధారణ రోజుల్లో ఆర్టీసీకి ప్రతిరోజూ రూ.11.48 కోట్లు ఆదాయం వస్తుందని ప్రభుత్వమే చెప్తున్నదనీ, దీని ప్రకారం సమ్మె లేని సెప్టెంబర్ నెలలో వచ్చిన సుమారు రూ.345 కోట్ల ఆదాయాన్ని ఎవరికిచ్చారని ప్రశ్నించారు. ప్రభుత్వం కోర్టుకిచ్చిన నివేదికలో కార్మికుల నెల వేతనాల ఖర్చు రూ.240 కోట్లుగా పేర్కొన్నదనీ, అలాంటప్పుడు సెప్టెంబర్ నెల ఆదాయం రూ.345 కోట్ల నుంచి వేతనాలు చెల్లించేందుకు వచ్చిన ఆటంకం ఏమిటి? అని నిలదీశారు. ఇది కార్మికులను ఉద్దేశ్యపూర్వకంగా వేధించటమేననీ పేర్కొన్నారు. దసరా, దీపావళి పండుగలకు కార్మిక కుటుంబాలను పస్తులతో ఉంచాలని ప్రభుత్వం భావించటం ఆటవిక న్యాయం తప్ప మరొటి కాదని విమర్శించారు. ప్రభుత్వ మొండి వైఖరితో రోజురోజుకు చనిపోతున్న కార్మికుల సంఖ్య, యాక్సిడెంట్లలో మరణిస్తున్న ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. సాధారణ ప్రయాణికులను చంపే అధికారం ఈ ప్రభుత్వానికి ఎవరిచ్చారని ప్రజాస్వామిక వాదులంతా ప్రశ్నించాలని కోరారు.

## రేపు, ఎల్లుండి నిధి సేకరణ



- ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంఘీభావంగా..
- దీపావళి రోజు ఆర్టీసీ కార్మికులను ఇండ్లకు ఆహ్వానించాలి
- నవంబర్ 9న మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మహాసభ : ఖమర్‌అలీ, పాలడుగు

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంఘీభావంగా ఈ నెల 24, 25 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా నిధి వసూలు చేయనున్నట్టు, దానిని జిల్లాల్లో ఆర్టీసీ జేఏసీలకు అందజేయనున్నట్టు మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖమర్‌అలీ, పాలడుగు భాస్కర్ తెలిపారు. ఆ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం హైదరాబాద్‌లో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరిని విడనాడి ఆర్టీసీ జేఏసీతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జీతాలు వేయకపోవడాన్ని నిరసిస్తూ దీపావళి పండుగ రోజు ఆర్టీసీ కార్మికులను మున్సిపల్ కార్మికులు ఆహ్వానించి భోజనం పెట్టాలని పిలుపునిచ్చారు. కొత్త మున్సిపాల్టీల్లోనూ జీఓ నెంబర్ 14 ప్రకారం సమానంగా వేతనాలు చెల్లించాలనీ, పీఎఫ్, ఈఎస్ఐలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 6న మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నా చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీని ప్రకటించాలనీ, మున్సిపల్ కార్మికులకు 11వ పీఆర్‌సీలో రూ.24 వేలు వేతనం నిర్ణయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మూడో మహాసభలు నవంబర్ 9వ తేదీన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్టు ప్రకటించారు. ఆ మహాసభల్లో భవిష్యత్ కార్యాచరణను నిర్వహించబోతున్నామని తెలిపారు.

## గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ మృతి

**నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్**



ఫైల్ : గఫ్రొద్దీన్

ప్రభుత్వం తీరుతో మరో ఆర్టీసీ కార్మికుడి గుండె ఆగింది. సమ్మె చేపట్టి 18 రోజులవుతున్నా.. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతోపాటు, వేతనాలు అందజేయకపోవడంతో మనోవేదనకు గురై ఆర్టీసీ కార్మికుడు గుండెపోటుతో మృతిచెందాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట్ మండలం గోలిలింగాల్‌లో మంగళవారం జరిగింది. బాధిత కుటుంబీకుల వివరాల ప్రకారం.. మహమ్మద్ గఫ్రొద్దీన్ (36) నిజామాబాద్-2 డిపోలో ఆర్టీసీ డ్రైవర్. సమ్మె కొనసాగుతున్నా ప్రభుత్వం మొండివైఖరితో వ్యవహరించడం, వేతనాలు ఇంకా అందజేయకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురైయ్యాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న ఆయన.. వేతనాలు ఇచ్చేందుకు ఆర్టీసీ వద్ద డబ్బులు లేవనే ప్రకటన చూసినప్పటి నుంచి బెంగ పెట్టుకున్నాడు. దీంతో గుండెపోటు రాగా, కుటుంబీకులు చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్య లో మృతిచెందాడు. అతనికి భార్య పర్వీన్, ఆరు నెలల కుమార్తె హైజా ఫాతిమా ఉన్నారు.

## ఆర్టీసీ కార్మికులతో వెంటనే చర్చలు జరపాలి

- యూఎస్‌పీసీ- జాక్టో డిమాండ్

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ఆర్టీసీ కార్మికులతో ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు వెంటనే చర్చలు జరిపి సమ్మెను విరమింపచేసేందుకు చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ), ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (జాక్టో) డిమాండ్ చేశాయి. ఈ మేరకు యూఎస్‌పీసీ, జాక్టో నాయకులు సిహెచ్ రాములు, చావ రవి, జి సదానందంగౌడ్, ఈ రఘునందన్, వై అశోక్‌కుమార్, ఎం రాధాకృష్ణ, యు పోచయ్య, జి సోమయ్య, సయ్యద్ షౌకత్‌అలీ, కె కృష్ణుడు, కొమ్ము రమేశ్, శ్రీనివాస్, జాడి రాజన్న, ఎ గంగాధర్, మసూద్ అహ్మద్, ఎస్ హరికృష్ణ, శాగ కైలాసం, బి కొండయ్య, కె రామారావు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీ సమ్మెకు మద్దతుగా ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు ఉద్యమ కార్యాచరణ ప్రకటించారు. ఈనెల 23న సాయంత్రం ఆర్టీసీ డిపోల వద్ద చనిపోయిన కార్మికులకు నివాళులర్పిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టాలని కోరారు.

ఈనెల 24న పట్టణ ప్రాంతాల్లో జరిగే మహిళా కార్మికుల దీక్షలలో పాల్గొని సంఘీభావం ప్రకటించాలని తెలిపారు. ఈనెల 25న సాయంత్రం తాలుకా/డివిజన్ కేంద్రాల్లో ప్రదర్శనగా వెళ్లి ఆర్డీవో/ఎంఆర్‌వోలకు ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు సమర్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## గోదారిలో బోటు వెలికితీత

- గుర్తు పట్టలేని స్థితిలో ఏడు మృత దేహాలు
- ఫలించిన ధర్మాడి సత్యం బృందం కృషి



**దేవీపట్నం :** తూర్పు గోదావరి జిల్లా కచ్చులూరు వద్ద గోదావరిలో మునిగిపోయిన రాయల్ వశిష్ట బోటును ఎట్టకేలకు బయటకు తీశారు. ఘటన జరిగిన 38 రోజుల తర్వాత దీనిని వెలికితీయడం గమనార్హం. కాకినాడకు చెందిన ధర్మాడి సత్యం బృందం ఆధ్వర్యంలో బోటును వెలికితీసే ప్రయత్నాలు కొద్దిరోజులుగా జరుగుతున్న విషయం తెలిసిందే. కాగా, సత్యం బృందం, విశాఖ నుంచి తీసుకొచ్చిన స్కూబా డ్రైవర్లు.. నదీగర్భంలోకి వెళ్లి బోటును లంగర్లు, ఐరన్‌రోప్‌ల సాయంతో పైకి లాగారు. బోటులో గుర్తుపట్టలేని స్థితిలో ఉన్న ఏడు మృతదేహాలను గుర్తించిన అధికారులు.. వాటిని అక్కడ్నుంచి తరలించారు. మృతదేహాలు పూర్తిగా కుళ్లిపోయి ఎముకలు బయటపడుతున్నాయి. గతనెల 15న 77 మందితో పాపికొండల పర్యటనకు బయలుదేరిన వశిష్టబోటు.. కచ్చులూరు సమీపంలో గోదావరిలో మునిగిపోయింది. ఈ ప్రమాదంలో 39 మంది మృతి చెందగా.. 26 మంది సురక్షితంగా బయటపడ్డారు. మరో 12 మంది ఆచూకీ దొరకలేదు. దీంతో అప్పటినుంచి బోటు వెలికితీత ప్రయత్నాలు చేస్తున్నా అది సాధ్యపడలేదు. దీనిపై ధర్మాడి సత్యం స్పందిస్తూ.. లోతు ఎక్కువగా ఉండటం వల్లే బోటు వెలికితీత ప్రక్రియ ఆలస్యమైందని తెలిపారు.

# నేర భారతం..

**న్యూఢిల్లీ :** మోడీ ఇచ్చిన హామీలతో దేశప్రజలెవరూ సురక్షితంగా లేరని నేషనల్ క్రైమ్‌బ్యూరో రికార్డ్సును చూస్తే స్పష్టమవుతోంది. 2013తో పోలిస్తే మహిళలపై నేరాలు 16శాతం పెరిగాయి. బీజేపీ సర్కార్ 2014లో బాధ్యతలు చేపట్టిన అంతులేని దారుణాలు...ఘోరాలు జరుగుతున్నాయని కథనాలు వస్తూనే ఉన్నాయి. ఎన్సీఆర్బీ రిపోర్టులో వెనుకబడినవర్గాలైన దళితులు (షెడ్యూల్డ్ కులాలు), ఆదివాసీలు (షెడ్యూల్డ్ తెగలు)లపై - 2013తో పోలిస్తే వరుసగా 10శాతం, 5శాతం పెరిగాయి. చిన్నారులపై నేరాలు 2016-17 మధ్య 20శాతం పెరిగినట్టు పేర్కొంది.

**మహిళలపై ప్రతీ ఒకటిన్నర నిమిషానికో..**

2017లో మహిళలపై జరిగిన నమోదైన నేరాలు 3.59 లక్షలు. అంటే, ప్రతీ ఒకటిన్నర నిమిషానికో నేరం జరుగుతున్నది. 2013లో మహిళలపై జరిగిన నేరాలు 3.09 లక్షలు. అలాగే 2015లో 3,29,243 నమోదైనట్టు ఎన్సీఆర్‌బీ పేర్కొంది.

యూపీ నెం.1: ఈ నేరాలు బీజేపీ పాలిత రాష్ట్రం ఉత్తరప్రదేశ్‌లో ఎక్కువగా జరుగుతున్నట్టు నివేదిక తెలిపింది. 2017లో జరిగిన మొత్తం నేరాల్లో యూపీలో నమోదైనవి 56,011. అంటే దేశంలో జరిగే ప్రతి ఆరు నేరాల్లో ఉత్తరప్రదేశ్‌లో ఒకటున్నది. ఇక పోతే 31,979 నేరాలతో మహారాష్ట్రది రెండో స్థానం. 30,992 నేరాలతో మూడవ స్థానంలో పశ్చిమ బెంగాల్, 29,778 నాల్గవ స్థానంలో మధ్యప్రదేశ్, 25,993 నేరాలతో ఐదవ స్థానంలో రాజస్థాన్ నిలిచాయి. మహిళలపై నేరాలుగా వర్గీకరించబడిన కేసుల్లో హత్య, లైంగికదాడి, వరకట్న హత్యలు, ఆత్మహత్యలు, యాసిడ్ దాడి, మహిళలపై క్రూరత్వం, కిడ్నాప్ మొదలైనవి ఇందులో వున్నాయి.

**శిక్షా రేటు...**

2013లో మహిళలపై నేరాల కేసుల శిక్షా రేటు 21.3శాతం. ఇది 2017 లో 24.6శాతం. మహిళల భద్రతకు భరోసా ఇస్తున్నామని చెబుతున్న ప్రభుత్వాలు.. నిందితులను తక్షణ విచారణ జరిపి నిందితులను శిక్షించాలని చట్టాలు చెబుతున్నా... నలుగురిలో ఒకరు మాత్రమే శిక్షను అనుభవిస్తున్నారు. పోలీసు వ్యవస్థను మరింత మెరుగుపర్చాల్సిన అవసరాన్ని ఇది స్పష్టంచేస్తున్నది.

**దళితులు, ఆదివాసులపై దారుణాలు**

2017 ఎన్సీఆర్బీ నివేదిక వెలువరిచిన మరో విస్మయకరమైన విషయం ఏమిటంటే.. దళితులు, ఆదివాసులపై నేరాలు నిరంతరాయంగా కొనసాగుతూనే వున్నాయి. మోడీ పాలనలో అవి మరింత పెరుగుతున్నాయి. 2017లో దేశవ్యాప్తంగా వివిధ చట్టాల కింద దళితులపై 43,203 కేసులు నమోదయ్యాయి. మోడీ అధికారపగ్గాలు చేపట్టకముందు అంటే 2013తో పోలిస్తే ఇవి 10శాతం పెరిగాయి. అదేవిధంగా, ఆదివాసీలపై నేరాలు 2017లో 7,125 నమోదయ్యాయి. 2013లో వీటి సంఖ్య 6,793. 2014 లో దళితులు, ఆదివాసీలపై నేరాలు బాగా పెరిగాయి. ఎస్సీ / ఎస్టీ దురాగతాల నిరోధక చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి అధికార బీజేపీ అనుకూలంగా ఉందని 2014 ఎన్నికల తరువాత జరిగిన సంఘటనలు తేటతెల్లంచేశాయి. 2018లో సుప్రీంకోర్టు ఈ చట్టంపై తీర్పునివ్వగా.. దేశవ్యాప్తంగా ప్రగతిశీల వర్గాల నిరసనలు మిన్నంటాయి. ఈ చట్టాన్ని సమర్థించటంలో, సుప్రీంకోర్టు ఉత్తర్వులపై అప్పీలు చేయటంపై తొలుత వెనకడుగు వేసింది. తీవ్ర నిరసనల నేపథ్యంలో చివరకు కేంద్ర సర్కార్ దిగిరాక తప్పలేదు.

**గోహత్య ఘటనలపై వివరాలు సేకరించినా..**

కొట్టిచంపిన కేసులకు సంబంధించి ఎన్సీఆర్బీ కేసుల వివరాలు సేకరించినా.. వాటి గణాంకాలను మాత్రం విడుదల చేయలేదు. మూకదాడులు, ప్రభావవంతమైన వ్యక్తుల హత్యలు, ఖాప్ పంచాయతీల దారుణాలకు సంబంధించి గణాంకాలను విడుదలచేయలేదు.

'గోదాడులు.. ఇతర కొన్ని నేరాలను ప్రచురించకపోవటం సర్వత్రా ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ గణాంకాలు సిద్ధంగా వున్నాయి. విశ్లేషణ కూడా పూర్తయ్యింది. ప్రచురణకు నోచుకోకపోవటానికి కారణం పై అధికారులకు మాత్రమే తెలుసు' అని ఎన్సీఆర్బీ అధికారి ఒకరు చెప్పారు. దేశవ్యాప్తంగా మూక హింస, హత్యల సంఘటనలు ఎక్కువగా ఉన్నందున వీటిని హత్యా నేరాలతో కలిపేయకుండా ఉప విభాగాల కింద వర్గీకరించాలని డైరెక్టర్ ఇష్ కుమార్ నేతృత్వంలోని ఎన్సీఆర్బీ నిర్ణయించింది. కానీ, వాటి వివరాలను మాత్రం చివరి నిమిషంలో విడుదల కాలేదు. పశువుల దొంగతనం, లేదా అక్రమ రవాణా, పిల్లలను ఎత్తుకుపోతున్నట్టు పుకార్లుతో పాటు అనేక కారణాలతో కొట్టిచంపిన ఘటనలు జరిగాయి. మెజారిటీ కేసుల్లో గోరక్షణ పేరుతో జరిగిన దాడుల్లో ముస్లింలు, దళితులే బాధితులు కావటం గమనార్హం.

**కస్టడీ మరణాలు 100.. నేర నిర్ధారణ '0'**

దేశవ్యాప్తంగా 2017లో జరిగిన కస్టడీ మరణాల సంఖ్య 100 అని నివేదికపేర్కొంది. 2016లో ఈ సంఖ్య 92. కారాగారాల్లో 58 మంది చనిపోగా, పోలీసు కస్టడీలో 42 మంది మృతిచెందారు. ఇందులో అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లో 27మంది ప్రాణాలు కోల్పోయారు. గుజరాత్, మహారాష్ట్ర రెండో స్థానంలో నిలిచాయి. ఈ రెండు రాష్ట్రాల్లో 15 మరణాలు చోటుచేసుకున్నాయి. ఈ కస్టడీ మరణాలకు సంబంధించి ఒక్క కేసులో కూడా నేర నిర్ధారణ జరగలేదు. శిక్ష పడలేదని ఎన్సీఆర్బీ నివేదిక స్పష్టంచేసింది. ఈ 100 కేసులకుగాను 33 మంది పోలీసులను అరెస్టుచేయగా, 27 మందిపై చార్జిషీటు నమోదైనట్టు తెలిపింది.

**దేశ రాజధానిలో నాలుగు రెట్లు అధికం**

రాజధాని ఢిల్లీలో దేశ సగటు కంటే నాలుగు రెట్లు అధికంగా నేరాలు నమోదయ్యాయి. తాజాగా నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేశాయి. ఎన్సీఆర్బీ 2017 గణాంకాల ప్రకారం ఢిల్లీలో 1,050 నేర ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇది జాతీయ సగటు కంటే 238 నాలుగు రెట్లు అధికంగా ఉన్నట్టు నివేదిక పేర్కొంది.

# ఎట్టకేలకు.. దిగొచ్చిన సర్కార్

(మొదటిపేజీ తరువాయి)

రెండు షరతులు విధించింది. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం డిమాండ్‌ను స్వచ్ఛందంగా వదులుకుంటున్నట్టు కార్మిక సంఘాలు కోర్టుకు తెలిపినందున, ఆ ఒక్కటీ మినహాయించి, కోర్టు చెప్పిన 21 డిమాండ్లపైనే చర్చలు జరపాలని సూచించింది. అలాగే ఆర్టీసీ ప్రయివేటీకరణపై వెనక్కి తగ్గలేదని ముఖ్యమంత్రి కార్యాలయం స్పష్టం చేసింది. కేంద్రప్రభుత్వం అమల్లోకి తెచ్చిన మోటారు వాహన సవరణ చట్టం-2019ని రాష్ట్రంలో అమలు చేస్తామని, ఈ చట్టం ప్రకారం ఆర్టీసీలోకి ప్రయివేటు పెట్టుబడులను ఆహ్వానిస్తామని స్పష్టం చేసింది. ఆర్టీసీ జేఏసీతో చర్చలు జరపమని హైకోర్టు ధర్మాసనం ఈనెల 18వ తేదీ ఆదేశించిన విషయం తెలిసిందే. 19వ తేదీ ఉదయం 10.30 గంటలకు చర్చలు జరపమని కూడా న్యాయస్థానం పేర్కొన్నది. అయితే కోర్టు కేవలం చర్చలు జరపమని సూచన మాత్రమే చేసిందనే ప్రచారం జరిగింది. కానీ మంగళవారం ప్రభుత్వానికి అందిన కోర్టు ఉత్తర్వుల్లో చర్చలు జరపాల్సిందేనంటూ ధర్మాసనం సూచన కాకుండా ఆదేశాలే జారీ చేసింది. దీనితో తప్పనిసరై ప్రభుత్వం చర్చలకు సుముఖత వ్యక్తం చేయక తప్పలేదు. మరోవైపు ఆర్టీసీ కార్మికుల సమ్మె 18వ రోజూ ఉధృతంగా కొనసాగింది. వామపక్షపార్టీలు రెండు బృందాలుగా ఏర్పడి ఆయా జిల్లాల్లోని ఆర్టీసీ డిపోల్లో జరిగిన ఆందోళనల్లో పాల్గొన్నారు. కార్మికులతో మమేకమై ధైర్యం చెప్పారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కార్యదర్శివర్గ సభ్యులు బీ వెంకట్, జాన్‌వెస్లీ, సీపీఐ జిల్లా నాయకులు బాలనర్సింహా, సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు కె రమతోపాటు పలు ప్రజాసంఘాల నేతలతో కూడిన బృందం కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట డిపోల్లో జరిగిన ఆందోళనల్లో పాల్గొన్నది. మాజీ ఎమ్మెల్యే, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మల్లిఖార్జున్, సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు సూర్యం, సీపీఐ నాయకులు మంద పవన్ తదితరులతో కూడిన మరో బృందం మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని డిపోల్లో జరిగిన ఆందోళనల్లో పాల్గొన్నది. టీఎస్‌ఆర్టీసీ జేఏసీ రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు అన్ని డిపోల వద్ద ఆర్టీసీ కార్మికులు తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లకు పూలు ఇచ్చి, సమ్మె ప్రాధాన్యతను తెలిపి, తమ పొట్ట కొట్టొద్దని వేడుకున్నారు. దీనితో పలు జిల్లాల్లో తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లు విధుల నుంచి అర్ధంతరంగా వెళ్లిపోయారు. యాదగిరిగుట్ట, ఖమ్మంలో ఈ తరహా ప్రచారం చేస్తున్న ఆర్టీసీ కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. తాత్కాలిక డ్రైవర్లను ఇబ్బంది పెడితే కేసులు పెట్టి, అరెస్టు చేస్తామంటూ హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్‌లోని జూబ్లీబస్‌స్టేషన్‌లో వంటావార్పు నిర్వహించారు. టీఎస్‌ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ ఈ అశ్వత్థామరెడ్డి (టీఎమ్‌యూ), కో కన్వీనర్లు కె రాజిరెడ్డి (ఎంప్లాయిస్ యూనియన్), వీఎస్ రావు (స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్), ఓ సుధ (సూపర్‌వైజర్స్ అసోసియేషన్) పాల్గొన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నర్సింహారావు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు ఎల్ రమణ, రావుల చంద్రశేఖరరెడ్డితో పాటు ఇతర పార్టీల నేతలు సంఘీభావం తెలిపారు. తెలంగాణ జనసమితి రాష్ట్ర కార్యాలయంలో ఆర్టీసీ కార్మికుల సమ్మె-ప్రభుత్వవైఖరి అంశంపై ప్రొఫెసర్ కోదండరామ్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు.

## ఆర్టీసీ ఎమ్‌డీ చర్చలు జరపాలి

- హైకోర్టు ఉత్తర్వులు జారీ

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**



ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్, జేఏసీ ప్రతినిధులతో ప్రభుత్వం ఆర్టీసీ ఎమ్‌డీ చర్చలు జరపాలని 18న హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు మంగళవారం వెలువడ్డాయి. చర్చలు సానుకూల ఫలితాలు ఉంటాయని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్ఎస్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ అభిషేక్‌రెడ్డిలతో కూడిన డివిజన్ బెంచ్ అభిప్రాయపడింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి, ఆర్టీసీ ఎమ్‌డీలు పిటిషనర్లను చర్చలకు ఆహ్వానించాలని ఆదేశాలు ఇచ్చింది. ఆర్టీసీ యాక్ట్-1950లోని సెక్షన్ 34 ప్రకారం చర్చలు జరపాలని కార్పొరేషన్‌కు ఆదేశాలు జారీ చేసే అధికారం ప్రభుత్వానికి ఉందని తెలిపింది. చర్చలు జరిపి ఆర్టీసీ సమ్మె పరిష్కారం అయ్యేలా చేసి సామాన్యుల కష్టాలకు తెరదించుతారని ఆశిస్తున్నట్టు డివిజన్ బెంచ్ పేర్కొంది.

**రవిప్రకాశ్ అరెస్టుపై హైకోర్టు ఆగ్రహం**

టీవీ9 మాజీ సీఈవో రవిప్రకాశ్‌కు కోర్టు బెయిల్ ఇచ్చిన వెంటనే ఆయన విడుదల కాకుండానే ఇంకో కేసులో పోలీసులు ఆరెస్టు చేయడంపై హైకోర్టు మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. అన్ని కేసుల్లోనూ ఒకేసారి ఎందుకు అరెస్ట్ చూపడం లేదని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.శ్రీదేవి ప్రశ్నించారు. ఇటీవల బంజారాహిల్స్ పోలీసులు నమోదు చేసిన కేసులో బెయిల్ రాగానే ఇంకో కేసులో రవిప్రకాశ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారనీ, తాజా కేసులో పోలీస్ కస్టడీకి ఇవ్వకుండా స్టే ఉత్తర్వులు ఇవ్వాలని ఆయన లాయర్ కోరారు. గురువారం వరకూ స్టే ఇస్తున్నామనీ, ఆదే రోజు కేసును తుది విచారణ చేస్తామని హైకోర్టు తెలిపింది.

# మున్సిపోల్స్‌కు గ్రీన్‌సిగ్నల్

(మొదటిపేజీ తరువాయి)

చేసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన డివిజన్.. వాటి విషయంలో తాము జోక్యం చేసుకోబోమని తేల్చి చెప్పింది. అయితే సింగిల్ జడ్జి దగ్గరే ఈ వ్యవహారాన్ని పరిష్కరించుకోవాలని సూచించింది. తమ ముందున్న పిల్స్ విషయంలో తాము తీర్పు చెప్పామని స్పష్టం చేసింది. రాష్ట్రంలో 128 మున్సిపాల్టీలు, 13 మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి. వీటిలో హైదరాబాద్, గ్రేటర్ వరంగల్, ఖమ్మం కార్పొరేషన్ల ఎన్నికల గడువు పూర్తి కాలేదు. దీంతో మిగిలిన పది కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించాల్సివుంటుంది. 128 మున్సిపాల్టీల్లో 77 మున్సిపల్ ఎన్నికలపై హైకోర్టు సింగిల్‌జడ్జి స్టే ఆదేశాలిచ్చారు. వీటి విషయంలోనూ న్యాయపం^మైన అవరోధాలు తొలగింపునకు ఆదేశాలు ఇవ్వాలన్న ప్రభుత్వ ప్రయత్నాలు ఫలించలేదు. ఈ విషయాన్ని సింగిల్ జడ్జి దగ్గరే పరిష్కరించుకోవాలని డివిజన్ బెంచ్ తెలిపింది. నిర్మల్ జిల్లాకు చెందిన కె.అన్జుకుమార్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి వేర్వేరుగా దాఖలు చేసిన పిల్స్‌లో మున్సిపల్ వార్డుల విభజన, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల ఖరారు చట్ట నిబంధనల ప్రకారం చేయలేదన్నారు. రాజ్యాంగంలోని 243 జెడ్(జి) ఆర్టికల్ ప్రకారం ఎన్నికల వ్యవహారాల్లో కోర్టులు జోక్యం చేసుకోడానికి వీల్లేదని, రాజ్యాంగంలోని 329 ప్రకారం అయిదేండ్ల గడువు ముగిసిన మున్సిపాల్టీలకు ఎన్నికలు నిర్వహించాల్సిందేనని తేల్చి చెప్పింది. పిల్స్‌పై సుదీర్ఘంగా విచారించిన డివిజన్ బెంచ్ ఈ నెల 1న వాదనలు పూర్తి కావడంతో తీర్పును వాయిదా వేసినప్పుడే ఎన్నికల ముందస్తు ప్రక్రియ పూర్తి చేసుకునేందుకు డివిజన్ బెంచ్ అనుమతి ఇచ్చింది. ఈ పిల్స్‌లో స్టే ఇవ్వలేదని కూడా అప్పుడే స్పష్టం చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ మాత్రమే విడుదల చేయరాదని అప్పుడు ఆదేశించగా ఇప్పుడు ఆ అడ్డంకి తొలగిపోయేలా ఆ పిల్స్‌ను డిస్మిస్ చేస్తూ డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది. పాలకమండళ్ల అయిదేండ్ల గడువు ఈ ఏడాది జులై 2తో ముగిసిందని, మున్సిపల్ యాక్ట్‌లోని 10కి భిన్నంగా ముందస్తు ఎన్నికల ప్రక్రియ గడువు కుదిస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ ఆ తర్వాత జీవో 459 జారీ చేయడాన్ని సవాల్ చేసిన పిల్స్‌లో జోక్యం చేసుకోబోమని తీర్పులో పేర్కొంది. రాజ్యాంగంలోని 243 యు(3) ప్రకారం అయిదేండ్ల పాలకవర్గాల గడువు ముగిసేలోగా ఆయా మున్సిపాల్టీలకు ఎన్నికలు నిర్వహించాలని తీర్పులో పేర్కొంది. . నిర్ణీత గడువులోగా ఓటర్ల జాబితా, వార్డుల విభజన వంటివి ప్రభుత్వం చేయకపోవడం వల్ల రాష్ట్ర ఎన్నికల సంఘమే ముందుగా హైకోర్టుకు వచ్చింది. సింగిల్ జడ్జి వద్ద దాఖలైన పలు కేసుల్లో తీర్పు వెలువడింది. ముందస్తు ప్రక్రియకు 109 రోజులు, ఆపై మరో పది రోజులు సమయం తీసుకుని ఎన్నికలు నిర్వహించాలని సింగిల్ జడ్జి తీర్పు చెప్పారు. సింగిల్ జడ్జి ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వం ముందస్తు ఎన్నికల ప్రక్రియ గడువు కుదించి పూర్తి చేసింది. ఈ నేపథ్యంలో ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన డివిజన్ బెంచ్ వద్ద పిల్స్ దాఖలయ్యాయి. ఇవి విచారణలో ఉండగానే రిజర్వేషన్ల ప్రక్రియ, వార్డుల విభజన వంటి అంశాలపై పలు రిట్లు దాఖలయ్యాయి. వీటిని విచారించిన హైకోర్టు సింగిల్జ్ జడ్జి సుమారు 70 మున్సిపాల్టీల ఎన్నికలపై స్టే మంజూరు చేశారు. ఇప్పుడు డివిజన్ బెంచ్ తీర్పు వెలువడిన వెంటనే సింగిల్ జడ్జి వద్ద ఉన్నకేసుల్ని కూడా పరిష్కరించాలని, ఎన్నికలు అడ్డంకులు తొలగేలా చేయాలని ప్రభుత్వం తరపున అదనపు ఏజీ కోరారు. అందుకు డివిజన్ బెంచ్ అంగీకరించలేదు. స్టే ఇతర అంశాలపై సింగిల్ జడ్జి వద్దే తేల్చుకోవాలని డివిజన్ బెంచ్ ప్రభుత్వానికి బదులిచ్చింది. పిల్స్ విచారణ సమయంలో మాత్రం ప్రభుత్వం కోర్టు స్టే ఉత్తర్వులు లేని మున్సిపాల్టీలు, కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపింది. అందుకు తాము కూడా సిద్ధమేనని రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది. ఏ మున్సిపాల్టీకి ఆ మున్సిపాల్టీ చూడాలని, అన్నింటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని చట్టంలో లేదని కూడా చెప్పింది. డివిజన్ బెంచ్ తీర్పు నేపథ్యంలో స్టేలున్న మున్సిపాల్టీల వ్యవహారంపై ప్రభుత్వం ఏనిర్ణయం తీసుకుంటుందో మరి..!

## న్యాయం కోరుతూ ప్రగతి భవన్ ముట్టడి



**నవ తెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి**

కానిస్టేబుల్ పోస్టుల ఎంపికలో తమకు అన్యాయం జరిగిందంటూ వందలాది మంది కానిస్టేబుల్ అభ్యర్థులు మంగళవారం ప్రగతి భవన్ ముట్టడికి యత్నించారు. మార్గమధ్యంలోనే వారిని అడ్డుకుని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా అభ్యర్థులు చేసిన నినాదాలతో గోషామహల్ స్టేడియం హెూరెత్తింది. కానిస్టేబుల్ పోస్టులకు అభ్యర్థులు ఎంపికలో అవకతవకలు చోటు చేసుకున్నాయనీ, ముఖ్యంగా నార్మలైజేషన్ విధానం కారణంగా అర్హులైన అభ్యర్థులు అనేక మందికి పోస్టులు లభించక అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ.. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వందలాది తమంది కానిస్టేబుల్ అభ్యర్థులు హైదరాబాద్‌కు తరలివచ్చారు. వివిధ మార్గాల ద్వారా వారు ప్రగతిభవన్‌కు చేరుకోవడానికి తీవ్రంగా ప్రయత్నించారు. అప్పటికే అప్రమత్తమైన పోలీసులు ప్రగతి భవన్‌కు వచ్చే మార్గాలలో పెద్ద ఎత్తున మోహరించి అభ్యర్థులను అడ్డుకున్నారు. కాగా తాము న్యాయం చేయాలని కోరుతూ సీఎంను కలవాలని వచ్చామనీ, ఎలాంటి ఆందోళనలు చేయమని అభ్యర్థులు ఎంత మొత్తుకున్నా పోలీసులు వినకుండా వచ్చిన వారిని వచ్చినట్టే వాహనాలలోకి తోసి అక్కడి నుంచి తరలించారు. అరెస్టయిన వారిని గోషామహల్ స్టేడియంతో పాటు సీపీఎల్ అంబర్‌పేట్, పంజగుట్ట పోలీసు స్టేషన్ తదితర ప్రాంతాలకు తరలించారు. గోషామహల్‌కు తరలించిన అభ్యర్థులు అక్కడే నిరాహార దీక్షకు దిగారు. వాట్సాప్, టీవీల ద్వారా ఇతర ప్రాంతాలలో ఉన్న అభ్యర్థులందరూ గోషామహల్‌కు తరలిరావాలని పిలుపు నిచ్చారు. తుది రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు అనేక మంది పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్ణయించిన కటాఫ్ మార్కుల కంటే ఎక్కువ మార్కులు సాధించిన వారున్నారనీ, అయినప్పటికి వారిని ఎంపిక చేయకుండా అక్రమాలకు పాల్పడ్డారని ఈ సందర్భంగా అనేక మంది అభ్యర్థులు ఆరోపించారు. వరంగల్‌కు చెందిన మహిళా అభ్యర్థి ఒకరికి కటాఫ్ మార్కుల కంటే రెండు మార్కులు 120 వచ్చినా ఎంపిక చేయలేదని వారు ఆధారాలతో సహా చూపించారు. అలాగే లోకల్, నాన్ లోకల్ అభ్యర్థుల విషయంలోను అవకతవకలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. నార్మలైజేషన్ విధానం ద్వారా అనేక మంది అభ్యర్థులు అన్యాయానికి గురయ్యారని మహిళా అభ్యర్థులు అనేక మంది ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయమై రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డి, బోర్డు చైర్మెన్ వివి శ్రీనివాసరావులను కలిసి మొరపెట్టుకున్నామనీ, కాని వారు తాము చేసిందే ఒప్పని వాదిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన పోరాటాన్ని వదలబోమనీ, ఇప్పటికైనా సీఎం ముందుకు వచ్చి తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఎం డౌన్‌డౌన్, నార్మలైజేషన్ విధానాన్ని ఎత్తి వేయాలంటు అభ్యర్థులు చేసిన నినాదాలు గోషామహల్‌లో మిన్నంటాయి.



**లోనావాలా... ట్రెక్కింగ్, హైకింగ్, క్యాంపింగ్ కు ఈ ప్రదేశం ఎంతో అనుకూలం. దీనికి తోడు చారిత్రక నేపధ్యం కలిగిన అద్భుతమైన కోటలు, అక్కడి నుంచి కనిపించే పర్వతాల అందాలు ఈ ప్రాంతాన్ని అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా మార్చాయి. ఇక్కడ చూడాల్సిన ప్రదేశాలు ఎన్నో వున్నా ఎక్కువ మంది ఆసక్తి చూపే ప్రదేశాలు డ్యూక్స్ నోస్, లయన్స్ పాయింట్, భూషి డ్యామ్, లోనావాలా సరస్సు మొదలైనవి. లోనావాలా వెళ్లే వారు తప్పకుండా చూడాల్సిన ప్రదేశాలు ఏమిటో తెలుసుకుందాం...**



భజే గుహలు



భూషి డ్యామ్



డ్యూక్స్ నోస్



కార్లా కేవ్స్

# అబ్బురపరిచే అందాలు...

### భూషి డ్యామ్ అందాలు

ఇంద్రయాణి నదిపై భూషి డ్యామ్ నిర్మాణం జరిగింది. లోనావాలాలో చూడాల్సిన ముఖ్యమైన ప్రదేశాల్లో భూషి డ్యామ్ ఒకటి. ఈ ప్రాంతాన్ని సందర్శించేందుకు ఋతుపవనాల సమయం (మాన్ సూన్ సీజన్) ఎంతో అనువైనది. డ్యామ్‌లో అధికమైన నీరు భూషి డ్యామ్ మెట్లపై నుంచి పాలనూరగల్లా పారుతూ రావడం పర్యాటకులకు కనువిందు చేస్తుంది. వీకెండ్ సమయాల్లో, మాన్ సూన్ సీజన్‌లో ఇక్కడికి పర్యాటకుల తాకిడి చాలా అధికంగా ఉంటుంది.

### టైగర్స్ లీప్ వ్యూ పాయింట్

లోయలోకి ఓ పెద్ద పులి దూకుతున్న ఆకారంలో ఈ కొండ కనిపించడంతో దీనిని 'టైగర్స్ లీప్' అని పిలుస్తారు. లోనావాలా నుంచి 8 కిలోమీటర్ల దూరంలో ఉండే ఈ ప్రదేశం ఇక్కడి ముఖ్యమైన పర్యాటక ప్రాంతాల్లో ఒకటి. కనుచూపు మేర పశ్చిమ కనుమల సోయగాలు, నేలపైకి వచ్చినట్లు అనిపించే మబ్బుల గుంపులు, ప్రకృతి అందాలతో పాటు ట్రెక్కింగ్, హైకింగ్ వంటి సాహసాలనూ ఇక్కడ చేసే అవకాశం ఉంది.

### లోనావాలా సరస్సు

మబ్బుల దుప్పటి కప్పుకున్న పర్వతాలపై నుంచి కిందికి దూకే జలపాతాల పరవళ్లు ఒకేచోట సంగమించే అద్భుతమైన ప్రదేశమే 'లోనావాలా సరస్సు'. ఈ సరస్సు వద్ద ఉండే వంతెనపై నుంచి చూస్తే ఇవన్నీ ఒక క్రమపద్ధతిలో పర్యాటకులకు కనిపిస్తాయి. ఈ అందాలను కెమెరాల్లో బంధించి ఆనందించే వారు కొందరైతే.. ఆ కొండల అంచులకు చేరుకునేందుకు ట్రెక్కింగ్ చేసేవారు మరికొందరు ఉంటారు.

### డ్యూక్స్ నోస్ పై ట్రెక్కింగ్

లోనావాలా నుంచి 7 కిలోమీటర్ల దూరంలో ప్రముఖ పర్యాటక ప్రదేశం డ్యూక్స్ నోస్ ఉంది. అందమైన సహ్యాద్రి పర్వత శ్రేణులు, లోయలు, దట్టమైన అడవుల అందాలను వీక్షించేందుకు టూరిస్టులు ఇక్కడికి అధికంగా వస్తుంటారు. రాక్ క్లైంబింగ్, ట్రెక్కింగ్ వంటి సాహసోపేత అనుభూతులను పొందాలంటే డ్యూక్స్ నోస్ కు వెళ్లాల్సిందే. ప్రముఖ పిక్నిక్ స్పాట్ గా కూడా ఈ ప్రాంతం ప్రాముఖ్యత సంతరించుకుంది.

### లయన్స్ పాయింట్ వద్ద సూర్యాస్తమయం

భూషి డ్యామ్, ఆంబీ వ్యాలీ మధ్య లయన్స్ పాయింట్ ఉంది. ఈ కొండ పై భాగమంతా జలపాతాలు, పచ్చదనం పరచుకున్న లోయలు, మనోహరమైన పర్వతాలతో ఉత్తమ పర్యాటక ప్రదేశంగా నిలుస్తుంది. ఇక్కడి నుంచి సూర్యాస్తమయంను చూడడం ఓ అందమైన అనుభూతి.

### రాజ్ మచి కోట

లోనావాలా, ఖండాలాకు మధ్య ఉన్న రాజ్ మచి కోట.. కొత్త ఊపిరినిచ్చే అందాలతో, విస్తారమైన ప్రకృతి రమణీయతతో ప్రముఖ పర్యాటక కేంద్రంగా నిలిచింది. పశ్చిమ కనుమల పైన, ఈ సముదాయంలో రెండు కోటలు ఉన్నాయి. ఒకటి శ్రీవర్ధన్, మరొకటి మనరంజన్ శిఖరాల వద్ద ఉన్నాయి. ఈ కోటపై నుంచి డ్యూక్స్ నోస్, కరనాల, భీమశంకర్, ఉల్హస్ నది వంటి ప్రదేశాల ఏరియల్ వ్యూ అద్భుతంగా కనిపిస్తుంది.

### ఆంబీ వ్యాలీ

లోనావాలాకు 24 కిలోమీటర్ల దూరంలో ఉన్న అందమైన టౌన్ షిప్ ఆంబీ వ్యాలీ. సహారా ఇండియా పరివార్ వారు 10 వేల ఎకరాల పర్వత ప్రాంతంలో దీనిని నిర్మించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో, పట్టణ మౌలిక సదుపాయాలతో పిక్నిక్ స్పాట్ గా, వీకెండ్ ట్రావెల్ స్పాట్ గా ఈ టౌన్ షిప్ మారింది. సహజసిద్ధమైన ప్రకృతి పరిసరాలు, అత్యుత్తమ మౌలిక సదుపాయాలతో జీవితంలో ఒక్కసారైనా చూడాలనిపించే అద్భుతమైన ప్రదేశం ఆంబీ వ్యాలీ అని చెప్పవచ్చు.

### వాక్స్ మ్యూజియం

లోనావాలాలో చూడాల్సిన ముఖ్యమైన ప్రదేశాల్లో వాక్స్ మ్యూజియం ప్రముఖంగా చెప్పుకోదగ్గది. కేరళకు చెందిన కళాకారుడు సునిల్ కందలూర్‌తో 38 ఏండ్ల కిందట ఈ మ్యూజియం స్థాపించబడింది. రాజీవ్ గాంధీ, బెనజీర్ భుట్టో, కపిల్ దేవ్, ఏఆర్ రెహ్మాన్ వంటి ఎందరో ప్రముఖుల విగ్రహాలు జీవకళ ఉట్టిపడేలా ఇక్కడ కనిపిస్తాయి. ఛత్రపతి శివాజీ విగ్రహం ఇక్కడ ప్రత్యేక ఆకర్షణ.

### చిక్కీ షాపింగ్ చేయండి

లోనావాలాలో తప్పక చేయాల్సిన పనుల్లో ముఖ్యమైనది చిక్కీ షాపింగ్. ఈ స్వీట్‌కు ఇక్కడ డిమాండ్ ఎక్కువ. అందుబాటు ధరలతో పాటు ఆకట్టుకునే రుచులను అందించే నాణ్యమైన చిక్కీలు ఇక్కడ తప్ప మరెక్కడా దొరకవని చెప్పాలి.

### కార్లా కేవ్స్

భారతదేశంలో ఉన్న పురాతన బౌద్ధ గుహల్లో 'కార్లా కేవ్స్'కు ఎంతో ప్రాముఖ్యం ఉంది. సుమారు 2000 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ గుహల్లో నిర్మించిన చైత్యాలు, విహారాలు ఆనాటి కాలాన్ని కళ్లముందుంచుతాయి. లోనావాలాలో సందర్శించాల్సిన వాటిలో ఈ ప్రాచీన గుహలు కూడా ముఖ్యమైనవే.

### వాల్వన్ డ్యామ్

సాయంత్రపు సమయాన్ని అందమైన ప్రకృతి, పచ్చదనం మధ్య సంతోషంగా గడిపేందుకు లోనావాలాలో ఉన్న సరైన ప్రదేశం 'వాల్వన్ డ్యామ్'. సహ్యాద్రి పర్వత శ్రేణుల నుంచి వచ్చే నీటిని నిల్వ చేయడమే కాకుండా విద్యుత్‌ను ఉత్పత్తి చేసే కేంద్రంగానూ ఈ డ్యామ్ సేవలందిస్తుంది. ప్రశాంతమైన వాతావరణంతో పాటు ఫొటోగ్రఫీకి ఈ ప్రాంతం ఎంతో అనుకూలం.



### భజే గుహలు

లోనావాలాకు దగ్గర్లో ఉండే భజే గుహలు దేశంలో ఉన్న పురాతన గుహాలల్లో ప్రముఖమైనవి. ఇక్కడ ఒకే రాతిపై నిర్మించిన 22 గుహలు హీనయాన బౌద్ధుల నిర్మాణశైలికి అద్ధం పడతాయి. అత్యుత్తమైన పురాతన నిర్మాణ శైలి కలిగిన ఈ గుహలను ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పరిరక్షిస్తోంది.

### లోహగడ్ కోట

ఛత్రపతి శివాజీకి చెందిన కోటల్లో మహరాష్ట్రీయుల నిర్మాణ శైలితో రూపొందించబడిన కోట 'లోహగడ్'. శిల్పకల, కోటనిర్మాణమే కాదు అక్కడి నుంచి కనిపించే ప్రకృతి అందాలు ఇక్కడి మరో ప్రత్యేకం. లోనవాలా సందర్శించే పర్యాటకులు తప్పక చూడాల్సిన ప్రదేశాల్లో ఇది చెప్పుకోదగ్గది. దీనిని ఉక్కు కోటగా కూడా పిలుస్తారు. శివాజీ కాలంలో ఖైదీలను ఉంచడానికి, తరువాతి కాలంలో దోచుకున్న సంపదను దాచిపెట్టడానికి ఈ కోటను వినియోగించేవారు.

### బంగీ జంప్

లోనావాలాలో సాహసభరిత అనుభవాన్ని పొందాలంటే డెల్లా అడ్వెంచర్ పార్క్‌కు వెళ్లాసిందే. 150 అడుగుల ఎత్తు నుంచి కాళ్లకు తాడు కట్టుకుని దూకే బంగీ జంప్ ఇక్కడి ప్రత్యేకత. మరపురాని సాహస అనుభవాన్ని టూరిస్టులు ఇక్కడ పొందే అవకాశం ఉంది. ఈ సాహసం తర్వాత భయాన్ని జయించిన అనుభూతి లభిస్తుంది.

### ఆందోలిలో క్యాంప్

లోనావాలాలో ఉన్న ప్రముఖమైన ప్రదేశాల్లో ఆందోలి ఒకటి. ఉరుకుల పరుగుల జీవితం నుంచి కాసేపు సేదతీరాలనుకునే వారికి ఇది సరైన గమ్యస్థానం. ఆకర్షించే ప్రకృతి, జీవవైవిధ్యం, చుట్టూ పర్వతాల నడుమ 3.5 ఎకరాల స్థలంలో ఉండే ఈ ప్రాంతం హనీమూన్ జంటలకు, సాహసభరితులకు, కుటుంబ సభ్యులకు, స్నేహితులకు చక్కని అనుభూతులను పంచుతుంది. క్యాంపింగ్ వేసుకుని ఇక్కడి ప్రకృతి అందాలను ఆస్వాదించడం ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తుంది.

# ఊటీ వెలుతున్నారా..?



**విం**టర్ సీజన్ ప్రారంభం కావడంతో పర్యాటక ప్రాంతాలన్నీ కొత్త అందాలను అద్దుకుని టూరిస్టులను రారమ్మని పిలుస్తుంటాయి. వాటిలో ముఖ్యంగా చెప్పుకోదగ్గ ప్రదేశం తమిళనాడు రాష్ట్రంలోని ఊటీ హిల్ స్టేషన్. ఈ సీజన్‌లో హనీమూన్ జంటలతో పాటు ప్రకృతి ప్రేమికులు, సాహసాల పట్ల ఆసక్తి గలవారు ఊటీ వైపు అడుగులు వేస్తుంటారు. మంచు దుప్పటి కప్పుకున్న ఊటీ అందాలు టూరిస్టులకు ఎంతటి కనువిందు చేస్తాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మరి ఆ ప్రయాణంతో పాటు టూర్‌ను కూడా సంపూర్ణంగా ఎంజాయ్ చేసి రావాలంటే మీ ట్రావెల్ బ్యాగ్‌ను సర్ధాల్సిందే. ఊటీతో పాటు ఇతర హిల్ స్టేషన్లకు మీరు వెళ్తున్నట్లయితే ఈ సూచనలు పాటించండి...

- టూర్‌కు వెళ్లేటప్పుడు కొన్ని ముఖ్యమైన వస్తువులను బ్యాగ్‌లో సర్ది పెట్టుకోవడం ఎంతో ముఖ్యం. మీ అవసరాలకు ట్రావెల్ బ్యాగ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కనీస సదుపాయాలు లభించని కొన్ని ప్రదేశాల్లో దీని విలువ మీకు బాగా తెలుస్తుంది. పర్యటనలకు వెళ్లే ప్రతి ఒక్కరూ దూర ప్రదేశాలు, దగ్గర ప్రదేశాలనే ఆలోచన లేకుండా కొన్ని ముఖ్యమైన వస్తువులు ఎప్పుడూ బ్యాగ్‌లో వెంట తీసుకువెళ్లడం ఎంతో ఉత్తమం.
- రోజు వారీ అవసరమైన వస్తువులు పర్యటనలకు వెళ్లే ప్రదేశాల్లో చాలా దుకాణాల్లో దొరుకుతాయని భావించకండి. మీకు అవసరమైన వస్తువులు కొన్ని సార్లు అక్కడ లభించకపోవచ్చు. లేదా మీరు వాడే కొన్ని ముఖ్యమైన బ్రాండ్‌లు అక్కడ అమ్మకపోవచ్చు. కాబట్టి మీతో పాటు కొన్ని వస్తువులు ఎప్పుడూ మీ ట్రావెల్ బ్యాగ్ లో ఉంచండి. వాటిలో ముఖ్యమైనవి...
- టూత్ బ్రష్, టూత్ పేస్ట్
- చిన్న సైజు ఫేస్ వాష్ తో పాటు షాంపూ
- హ్యాండ్ శానిటైజర్, పేపర్ సోప్
- టిష్యూ పేపర్స్
- షేవింగ్ కిట్ లేదా ట్రిమ్మర్స్
- ప్రాథమిక వస్తువులు ప్యాక్ చేసుకున్న తరువాత ఎటువంటి బట్టలు మీతో పాటు తీసుకెళ్లాలని అనుకుంటున్నారో నిర్ధారించు కోండి. మీరు వెళ్లే ప్రదేశాలను, అక్కడి వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ ఎంపిక చేసుకోవడం ఉత్తమం. మీరు ఆ ప్రదేశానికి బయలుదేరే ఒకటి లేదా రెండు రోజుల ముందు అక్కడి వాతావరణ పరిస్థితులను చెక్ చేసుకోండి. ఊటీలో ఎప్పుడూ వాతావరణం మారుతూ ఉంటుంది. అక్కడి కొండలపై ఎప్పుడైనా వర్షం పడొచ్చు. కాబట్టి తప్పనిసరిగా ముందే సిద్ధమై ఉండాలి. ఇక అందరికీ తెలిసిన విషయం సమ్మర్‌లో తేలిక పాటు వస్త్రాలు, వింటర్‌లో కాస్త వెచ్చగా వస్త్రాలను ప్యాకింగ్‌లో భాగం చేసుకోవాలి.

### వింటర్‌లో అయితే...

- రెండు లేదా మూడు స్వెటర్లు (ఆ ప్రదేశంలో ఉండే రోజులను బట్టి)
- వెచ్చని సాక్స్ జతలు
- అన్ని అవసరాలకు ఉపయోగించే శాలువా
- ఊటీకు వెళ్లే వారు మాత్రం సీజన్‌తో సంబంధం లేకుండా ఈ లిస్ట్‌లోని వస్తువులను తమతో పాటు తీసుకువెళ్తే ఎంతో మంచిది.
- రెయిన్ కోట్ లేదా గొడుగు
- మంచి వాకింగ్ షూస్
- మీకు సూట్ అయ్యే ఏదైనా ఒక టోపీ
- మాయిశ్చరైజర్ (పర్వత ప్రాంతాల్లో చర్మం త్వరగా పొడిబారుతుంది)
- అత్యవసర సమయాల్లో ఉపయోగించేందుకు వీలుగా కొన్ని మందులు (తలనొప్పి, జలుబు, జ్వరం, వాంతులు వంటి సాధారణ అస్వస్థతల కోసం) మీతో పాటు తీసుకువెళ్లే ఎలక్ట్రానిక్ వస్తువులు (మొబైల్, కెమెరా తదితర) ఏదైనా సమస్య తెస్తే మీ ట్రిప్ ఊటీ ట్రిప్ కాస్త నిరాశగా మారుతుంది. కాబట్టి బ్యాటరీలు, చార్జర్లు, పవర్ బ్యాంక్, మొబైల్ కేస్ వంటి వస్తువులను వెంట తీసుకెళ్లడం ఉత్తమం.

వీటితో పాటు మీ ఊటీ ప్రయాణం వినోదభరితంగా సాగిపోవాలంటే మరికొన్ని వస్తువులను కూడా మీ వెంట ఉంచుకుంటే బాగుంటుంది.

- మీకు ఇష్టమైన మంచి పుస్తకాలు
- మ్యూజిక్ ప్లేయర్ తో పాటు మంచి హెడ్ ఫోన్స్
- పజిల్స్
- మ్యాగ్జిన్స్ లేదా న్యూస్ పేపర్స్
- జర్నీలో అప్పుడప్పుడు తీసుకునేందుకు కొన్ని స్నాక్స్ కూడా తీసుకువెళ్ళండి. ఎందుకంటే మార్గ మధ్యంలో అన్ని ప్రదేశాల్లో మనకు నచ్చిన ఆహార పదార్థాలు దొరకకపోవచ్చు.



# సంస్కృతి, సంప్రదాయాల కలబోత

**భా**రతదేశ పటం చూసినప్పుడు.. అందులోనే మరో దేశం కూడా కనిపిస్తుంది! కన్యాకుమారి దిగువన.. సముద్రంలో మధ్యన.. కాస్త అటూఇటూగా ముక్కోణాకృతిలో ఉండే ఆ చిన్న దేశమే శ్రీలంక. మనదేశంలో పుట్టిపెరిగిన బౌద్ధాన్ని ఆదరించి, ఆచరిస్తున్న ప్రాంతమది. సంస్కృతి, సంప్రదాయాల కలబోతగా పర్యాటక ప్రియులను అలరిస్తోంది. ప్రకృతి, పర్యావరణ ఆరాధకులకు.. అందరికీ ఆకట్టుకుంటుంది.

ప్రపంచంలోనే అందమైన దేశాలలో శ్రీలంక ఒకటి. శ్రీలంక భారతదేశానికి దక్షిణాన ఉన్న పొరుగు దేశం. శ్రీలంక రాజధాని కొలంబో. ప్రధాన భాష సింహళం. తరువాత ఎక్కువగా తమిళం మాట్లాడతారు. దక్షిణ దేశాలలో అత్యధిక అక్షరాస్యత కల దేశం కూడా ఇదే. 1972 వరకు శ్రీలంకను సిలోన్ అని పిలిచేవారు. 1948లో బ్రిటన్ నుండి స్వాతంత్ర్యం పొందింది. ఈ దేశంలో 100కు పైగా నదులున్నాయి. జలపాతాలతో పాటు జలవిద్యుత్ ఎక్కువే. అతి ప్రాచీనమైన మహాబోధియా అనే వృక్షం ఇక్కడే వుంది. ప్రపంచ వ్యాప్తంగా పేరుపొందిన సిలోన్ టీపొడి ఇక్కడే తయారవుతుంది. తేయాకు ఎక్కువగా పండిస్తారు. తేయాకు ఎగుమతులు కూడా ఎక్కువే.

**సిగిరియా కొండ :** లంకలో ప్రధాన ఆకర్షణ సిగిరియా కొండ. ఇది దంబుల్లా నగరం సమీపంలో ఉంటుంది. సింహాకృతిలో ఠీవీగా కనిపించే ఈ భారీ కొండ ఎత్తు 200 మీటర్లు. శ్రీలంక నాగరికతకు నిలువెత్తు నిదర్శనమిది. 5వ శతాబ్దంలో ఈ ప్రాంతాన్ని పాలించే కశ్యప అనే రాజు.. సిగిరియా కొండపై రాజప్రాసాదం, కోటలు కట్టించాడట. కోటకు వెళ్లే దారి వెంట నీటి కొలనులు, ఉద్యానవనాలు కనిపిస్తాయి. పైగా కొలనుల్లో ఫౌంటెయిన్లు ఉండటం, అవి నేటికీ పని చేస్తుండటం విశేషం. కొండపై నాటి రాజప్రాసాదాల శిథిల నిర్మాణాలు ఇప్పటికీ కనిపిస్తాయి. పచ్చిక బయళ్లు, భారీ వృక్షాలతో కొండ పైభాగం ఆహ్లాదభరితంగా ఉంటుంది. ఎన్నో వైవిధ్యాలకు నెలవైన సిగిరియా యునెస్కో వారసత్వ సంపదగా గుర్తింపు పొందింది.

పర్వతంపై అనేక ఔషధ వృక్షాలు నేటికీ కనిపిస్తాయి.

**వన్యమృగాలు :** వన్యమృగాల ప్రేమికులకు లంక పర్యటన మధురానుభూతిని అందిస్తుంది. దట్టమైన అడవులు, నదీనదాలు ఈ ద్వీపాన్ని పర్యావరణ కేంద్రంగా నిలబెట్టాయి. దంబుల్లాకు 30 కిలోమీటర్ల దూరంలో మిన్నేరియా నేషనల్ పార్క్‌లో ఏనుగులు మందలు మందలుగా సంచరిస్తుంటాయి. సిగిరియా వన్యప్రాణి సంరక్షణ కేంద్రంలోనూ ఏనుగులను చూడొచ్చు. శ్రీలంక దక్షిణ తీరంలోని యల నేషనల్ పార్క్ జీవ వైవిధ్యానికి పట్టుగొమ్మ. ఏనుగులు, ఎలుగుబంట్లు, చిరుతలు, జడలబర్రెలు ఇక్కడ ఎక్కువగా కనిపిస్తాయి. జూన్ నుంచి సెప్టెంబర్ సందర్శకుల తాకిడి ఉంటుంది. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పర్యాటకులను లోనికి అనుమతిస్తారు. ఇక్కడ సఫారీ చేయవచ్చు.

**ఆరామాలు :** భారత్ నుంచి లంకలోకి వ్యాప్తిచెందిన బౌద్ధధర్మం అక్కడ విశేష ప్రాచుర్యం. లంక జనాభాలో దాదాపు 70 శాతం మంది బౌద్ధ మతస్థులే. లంకలో బౌద్ధ ఆరామాలు కోకొల్లలు. శతాబ్దాల పాటు లంక రాజధానిగా వెలుగొందిన అనురాధపురలో చారిత్రక ఆలయాలు ఎన్నో ఉన్నాయి. దంబుల్లాలోని గుహాలయాలు ప్రముఖ పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధి చెందాయి. 150 మీటర్ల ఎత్తున్న గుహాలయాల్లో బుద్ధుడి ప్రతిమలు విశేషంగా ఆకర్షిస్తాయి. ఇక్కడే గోల్డెన్ బుద్ధ ఆలయాన్ని కూడా సందర్శించవచ్చు.

**ఇంకా చూడవలసినవి...**

- కాండీ–ఎల్లా రైలు ప్రయాణం శ్రీలంకలోని ప్రకృతి సౌందర్యాన్ని పరిచయం చేస్తుంది. సముద్ర తీరం వెంబడి, దట్టమైన అడవుల గుండా, పచ్చటి పొలాల మీదుగా సాగే రైలు ప్రయాణం ఎప్పటికీ గుర్తుండిపోతుంది.
- కాండీ, నువర ఏలియా ప్రాంతాల్లో తేయాకు తోటలు విస్తృతంగా ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో పర్యాటకులకు వసతి సౌకర్యాలు కూడా ఉన్నాయి.
- చుట్టూ సముద్రం ఉన్న లంకలో అందమైన బీచ్లు ఎన్నో ఉన్నాయి. కొలొంబో నుంచి మొదలుపెడితే జాఫ్నా వరకు ఎన్నో తీరాలు పర్యాటకులతో సందడిగా ఉంటాయి. బెన్టోటా బీచ్, ట్రింకోమలీ సమీపంలోని నీలవెళ్లి తీరం, తూర్పుతీరంలోని అరుగమ్, పస్సికూడ, దక్షిణ తీరంలోని మిరిస్సా తదితర బీచ్లు సంద్రంలో సాహసక్రీడలకు అడ్డాగా నిలుస్తున్నాయి.
- కొలొంబోకు 153 కి.మీ దూరంలోని మిరిస్సా తీరానికి ఓ ప్రత్యేకం ఉంది. ఇక్కడి నుంచి బోట్లో సముద్రంలోకి వెళ్తే.. బ్లూవేల్స్ ఉన్న ప్రాంతానికి చేరుకోవచ్చు. ఆ భారీ జలచరాల ఆటలను చూడొచ్చు.

**ఎలా వెళ్లాలి...?**

హైదరాబాద్ నుంచి శ్రీలంక నాన్‌స్టాప్, సింగిల్ స్టాప్ విమాన సర్వీసులు, చెన్నై నుంచి విమానాలు ఎక్కువగా అందుబాటులో ఉంటాయి. టికెట్ ఛార్జీలు రూ. 4,200 నుంచి రూ. 15,000 వరకు ఉంటాయి.






# క్లీన్‌గా కొట్టారు

టీమ్ ఇండియా సాధించింది. ప్రపంచ అత్యుత్తమ పర్యాటక జట్టు దక్షిణాఫ్రికాపై తొలి క్లీన్‌స్వీప్ విజయాన్ని సొంతం చేసుకుంది. విశాఖ, పుణె, రాంచి టెస్టుల్లో దక్షిణాఫ్రికాను అన్ని రంగాల్లోనూ చిత్తు చేసిన కోహ్లిసేన 3-0తో ఫ్రీడం సిరీస్‌ను గెల్చుకున్నది.
టీమ్ ఇండియా సాధించింది. స్వదేశంలో టెస్టు విజయాలకు స్పిన్నర్లనే నమ్ముకునే మూస సంప్రదాయానికి మంగళం పాడింది. స్పిన్ ట్రాక్‌లపై పేసర్లను ప్రయోగించి, వికెట్ల వేటలో కొత్త పంథా మొదలెట్టింది. తొలిసారి స్వదేశంలో టెస్టు సిరీస్‌ను పేసర్ల మెరుపులతో వశపర్చుకుంది.
టీమ్ ఇండియా సాధించింది. టెస్టుల్లో కీలక దశలోకి అడుగుపెడుతున్న తరుణంలో టాప్ ఆర్డర్‌కు పదును పెట్టడంలో విజయవంతమైంది. ఓపెనర్‌గా రోహిత్ శర్మను ప్రయోగాత్మకంగా పరిశీలించి, సెహ్వాగ్ శైలి ఆట తీరును రాబట్టుకుంది. ఓపెనర్‌గా ఆరంభ సిరీస్‌లోనే రోహిత్ శర్మ ఓ డబుల్ సెంచరీ, రెండు శతకాలతో చెలరేగాడు. భారత్ బ్యాటింగ్‌ను మరింత బలోపేతం చేశాడు.

- దక్షిణాఫ్రికాపై తొలి క్లీన్‌స్వీప్ విజయం
- 3-0తో ఫ్రీడం సిరీస్ భారత్ కైవసం
- 12 బంతుల్లోనే ముగిసిన లాంఛనం
- ఇన్నింగ్స్ 202 పరుగులతో ఘన విజయం



నవతెలంగాణ-రాంచి

రాంచి టెస్టులో టీమ్ ఇండియా ఘన విజయం సాధించింది. ఫాలోఆన్‌లో దక్షిణాఫ్రికాను 133 పరుగులకే కుప్పకూల్చిన భారత్.. ఇన్నింగ్స్ 202 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. ఓవర్‌నైట్ స్కోరు 132/8తో నాల్గో రోజు పోరాటం కొనసాగించిన దక్షిణాఫ్రికా, 12 బంతుల్లోనే చేతులెత్తేసింది. యువ స్పిన్నర్ షాబాజ్ నదీమ్ (2/18) వరుస బంతుల్లో రెండు వికెట్లు కూల్చి లాంఛనాన్ని ముగించాడు. కన్‌కషన్ సబ్‌స్టిట్యూట్ ఆటగాడు డీ బ్రూయిన్ (30), లుంగి ఎంగిడి (0) వరుస బంతుల్లో వికెట్ కోల్పోయారు. పేసర్లు మహ్మద్ షమి (3/10), ఉమేశ్ యాదవ్ (2/35) రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీతో చెలరేగిన ఓపెనర్ రోహిత్ శర్మ (212, 255 బంతుల్లో 28 ఫోర్లు, 6 సిక్స్‌లు) 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. విశాఖ టెస్టులో రెండు శతకాలు సహా రాంచిలో డబుల్ సెంచరీతో రోహిత్ శర్మ ' ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డునూ సొంతం చేసుకున్నాడు. మూడు మ్యాచుల ఫ్రీడం టెస్టు సిరీస్‌ను భారత్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. టెస్టు క్రికెట్ చరిత్రలో దక్షిణాఫ్రికాపై భారత్‌కు ఇదే తొలి క్లీన్‌స్వీప్ విజయం. 1935-36లో ఆస్ట్రేలియా చేతిలో వరుస టెస్టుల్లో ఇన్నింగ్స్ ఓటములు చవిచూసిన దక్షిణాఫ్రికా.. మళ్లీ భారత్ చేతిలో 2019లో వరుస టెస్టుల్లో (పుణె, రాంచి) ఇన్నింగ్స్ పరాజయాలను మూటగట్టుకుంది. మూడు టెస్టుల్లోనూ గెలుపొందిన కోహ్లిసేన ఐసీసీ టెస్టు చాంపియన్‌షిప్స్‌లో విలువైన 120 పాయింట్లు సాధించింది. ఓవరాల్‌గా 5 టెస్టుల్లో 240 పాయింట్లతో ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్స్ పాయింట్ల పట్టికలో వరల్డ్ నం.1 భారత్ అగ్రస్థానంలో కొనసాగుతోంది.

**52.60** భారత్, దక్షిణాఫ్రికా జట్ల బౌలింగ్ సగటు వ్యత్యాసం 52,60. భారత బౌలర్లు 22.84 సగటు సాధించగా, దక్షిణాఫ్రికా బౌలర్లు 75.44తో ఉన్నారు. భారత బౌలర్లు ఐదు సార్లు ఐదు వికెట్ల ప్రదర్శన చేయగా, సఫారీ నుంచి ఒక్కటీ లేదు.

**3-0** గాంధీ మండేలా ఫ్రీడం టెస్టు సిరీస్‌ను భారత్ 3-0తో సాధించింది. టెస్టు క్రికెట్‌లో దక్షిణాఫ్రికాపై భారత్‌కు ఇదే తొలి క్లీన్‌స్వీప్ విజయం.

**12 బంతుల్లోనే.. :** ఓవర్‌నైట్ స్కోరు 132/8తో దక్షిణాఫ్రికా నాల్గో రోజు బ్యాటింగ్‌కు వచ్చింది. చారిత్రక విజయానికి 2 వికెట్ల దూరంలో నిలిచిన టీమ్ ఇండియా.. అద్భుత దృశ్య ఆవిష్కరణకు ఎంతోసేపు ఎదురు చూడాల్సిన అవసరం రాలేదు. నాల్గో రోజు ఉదయం సెషన్లో 12 బంతులు, 15 నిమిషాల్లోనే కోహ్లిసేన పని పూర్తి చేసింది. నాల్గో రోజు దాడి మొదలెట్టిన మహ్మద్ షమి బంతి బంతికీ సఫారీ బ్యాట్స్‌మెన్‌కు ప్రాణ సంకటంలా తయారయ్యాడు. షమి నిప్పు కణికల్లాంటి ఆరు బంతులను కాచుకున్న సఫారీ బ్యాట్స్‌మన్.. యువ మాయగాడు షాబాజ్ నదీమ్‌కు దొరికిపోయారు. వరుస బంతుల్లో వరుస వికెట్లు కూల్చిన నదీమ్ దక్షిణాఫ్రికా పతనాన్ని శాసించాడు. కన్‌కషన్ సబ్‌స్టిట్యూట్ ఆటగాడు డీ బ్రూయిన్ (30) ఓవర్‌నైట్ స్కోరుకు ఒక్క పరుగు కూడా జోడించలేదు. నదీమ్ బంతిని ముందుకొచ్చి ఆడేందుకు ప్రయత్నించిన బ్రూయిన్.. మనసు మార్చుకుని బ్యాక్ కట్‌కు వెళ్లాడు. బొటన వేలికి గాయంతో మూడో రోజు పెవిలియన్‌కు పోయిన వికెట్ కీపర్ సాహా.. కండ్లుచెదిరే రీతిలో లో క్యాచ్ అందుకున్నాడు. దక్షిణాఫ్రికా తొమ్మిదో వికెట్‌లో భాగమయ్యాడు. తర్వాతి బంతినే లుంగి ఎంగిడి (0) నాన్ స్ట్రయికర్ మీదుగా ఆడాడు. నదీమ్ మెరుపు రిటర్న్ క్యాచ్‌తో దక్షిణాఫ్రికా పోరాటానికి తెర దించాడు. ఫ్రీడం సిరీస్‌లోనే దక్షిణాఫ్రికాకు 133 పరుగుల ఇన్నింగ్స్ అత్యల్పం. వరుస బంతుల్లో వరుస వికెట్లు కూల్చిన నదీమ్ హ్యాట్రిక్ ముందు నిలిచాడు. తర్వాతి టెస్టులో తొలి బంతికి నదీమ్ వికెట్ కూల్చితే.. అరుదైన హ్యాట్రిక్ సాధించిన ఆటగాడిగా నిలిచే అవకాశం ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో 162 పరుగులకే కుప్పకూలిన దక్షిణాఫ్రికా, రెండో ఇన్నింగ్స్‌లో 133 పరుగులే చేసింది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 497 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఇన్నింగ్స్ 202 పరుగుల భారీ తేడాతో రాంచి టెస్టులో ఘన విజయం నమోదు చేసింది.

**స్కోరు వివరాలు :**

**భారత్ తొలి ఇన్నింగ్స్ :** 497/9 డిక్లేర్డ్

**దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ :** 162/10

**దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ :** క్వింటన్ డికాక్ (బి) ఉమేశ్ యాదవ్ 5, డీన్ ఎల్గార్ (రిటైర్డ్ హర్ట్) 16, జుబయిర్ హమ్జా (బి) మహ్మద్ షమి 0, డుప్లెసిస్ (ఎల్బీ) మహ్మద్ షమి 4, తెంబ బవుమా (సి) వృద్ధిమాన్ సాహా (బి) మహ్మద్ షమి 0, హెన్రిచ్ క్లాసెన్ (ఎల్బీ) ఉమేశ్ యాదవ్ 5, జార్జ్ లిండె రనౌట్ (నదీమ్) 27, డేన్ పీట్ (బి) రవీంద్ర జడేజా 23, డీ బ్రూయిన్ (సి) వృద్ధిమాన్ సాహా (బి) నదీమ్ 30, కగిసో రబాడ (సి) రవీంద్ర జడేజా (బి) అశ్విన్ 12, అన్రిచ్ నొర్జె నాటౌట్ 5, లుంగి ఎంగిడి (సి,బి) నదీమ్ 0, ఎక్స్‌ట్రాలు : 06, **మొత్తం : (48 ఓవర్లలో ఆలౌట్) 133.**

**వికెట్ల పతనం :** 1-5, 2-10, 3-18, 4-22, 5-36, 6-67, 7-98, 8-121, 9-133, 10-133.

**బౌలింగ్ :** మహ్మద్ షమి 10-6-10-3, ఉమేశ్ యాదవ్ 9-1-35-2, రవీంద్ర జడేజా 13-5-36-1, షాబాజ్ నదీమ్ 6-1-18-2, అశ్విన్ 10-3-28-1

**35** ఫ్రీడం సిరీస్‌లో భారత్, దక్షిణాఫ్రికా జట్ల వికెట్ల వ్యత్యాసం 35. మూడు మ్యాచుల్లో భారత్ 60 వికెట్లు పడగొట్టగా, దక్షిణాఫ్రికా 25 వికెట్లు మాత్రమే సాధించింది. భారత్, దక్షిణాఫ్రికా సిరీస్‌లో ఇదే అత్యధిక వికెట్ల వ్యత్యాసం.

'ఓపెనర్‌గా అవకాశం ఇచ్చిన జట్టు మేనేజ్‌మెంట్‌కు కృతజ్ఞతలు. కొత్త బంతిని ఎదుర్కోవటంలో ఎన్నో సానుకూలతలు సాధించాను. కొత్త బంతి ఎప్పుడూ ప్రమాదకరమే, ఎదురుదాడి చేయగలగటం పెద్ద సానుకూలత. ఇక్కడ్నుంచి నా ఆటను ముందుకు తీసుకెళ్తాను. 2013లో వన్డేల్లో ఓపెనర్‌గా ఆరంభించినప్పటి నుంచీ కుదురుకునేందుకు కొంత సమయం తీసుకుంటాను. నా బ్యాటింగ్‌లో అది సహజ లక్షణమైంది. ఇన్నింగ్స్ ఆరంభంలో చూపించే క్రమశిక్షణ విలువైన ఫలితాల్ని ఇస్తుంది. భారీ స్కోర్లు ఆత్మవిశ్వాసం పెంపొదించాయి. భారీ స్కోర్లు చేయాలి, క్రీజులో నిలవాలి, జట్టును ముందు నిలపాలనే తపన నాలో ఎప్పుడూ ఉంటుంది. ఓపెనర్‌గా విజయవంతం కావడానికి కెప్టెన్ కోహ్లి, కోచ్ శాస్త్రి సహకారం ఎంతో ఉంది.'

- రోహిత్ శర్మ
(మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్).

'విశాఖ టెస్టులో 431 ఇన్నింగ్స్ తర్వాత అంతా చిరాకు కలిగించిన పర్యటనే. కొన్ని సానుకూలతలు ఉన్నాయి, కానీ ప్రతి టెస్టులో మేం మరిన్ని పొరపాట్లు చేశాం. ఘనత భారత జట్టుకు దక్కుతుంది. అన్ని రంగాల్లోనూ కోహ్లిసేన ఆధిపత్యం చెలాయించింది, మానసికంగా మమ్మల్ని ఒత్తిడిలోకి నెట్టింది. స్పిన్, పేస్, బ్యాటింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో భారత్ స్పష్టమైన పైచేయి సాధించింది. 2015 భారత పర్యటన తర్వాత ఇక్కడి వస్తున్నామంటే స్పిన్ పిచ్‌లకు సిద్ధం కావటమే. నిజానికి ఎంతో పోటీతత్వ పిచ్‌లు ఎదురయ్యాయి. భారత బౌలర్లు సరైన ప్రదేశాల్లో బంతులు సంధించారు. ఇదంతా బౌలర్ల నైపుణ్యానికి సంబంధించిన విషయం. తర్వాతి పర్యటనకు మెరుగ్గా సన్నద్ధం అయ్యేందుకు ఈ అనుభవం తోడ్పడుతుంది. వరుసగా 11 స్వదేశీ సిరీస్ విజయాలు అమోఘం'

- డుప్లెసిస్, దక్షిణాఫ్రికా కెప్టెన్

'బీసీసీఐ అధ్యక్షుడిగా ఎన్నిక కాబోతున్న సౌరవ్ గంగూలీకి అభినందనలు తెలిపాను. మాజీ కెప్టెన్ దాదా బీసీసీఐ బాస్ కానుండటం గొప్ప విషయం. మహేంద్రసింగ్ ధోని విషయమై గంగూలీ నాతో మాట్లాడలేదు. అవసరం అనుకున్నప్పుడు నన్ను సంప్రదిస్తాడని అనుకుంటున్నాను. గంగూలీ పిలుపు రాగానే వెళ్లి కచ్చితంగా కలుస్తాను'

- విరాట్ కోహ్లి, భారత కెప్టెన్



# నేటి నుంచి దాదాగిరి

- బాధ్యతలు అప్పగించనున్న సీఓఏ

నవతెలంగాణ - ముంబయి

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కొత్త శోభను సంతరించుకోనుంది. 2013 ఐపీఎల్ స్పాట్ ఫిక్సింగ్ కుంభకోణం తర్వాత జరిగిన పరిణామాలతో బీసీసీఐలో సమూల సంస్కరణలకు అత్యున్నత న్యాయస్థానం కీలక చర్యలు తీసుకుంది. జస్టిస్ లోధా కమిటీ సిఫారసుల అమలుకు మాజీ కాగ్ వినోద్ రాయ్ సారథ్యంలో పాలకుల కమిటీ (సీఓఏ)ను నియమించింది. 2017 జనవరిలో ఏర్పాటైన వినోద్ రాయ్ పాలకుల కమిటీ బీసీసీఐ, రాష్ట్ర క్రికెట్ సంఘాల్లో సంస్కరణల కోసం కృషి చేసింది. బీసీసీఐ ఆఫీస్ బేరర్ల అధికారాలను తానే స్వయంగా స్వీకరించిన పాలకుల కమిటీ.. బీసీసీఐకి ప్రొఫెషనల్ అడ్మినిస్ట్రేషన్ పరిచయం చేసేందుకు ప్రయత్నించింది. పాలకుల కమిటీలోనే విభేదాలు, బీసీసీఐ ఆఫీస్ బేరర్ల ధిక్కారం, రాష్ట్ర సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనా జస్టిస్ లోధా కమిటీ సిఫారసుల అమలుకు రాయ్ కమిటీ రంగం సిద్ధం చేసింది. బీసీసీఐ నూతన రాజ్యాంగం ప్రకారం బీసీసీఐ నూతన పాలక మండలి నేడు ఎన్నిక కానుంది. అధ్యక్షుడు, కార్యదర్శి, ఉపాధ్యక్షుడు, కోశాధికారి పదవులకు ఒక్కొక్కరు మాత్రమే నామినేషన్ దాఖలు చేశారు. భారత మాజీ కెప్టెన్, బెంగాల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ బీసీసీఐ 39వ అధ్యక్షుడిగా నేడు జరిగే వార్షిక సర్వ సభ్య సమావేశం (ఏజీఎం)లో బాధ్యతలు స్వీకరించనున్నాడు. భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా కుమారుడు జై షా కార్యదర్శిగా ఎన్నిక కానున్నాడు. బీసీసీఐ మాజీ అధ్యక్షుడు అనురాగ్ ఠాకూర్ సోదరుడు, హిమాచల్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ప్రేమ్ కుమార్ ధుమాల్ కుమారుడు అజయ్ కుమార్ కోశాధికారిగా బాధ్యతలు అందుకోనుండా, మాజీ క్రికెటర్ బ్రిజేశ్ పటేల్ ఐపీఎల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనున్నాడు. నేడు ముంబయిలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో బోర్డు ఏజీఎం జరుగనుంది.

**సీఓఏపై చర్యలు వద్దు :** బీసీసీఐ సంస్కరణల పర్వం పర్యవేక్షణ, అమలు చూసిన పాలకుల కమిటీ సభ్యులపై ఎటువంటి న్యాయపరమైన చర్యలు తీసుకోవడానికి వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నూతనంగా ఎన్నిక కానున్న బీసీసీఐ పాలక మండలికి బాధ్యతలు అప్పగించాలని ఈ సందర్భంగా కోర్టు రాయ్ కమిటీకి తెలిపింది. ' బీసీసీఐ నూతన పాలక మండలి ఎన్నికతో సీఓఏ కథ ముగుస్తుంది. అభ్యంతరాలు, ఆరోపణల నుంచి కమిటీ సభ్యులు విముక్తులు అవుతారు. మంచి ఉద్దేశంతో పని చేసిన కమిటీ సభ్యులపై తదుపరి ఎటువంటి చర్యలు తీసుకోవడానికి వీల్లేదు. వ్యక్తిగతంగా, బృందంగా కమిటీ సభ్యులపై ఎటువంటి చర్యలు తీసుకోవడానికి వీల్లేదు' అని సుప్రీంకోర్టు మంగళవారం తెలిపింది. పాలకుల కమిటీ సభ్యులుగా పని చేసిన కాలానికి ఆకర్షణీయ మొత్తంలో వేతనం అందించాలని బోర్డును ఆదేశించింది. 2017లో నెలకు రూ. 10 లక్షలు, 2017లో నెలకు రూ. 11 లక్షలు, 2018లో నెలకు రూ. 12 లక్షల చొప్పున పాలకుల కమిటీ సభ్యులకు వేతనం 48 గంటల్లోగా చెల్లించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

# సింధు శుభారంభం

- నేడు సైనా, శ్రీకాంత్ పోరు
- ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్



**పారిస్ :** ప్రపంచ చాంపియన్ పి.వి సింధు ఫ్రెంచ్ ఓపెన్‌లో శుభారంభం చేసింది. వరుసగా చైనా, కొరియా, డెన్మార్క్ ఓపెన్‌లలో నిరాశపరిచిన సింధు పారిస్‌లో పతకమే లక్ష్యంగా బరిలోకి దిగింది. మహిళల సింగిల్స్‌లో వరల్డ్ నం.6 సింధు వరుస గేముల్లో గెలుపొందింది. కెనడా షట్లర్ మిచెలీ లీపై 21-15, 21-13తో వరుస గేముల్లో విజయం సాధించింది. గతంలో మిచెలీ లీ రెండు సార్లు సింధుపై విజయం సాధించింది. ఆరంభ రౌండ్లలో తడబడుతున్న సింధును పారిస్‌లోనూ ఇబ్బంది పెట్టవచ్చని భావించింది. కానీ సింధు తొలి రౌండ్లో మెరుగ్గా రాణించింది. 41 నిమిషాల్లోనే తొలి రౌండ్ గండం గట్టెక్కింది. రెండో రౌండ్లో సింగపూర్ షట్లర్ యో జియా మిన్‌తో సింధు తలపడనుంది. వరల్డ్ నం.26 సింగపూర్ షట్లర్‌కు వరల్డ్ చాంపియన్‌తో ఇదే తొలి ముఖాముఖి పోరు. పురుషుల సింగిల్స్‌లో శుభాంకర్ దే 15-21, 21-16, 21-16తో టామీ సుగియార్టో (ఇండోనేషియా)పై మూడు గేముల్లో పోరాడి గెలుపొందాడు.

మహిళల సింగిల్స్‌లో మాజీ వరల్డ్ నం.1 సైనా నెహ్వాల్ నేడు తొలి రౌండ్లో పోటీపడనుంది. హాంగ్‌కాంగ్ షట్లర్ చెంగ్ నగన్ యితో సైనా పోటీపడనుంది. పారుపల్లి కశ్యప్ తొలి రౌండ్లో అదృష్టం పరీక్షించుకోనున్నాడు. కిదాంబి శ్రీకాంత్‌కు రెండో సీడ్ చో తిన్ చెన్ (చైనీస్ తైపీ) తొలి సవాల్ విసరనున్నాడు. డబుల్స్‌లో సాత్విక్, చిరాగ్ శెట్టి జోడీ, అశ్విని పొన్నప్ప, సిక్కి రెడ్డి నేడు తొలి రౌండ్లో బరిలోకి దిగనున్నారు.

# ఆర్‌సీఈపీ నుంచి భారత్ వైదొలగాలి

## డబ్ల్యూటీవో ఒప్పందం కంటే ఇది ప్రమాదకరం

- ఏఐకేఎస్‌సీసీ రాష్ట్ర సదస్సులో వక్తలు
- 25న కలెక్టరేట్ల వద్ద ధర్నాలకు పిలుపు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రాంతీయ సమగ్ర, ఆర్థిక భాగస్వామ్యం (ఆర్‌సీఈపీ) పేరుతో 16 దేశాలతో జరుగుతున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం నుంచి భారతదేశం వైదొగాలనీ అఖిలభారత రైతాంగ పోరాట సమన్వయ సమితి (ఏఐకేఎస్‌సీసీ) రాష్ట్ర సదస్సులో వక్తలు డిమాండ్ చేశారు. డబ్ల్యూటీవో ఒప్పందం కంటే ఇది అత్యంత ప్రమాదకరమైందని వారు హెచ్చరించారు. ఒప్పందంతో వ్యవసాయం మరింత సంక్షోభంలో కూరుకుపోతుందని తెలిపారు. రైతులు, పాల ఉత్పత్తిదారుల జీవనోపాధిపై తీవ్రమైన ప్రభావం పడుతుందనిన్నదని వివరించారు. ఏఐకేఎస్‌సీసీ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్వీకేలోని దొడ్డికొమరయ్య హాల్లో 'ఆర్‌సీఈపీ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ప్రతిఘటిద్దాం...రైతులు, పాల ఉత్పత్తిదారుల జీవనోపాధిని కాపాడుకుందాం' అనే అంశంపై రాష్ట్ర సదస్సు జరిగింది. దీనికి తెలంగాణ రైతుసంఘం ఉపాధ్యక్షులు అరిబండి ప్రసాదరావు అధ్యక్షత వహించారు. ఆర్‌సీఈపీ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి నిరసనగా 25న జిల్లా కలెక్టరేట్ల ముందు ధర్నాలు, నిరసనలు చేయాలని సదస్సు పిలుపు ఇచ్చింది. ఆర్‌సీఈపీ ఒప్పందాల నుంచి భారతదేశం బయటికి రావాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కేంద్రానికి లేఖ రాయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐకేఎస్ జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ ఆర్‌సీఈపీ ఒప్పందం చేసుకుంటే వ్యవసాయం, పరిశ్రమలతోపాటు అనేక రంగాలపై ప్రభావం పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్లు, బడా కార్పొరేట్లకు అనుకూలంగా ఈ ఒప్పందం ఉంటుందనీ, దీంతో దేశీయ ఉత్పత్తులు పడిపోతాయన్నారు. మన దేశం నుంచి ఎగుమతులు పెరిగిపోయి, దిగుమతులు ఇబ్బడిముబ్బడిగా వచ్చి పడుతాయని హెచ్చరించారు. గతంలో చేసుకున్న ఒప్పందాలకు అతీతంగా ఒప్పందాలు ఉంటాయని చెప్పారు. ఒప్పందం ప్రకారం కార్పొరేట్లపై ఎలాంటి పన్నులు వేయడానికి వీలు ఉండదన్నారు. సరుకులకు పన్నులు, ప్రత్యేక రక్షణ పన్నులు కూడా ఉండబోవని తెలిపారు. ప్రత్యేక సరుకులకు దిగుమతి సుంకాలు ఉండవన్నారు. కొన్ని సరుకులు డబ్ల్యూటీవో పరిధిలో ఉన్నా ఈ ఒప్పందం ప్రకారం పన్నులు ఉండవని చెప్పారు. విచ్చలవిడిగా వస్తున్న దిగుమతులతో మన ఉత్పత్తులు ధరలు తగ్గి ఉత్పత్తి విస్తీర్ణం తగ్గుతుందని చెప్పారు. మందుల పరిశ్రమల పూర్తిగా దెబ్బతింటున్నదనీ, వంట నూనెల దిగుమతితో ఇప్పటికే ఆయిల్‌ఫామ్ రైతులు దెబ్బతిన్నారని గుర్తు చేశారు. ఏఐకేఎస్‌సీసీ జాతీయ కన్వీనర్ వేములపల్లి వెంకట్రామయ్య మాట్లాడుతూ బహుళజాతి, కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేయడానికి బీజేపీ సర్కారు కంకణం కట్టుకుందని విమర్శించారు. ఆర్‌సీఈపీ ఒప్పందంతో ఎగుమతులు కంటే దిగుమతులు పెరిగిపోయి వాణిజ్య లోటు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అసమానతలు ఉన్న దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చేసుకోవడమంటే మన ఉనికిని ప్రశ్నార్థం చేసుకోవడమేనన్నారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి సాగర్ మాట్లాడుతూ ఈ ఒప్పందంతో మన రాష్ట్రంలో పాడి పరిశ్రమ దెబ్బతింటుందని హెచ్చరించారు. ఈ ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. రైతు స్వరాజ్య వేదిక నేత విస్సా కిరణ్ మాట్లాడుతూ ఈ ఒప్పందంతో వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర పెంచడానికి ఆంక్షలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి రంగయ్య, మహిళా హక్కుల రైతు వేదిక నాయకులు శిరీష, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు బి ప్రసాద్, రైతు స్వరాజ్ వేదిక నేత కొండల్, భాస్కర్ తదితరులు మాట్లాడారు.


మాట్లాడుతున్న ఏఐకేఎస్ జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.
epaper.navatelangana.com